www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 7-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 219 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ.11.06 తదుపరి తదియ; నక్షత్రం: రోహిణి రా.12.33 తదుపరి మృగశిర; వర్జ్యం: సా.5.31-6.55, తె.5.33 మొదలు; దుర్ముహూర్తం: ఉ.8.35-9.20, మ.12.21-1.06; అమృతఘడియలు: రా.9.44-11.08; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.19; సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో

## ఎన్‌కౌంటర్

నలుగురు మావోయిస్టుల మృతి? 14



మనీషా

### ఈ చీమలతో బతకడం నా వల్ల కాదు

- లేఖ రాసి.. వివాహిత బలవన్మరణం
- చిన్నప్పటి నుంచి ఆమెకు చీమలంటే భయం
- కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నా ఫలితం శూన్యం
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన

3



అహ్మద్

### డ్రగ్స్ ఓవర్ డోస్.. యువకుడి మృతి!

- ఓ స్నేహితుడు, ఇద్దరు యువతులతో కలిసి అపార్టుమెంట్‌లో ఉంటున్న యువకుడు
- లక్డీకాపూల్‌లో డ్రగ్స్ తెచ్చుకున్నట్లు నిర్ధారణ
- అతడి స్నేహితుల్లో ఇద్దరికి డ్రగ్స్ పాజిటివ్?

14



### సురేశ్ రైనా, ధవన్‌ల ఆస్తులు జప్తు

- ఇద్దరి ఆస్తుల విలువ రూ.11.14 కోట్లు
- రైనా మ్యూచువల్ ఫండ్స్ రూ.6.64 కోట్లు
- శిఖర్ ధవన్ స్థిరాస్తులు రూ.4.50 కోట్లు
- అక్రమ బెట్టింగ్ సైట్ ప్రమోషన్ కేసులో ఈడీ చర్య

2



# మరో డిప్యూటీ?

## బీసీ నేతను ఉప ముఖ్యమంత్రి చేసే యోచనలో కాంగ్రెస్

టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌కు అవకాశం?

అదే జరిగితే టీపీసీసీకి కొత్త అధ్యక్షుడు

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకూ అవకాశాలు

స్థానిక ఎన్నికల తర్వాత ముహూర్తం

ప్రమాదంలో పలువురి మంత్రి పదవులు

అజారుద్దీన్ బాటలో చోటు కోసం సీనియర్ నేతల యత్నాలు



హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని బీసీలను తమ ఓటు బ్యాంకుగా మలుచుకునే ప్రయత్నాల్లో ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం.. ఆ వర్గానికి చెందిన నేతను డిప్యూటీ సీఎం చేయనుందా? స్థానిక ఎన్నికల తర్వాత మంత్రుల శాఖల్లో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయా? మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణకూ చాన్స్ ఉందా? కొందరు మంత్రుల స్థానే కొత్త ముఖాలను తీసుకునే అవకాశం ఉందా?.. కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ప్రస్తుతం జోరుగా సాగుతున్న చర్చ ఇది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, ఆ తర్వాత జరిగే స్థానిక ఎన్నికల్లో మంత్రుల పనితీరును బట్టి పునర్ వ్యవస్థీకరణపై అధిష్ఠానం నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ నమూనాను ప్రచారాస్త్రంగా చేసుకోవాలని నిర్ణయించిన కాంగ్రెస్ అధిష్ఠానం.. విధానపరమైన అంశాలను తెలంగాణలో అమలు చేస్తూ వస్తోంది. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను పార్టీ ఓటు బ్యాంకుగా మలుచుకునే ప్రయత్నాల్లో భాగంగా బీసీ రిజర్వేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చింది. అధిష్ఠానం ఆదేశాల మేరకు

మిగతా 12వ పేజీలో...



### ప్రతి ఓటరునూ పోలింగ్ బూత్‌కు రప్పించండి

ఓటింగ్ ఎంత పెరిగితే కాంగ్రెస్ మెజారిటీ అంత పెరుగుతుంది

జూబ్లీహిల్స్‌లో మనకే అనుకూలం

అయినా ఏమాత్రం నిర్లక్ష్యం వద్దు

బస్తీలు, కాలనీల్లో సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వండి

ఉప ఎన్నికపై మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

12



### మరమ్మతులు చేయకుంటే బ్లాక్‌లిస్ట్‌లోకే..

మేడిగడ్డ బ్యారేజీపై ఎల్‌అండ్‌టీకి సర్కారు హెచ్చరిక

వారంలోగా సానుకూలంగా స్పందించకుంటే.. డిపాజిట్లు, పెండింగ్ బిల్లులను జప్తు చేస్తాం

రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేస్తామని స్పష్టీకరణ

ఉద్దేశపూర్వకంగానే ఒప్పంద నిబంధనల ఉల్లంఘన

డిజైన్ లోపాల సాకుతో పునరుద్ధరణ నుంచి తప్పించుకునేందుకు ఎల్‌అండ్‌టీ ఎత్తుగడ

12

### తక్షణమే బకాయిలు చెల్లించండి

లేదంటే డిసెంబరు 1 నుంచి పనులన్నీ ఆపేస్తాం

ప్రభుత్వానికి తేల్చి చెప్పిన భారత బిల్డర్ల సంఘం

అప్రాధాన్య పనులకు 18వేల కోట్లు పెండింగ్

ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్థిక, పంచాయతీరాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులకు లేఖలు

14

జూబ్లీహిల్స్ ఫలితం.. ప్రభుత్వంపై

# రెఫరెండమే

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల కోపం బయటపడుతోంది



కాంగ్రెస్ ఓడిపోతుందని రేవంత్ భయం

అందుకే ముఖ్యమంత్రి అయి ఉండీ గల్లీల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు

అసలు ఇప్పుడున్నది బీజేపీ కాంగ్రెస్

బీజేపీతో కలిసి పనిచేస్తోంది

బానిసకే బానిస అన్నట్లు రేవంత్ పరిస్థితి

కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కలిసి బీజేపీ అభ్యర్థిని బకరా చేస్తారు

కవిత అప్పుడు మా పార్టీలో ఉండేది.. ఇప్పుడు కాదు

టీడీపీ సానుభూతిపరుల ఓట్లు బీఆర్‌ఎస్‌కే వస్తాయి

బీఆర్‌ఎస్ మరింత ఎక్కువ మెజారిటీతో గెలుస్తుంది

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు రెఫరెండమేనని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఎన్నిక తెలంగాణ ప్రజానీకానికి ఒక కనువిప్పు అవుతుందని చెప్పారు. తమ పార్టీ గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నిక నేపథ్యంలో కేటీఆర్ 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో అధికార మార్పిడి జరగకపోవచ్చు. కానీ మేం కొట్లాడేది ఈ ఒక్కసీటు గెలవడంకోసం కాదు.. ఈ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు ఎంత కోపంగా ఉన్నారన్నది బయటపడుతుంది. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు సీఎంగా ఉంటే తెలంగాణలో కాంగ్రెస్ మరో 15ఏళ్లు గెలిచే పరిస్థితి ఉండదు. మీడియా మేనేజ్‌మెంట్‌తో ఎన్నిరోజులు మభ్యపెడతారు. ప్రజలు తిప్పికొట్టబోతున్నారని, అధిష్ఠానానికి విషయం తెలిసిపోతుందని రేవంత్‌రెడ్డి భయపడుతున్నారు. అందుకే ఏ సీఎం కూడా తిరగనంతగా గల్లీల్లో తిరిగి ప్రచారం చేస్తున్నారు. గతంలో ఏ సీఎం అయినా కుల సంఘాలతో మీటింగ్ పెట్టిన ఉదంతాలు ఉన్నాయా? ఈ సీఎం పెడుతున్నారు. సినీ కార్మికులను ప్రసన్నం చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు" అని కేటీఆర్

మిగతా 13వ పేజీలో...

### 'ఫాతి' సభకు అనుమతులు రద్దు

14

అసెంబ్లీ పరిసరాల్లో సభకు అనుమతి లేదన్న పోలీసులు

హైకోర్టును ఆశ్రయించిన ఫాతి.. నేడు విచారణ

11న తలపెట్టిన విద్యార్థుల మహా ర్యాలీ 15కి వాయిదా

శ్రీదేవిసనపై 'ఫాతి' వ్యాఖ్యలు అభ్యంతరకరం

ఖండించిన తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం



# సింధ్ కొండల్లో రహస్య సొరంగాలు

- భూగర్భ గదులూ నిర్మిస్తున్న పాకిస్థాన్ సైన్యం!
- అణ్వాయుధ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దాయాది
- నోరియాబాద్, కంబేర్-షాదాద్‌కోట్‌ల్లో శరవేగంగా పనులు
- ఇవి 'అణు' సన్నాహాలే.. సింధ్ ప్రాంత సంస్థల వాదన
- అడ్డుకోవాలంటూ ప్రపంచ సంస్థలకు లేఖలు



ఇస్లామాబాద్, నవంబరు 6: పాకిస్థాన్ అణ్వాయుధాలను పరీక్షిస్తోందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను మన దాయాది దేశం నిజం చేస్తున్నట్టే కనిపిస్తోంది. అణు పరీక్షల కోసం సింధ్ ప్రాంత కొండలను ఆ దేశం సిద్ధం చేస్తున్నదన్న వార్తలు వస్తున్నాయి. దీనికోసం పాక్ సైన్యం అక్కడి కొండలను తొలచి రహస్య సొరంగాలను, భూగర్భ గదులను నిర్మిస్తున్నదంటూ సింధూదేశ్ అనే వేర్పాటువాద సంస్థ, అక్కడి పౌర సమాజ గ్రూపులు వాదిస్తున్నాయి. ఈ ప్రయత్నం నుంచి పాక్‌ను అడ్డుకోవాలంటూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ తోపాటు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ, ఐరాస అనుబంధ మానవహక్కులు, అణు నిరాయుధీకరణ విభాగాల ప్రతినిధులకు అవి లేఖలు రాశాయి. అతి గోప్యంగా అణు పరీక్షలు నిర్వహించడం లేక భారత దాడులకు అందనంత దూరంగా తన అణ్వాయుధ నిల్వలను తరలించడం అనేది ఈ సన్నాహాల వెనుక పాక్ ఉద్దేశం అయి ఉండవచ్చునని అవి తెలిపాయి. దీనివల్ల సింధ్ ప్రాంత భద్రత ప్రమాదంలో

మిగతా 2వ పేజీలో...



రాహుల్ ప్రస్తావించిన బ్రెజిలియన్ లారిస్సా

### ఇదేం పిచ్చి?

దేవుడా మనం ఎలాంటి ప్రపంచంలో బతుకుతున్నాం!

2

హరియాణాలో 22 ఓటర్ ఐడీల్లో తన ఫొటో వాడడంపై బ్రెజిల్ మహిళ వ్యాఖ్య

రాహుల్ ప్రెస్‌మీట్‌లో ప్రస్తావించడంతో ఆమె ఆచూకీ కోసం వెతికిన నెటిజన్లు

### 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్'కు 5 కోట్ల మంది మద్దతు

ఎన్నికల అక్రమాలపై ప్రజల్లో ఆందోళన

రేపు అన్ని రాష్ట్రాల్లో ఫ్లాగ్-ఆఫ్

2

రెండోదశలో తిరిగి సంతకాల సేకరణ

వాటిని రాష్ట్రపతికి, ఈసీకి అందిస్తాం

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్

## మాగంటి చావుకు కారణం కేటీఆరే

ఇది గోపీనాథ్ తల్లి అంటున్న మాట

రేవంత్‌కు దమ్ముంటే విచారణ జరిపించాలి

సీఎం పదవి కోసం కేటీఆర్ ఏమైనా చేస్తారు

కవితక్కా.. మీ తండ్రి బాగోతం చూసుకో..

టోపీ పెట్టుకున్న రేవంత్‌ను చూస్తే నటుడు వేణుమాధవ్ గుర్తుకొస్తారు: కేంద్ర మంత్రి సంజయ్

బోరబండలో రోడ్ షోకు అనుమతి లేదని తొలుత ప్రచారం.. బీజేపీ వర్గాల సీరియస్

అనుమతి ఉన్నా, లేకున్నా వస్తానన్న బండి

ఆ తర్వాతే ర్యాలీకి ఓకే చెప్పిన పోలీసులు



హైదరాబాద్ సిటీ/బోరబండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాగంటి గోపీనాథ్ చావుకు కేటీఆరే కారణమని, ఇది గోపీనాథ్ తల్లి చెప్పిన మాట అని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే.. గోపీనాథ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌కు రోషం ఉంటే

మిగతా 13వ పేజీలో...

### కుటుంబ కథా చిత్రమ్!

గోపీనాథ్ వారసత్వంపై కొనసాగుతున్న వివాదం

శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ

హాజరైన మొదటి భార్య మాలిని, కొడుకు ప్రద్యుమ్న

లాయర్‌తో వచ్చిన గోపీనాథ్ చిన్న కూతురు దిశిర

25కు విచారణ వాయిదా

గోపీనాథ్ చావే ఒక మిస్టరీ.. కేటీఆరే జవాబు చెప్పాలి

తల్లి మహానందకుమారి సంచలన వ్యాఖ్యలు

14

25 ఏళ్లుగా ఎందుకు రాలే?

సునీత లాయర్ లలితారెడ్డి

న్యూయార్క్ ప్రజలు.. ఫ్లోరిడాకు

## పారిపోవాల్సిందే!



డెమొక్రాట్లు ఓ కమ్యూనిస్టును కూర్చోబెట్టారు

అమెరికాను క్యూబా, వెనెజువెలాలా మార్చాలని యత్నం

న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక విపత్తు తప్పదు

కమ్యూనిజమా, కామన్‌సెన్సా? ఏది కావాలో తేల్చుకోవాలి

మమ్దానీ చాలా ఆగ్రహంగా ప్రసంగించారు

2

నా పట్ల మర్యాదగా ఉంటే మంచిది: ట్రంప్ హెచ్చరిక



పట్నాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

### తొలి దశలో 64.66% ఓటింగ్

బిహార్ చరిత్రలో తొలిసారి భారీ పోలింగ్

18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకున్న 3.75 కోట్ల మంది

2

## కేంద్రంపై మళ్లీ సీజేఐ ఆగ్రహం

నేటి విచారణ వాయిదా వేయండి

ఏజీ తరఫున ఏఎస్‌జీ అభ్యర్థన

కుదరదన్న సీజేఐ జస్టిస్ గవాయ్

'ట్రైబ్యునళ్ల సంస్కరణల' కేసులో తుది వాదనలు వింటాం

సోమవారం ఏజీ రాకపోతే కేసును ముగిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 6: ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను వాయిదా వేయాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది అసమంజసమని, ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఒకవేళ ఈ నెల 24 తర్వాత కేసు విచారణ కోరుకుంటున్నారా? అని నిలదీసింది. ఈ నెల 3న

మిగతా 2వ పేజీలో...

# సురేశ్ రైనా, ధవన్‌ల రూ.11.14 కోట్ల ఆస్తుల జప్తు

**» అక్రమ బెట్టింగ్ సైట్ ప్రమోషన్ కేసులో ఈడీ చర్య**

న్యూఢిల్లీ, నవంబరు 6: అక్రమ బెట్టింగ్ సైట్ కేసుకు సంబంధించి మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధవన్‌కు చెందిన రూ.11.14 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. 1x బ్యాట్ సైట్, ఇతర అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌తో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో రైనాకు చెందిన మ్యుచువల్ ఫండ్స్ పెట్టుబడులు రూ.6.64 కోట్లను, ధవన్‌కు చెందిన రూ.4.5 కోట్ల స్థిరాస్థులను ఈడీ సీజ్ చేసింది. ఈ కేసుకు సంబంధించి రైనా, ధవన్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. అక్రమ బెట్టింగ్ కుంభకోణంలో రూ.1000కోట్ల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. "అన్నీ తెలిసీ" 1x బ్యాట్ బెట్టింగ్ సైట్, దాని సరోగేట్ యాప్‌లను ప్రమోట్ చేసేందుకు విదేశీ సంస్థలతో రైనా, ధవన్ ఒప్పందం కుదుర్చుకున్నారని, ఈ మేరకు ఇద్దరికీ విదేశాల నుంచి అక్రమపద్ధతిలో చెల్లింపులు జరిగాయని ఈడీ పేర్కొంది. సదరు విదేశీ సంస్థలు భారత్‌లోని వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని 1x బ్యాట్, 1x బ్యాట్ స్పోర్టింగ్ లైన్స్ తదితర సైట్లను నిర్వహిస్తున్నారంటూ పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ కేసు ఈడీ చేతుల్లోకి వెళ్లింది. భారత్‌లోని దాదాపు 6వేల మ్యూల్ అకౌంట్ల ద్వారా 1x బ్యాట్ సైట్ కార్యకలాపాలను సాగిస్తున్నట్లు దర్యాప్తులో ఈడీ గుర్తించింది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా మరో మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, నటుడు సోనూసూద్, టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి, బెంగాల్ నటుడు అంకుశ్ హజ్రాను ఇప్పటికే ఈడీ ప్రశ్నించింది.

# ఇదేం పిచ్చి?

**» హరియాణాలో 22 ఓటర్ ఐడీల్లో తన ఫొటో వాడడంపై రాహుల్ ప్రస్తావించిన మోడల్ స్పందన**

న్యూఢిల్లీ, నవంబరు 6: హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓట్ చోరీపై 'హైడ్రోజన్ బాంబు' పేల్చే క్రమంలో.. రాహుల్ గాంధీ ప్రస్తావించిన మోడల్ ఎవరో తెలిసిపోయింది. ఆమె బ్రెజిలియనే. కానీ మోడల్ కాదు. పేరు లారిస్సా నెరీ. తన స్నేహితుడైన ఫొటోగ్రాఫర్ మాథ్యూస్ ఫెరైరో ఫొటోలకు 2017లో అలా పోజులిచ్చిందంతే! అది తప్ప ఆమె మోడలింగ్ చేసిన ఫొటోలు మరేవీ లేవు. రాహుల్ తన మీడియా సమావేశంలో ఆమె ఫొటోను ప్రదర్శించి.. 'ఈమె ఎవరు?' అని ప్రశ్నించడంతో నెటిజన్లంతా ఆమె ఆచూకీ కోసం గూగుల్‌లో, ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో తెగ గాలించారు. రాహుల్ ప్రదర్శించిన ఫొటో ఆధారంగా ఇమేజ్ సెర్చ్ కూడా చేశారు. కానీ ఎక్కడా ఆమె ఆచూకీ తెలియరాలేదు. అయితే.. తన ఫొటో ఇంటర్‌నెట్‌లో సెన్సేషన్‌గా మారడంతో లారిస్సా నెరీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా స్పందించారు. అది తన పాత ఫొటో అని.. ఆ ఫొటో తీసే సమయానికి తన వయసు 18-20 ఏళ్లని తెలిపింది. "గైస్.. అది పాత ఫొటో.. ఇండియాలో ఎన్నికల కోసమో.. ఓటింగ్‌కు సంబంధించో.. నా ఫొటోను వాడుకుంటున్నారు. ప్రజలను మోసం చేయడానికి నన్ను భారతీయురాలిగా చిత్రీకరిస్తున్నారు. ఇదేం పిచ్చి? ఇదేం వెర్రి? దేవుడా.. మనం ఎలాంటి ప్రపంచంలో బతుకుతున్నాం" అని నవ్వుతూ ఆశ్చర్యం వెలిబుచ్చింది. తాను ప్రస్తుతం ఒక సెలూన్‌లో పనిచేస్తున్నానని.. తన ఫొటో వైరల్ కావడంతో ఒక పాత్రికేయుడు తాను పనిచేస్తున్న సెలూన్‌కు ఫోన్ చేసి ఇంటర్వ్యూ కోసం కూడా అడిగాడని తెలిపింది.

## లోకం తీరు




# చెరువులో వేలాది ఆధార్‌కార్డులు

**» 'సర్' కొనసాగుతున్న వేళ బెంగాల్‌లో వివాదం**

కోల్‌కతా, నవంబరు 6: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) సాగుతున్న సమయంలో పశ్చిమ బెంగాల్‌లోని ఓ చెరువులో వేలాది ఆధార్‌కార్డులు లభించడం రాజకీయ దుమారం రేపింది. పూర్బస్థలీ ఉత్తర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఈ ఘటన జరిగింది. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. సీఎం మమతా బెనర్జీ దేశ అంతర్గత భద్రతను తాకట్టు పెట్టారని ఆరోపించింది. చొరబాటుదారులకు రాష్ట్రం ఓ సురక్షితమైన స్థావరంగా మారిందని ఈ ఘటన రుజువు చేస్తోందని పేర్కొంది.

## ఫిలిప్పీన్స్‌ను కుదిపేసిన తుఫాను.. 241మంది మృతి

మనీలా, నవంబర్ 6: ఫిలిప్పీన్స్‌పై విరుచుకుపడిన కల్మేగీ తుఫాను ఆ దేశాన్ని కుదిపేసింది. తుఫాను ధాటికి 241మంది మరణించగా, 127మంది గల్లంతయ్యారు. చాలా మరణాలు ఆకస్మిక వరదల్లో మునిగిపోవడం వల్లే సంభవించాయని అధికారులు తెలిపారు. తుఫాను ప్రభావంతో ముఖ్యంగా సెబూ ప్రావిన్స్ విపరీతమైన నష్టాన్ని చవిచూసింది. ఈ నగరంలో ఒకేరోజులో దాదాపు ఒకటిన్నర నెలల వర్షపాతం నమోదైంది. ఫలితంగా వరదలు నివాస ప్రాంతాలను ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో దేశ అధ్యక్షుడు మార్కోస్ జూనియర్ దేశవ్యాప్తంగా అత్యవసర స్థితిని ప్రకటించారు.

## కంచి ఆలయంలో 'బంగారు బల్లి' మాయం?

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ దివ్య దేశాలలో ఒకటైన కాంచీపురం వరదరాజపెరుమాళ్ ఆలయంలో 'బంగారు బల్లి' మాయమైనట్లు వార్తలు రావడంతో స్థానికంగా కలకలం రేగింది. ఈ ఆలయానికి దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు స్వామివారి దర్శనం తర్వాత అక్కడి బంగారు, వెండి బల్లుల విగ్రహాలను స్పృశించడం ఆనవాయితీ. ఆ బల్లులను తాకితే దోషాలు పోతాయని భక్తులు విశ్వసిస్తారు. అయితే ఇటీవల ఆ ఆలయంలోని బల్లుల విగ్రహాలను మార్చి, కొత్తవి ఏర్పాటు చేయడానికి ఆలయ నిర్వాహకులు చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే బంగారు బల్లి మాయమైనట్లు శ్రీరంగం ప్రాంతానికి చెందిన భక్తుడు రంగరాజ నరసింహన్ విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విభాగం డీఎస్పీ సంపత్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులున్న దర్యాప్తు బృందం ఆ ఆలయానికి వెళ్లి అక్కడున్న విగ్రహాలను పరిశీలించి విచారణ చేపట్టింది.

## జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో లెఫ్ట్ యూనిటీ విజయం

న్యూఢిల్లీ, నవంబరు 6: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం ఎన్నికల్లో లెఫ్ట్ యూనిటీ విజయం సాధించింది. సెంట్రల్ ప్యానల్‌లోని కీలకమైన నాలుగు స్థానాలను దక్కించుకొంది. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్ ఐ), డెమొక్రాటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (డీఎఫ్‌ఎస్)లు కలిసి లెఫ్ట్ యూనిటీ పేరుతో పోటీ చేశాయి. గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా లెఫ్ట్ యూనిటీకి చెందిన అదితి మిశ్ర విజయం సాధించారు. ఆమె ఏబీవీపీకి చెందిన వికాస్ పటేల్‌ను 449 ఓట్ల తేడాతో ఓడించారు. ఉపాధ్యక్షురాలిగా కిళకూత్ గోపికా బాబు, ప్రధాన కార్యదర్శిగా సునీల్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా డానిష్ ఆలీ ఎన్నికయ్యారు.

## అనిల్ అంబానీకి మళ్లీ ఈడీ పిలుపు

న్యూఢిల్లీ, నవంబరు 6: బ్యాంకు మోసానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ (66)కి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. ఈడీ గత ఆగస్టులో అనిల్ అంబానీని దాదాపు పది గంటల పాటు విచారించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన 2,929 కోట్ల రుణాన్ని అక్రమంగా దారి మళ్లించిన అంశంలో రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)పై నమోదైన మనీలాండరింగ్ కేసులో నవంబరు 14న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఈడీ ఆయనను కోరిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## సింధ్ కొండల్లో రహస్య సొరంగాలు

(మొదటిపేజీ తరువాయి)

పడనున్నదని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశాయి. సింధ్ ముత్తహిద మహజ్ అనే పౌర సమాజ గ్రూపు ఛైర్మన్ షఫీ బుర్ఫాత్ పేరిట మీడియాకు విడుదల చేసిన ఈ లేఖలో సింధ్‌లో ఎక్కడెక్కడ సొరంగాలను తవ్వుతున్నారనే వివరాలను పొందుపరిచారు. జంషోరోకు ఉత్తరంగా నోరియాబాద్ ప్రాంతంలో, మంచార్ కాలువకు పశ్చిమంగా కంబేర్-షాదాద్ కోట్ ప్రాంతంలో పెద్ద పెద్ద సొరంగాలు, వివిధ ఆకృతుల్లో విశాలమైన భూగర్భ గదులను నిర్మిస్తున్నారని తెలిపారు. అక్కడ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అటు వైపు ఎవరూ పోకుండా సైన్యాన్ని కాపలా ఉంచారని పేర్కొన్నారు. అణ్వాయుధాలను పరీక్షించడం లేక తత్సంబంధ కార్యకలాపాల వల్ల తాము తీవ్రమైన పర్యావరణ సమస్యలకు గురికావడంతోపాటు రేడియోధార్మికత ప్రభావంతో ప్రాణాంతక వ్యాధులు తమను చుట్టుముట్టే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సాంకేతిక నిపుణులను సింధ్ ప్రాంతానికి పంపాలని అణుశక్తి సంస్థను, స్వతంత్ర నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటుచేయాలని ఐరాస జనరల్ సెక్రటరీని, మానవ హక్కుల, పర్యావరణ సంబంధ ప్రభావ అంచనా కోసం బృందాలను పంపాలని ఐరాస అనుబంధ విభాగాల ప్రతినిధులను ఆ లేఖలో కోరారు.

# తొలి దశలో 64.66% ఓటింగ్

**» బిహార్‌లో తొలిసారి భారీ పోలింగ్**

న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిహార్ చరిత్రలోనే మొదటిసారిగా 64.66% మంది గురువారం జరిగిన తొలి విడత ఎన్నికల్లో ఓటు వేశారు. 18 జిల్లాల్లోని 121 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాల్గొన్న 3.75 కోట్ల మంది ప్రజలు ఉత్సాహంతో పోలింగ్‌లో పాల్గొన్నారు. 1,314 మంది అభ్యర్థులు తొలి దశలో తమ భవిష్యత్తును పరీక్షించుకున్నారు. వీరిలో 122 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. గత మూడు దశాబ్దాల్లో అత్యధిక పోలింగ్ జరిగిందంటే అర్థం నవంబరు 14న ప్రజలు కొత్త ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తున్నట్లే స్పష్టమవుతోందని జన సురాజ్ సంస్థాపకుడు, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యానించారు. 1998లో మొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో 64.66% పోలింగ్ జరిగినప్పుడు బీజేపీ, సమతా పార్టీ కలిసి 30 సీట్లు గెలుచుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 2000లో పశుగ్రాసం కుంభకోణంతో లాలూ ప్రసాద్ యాదవ్ రాజీనామా అనంతరం జరిగిన ఎన్నికల్లో 62.57% ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని రబ్డీ దేవి సారథ్యంలో ఆర్‌జేడీని అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ఈసారి మొదటిసారి అత్యధిక శాతం మంది ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడంతో మార్పు ఖాయమంటున్నారు. తొలిదశ పోటీలో రాఘోపూర్ నుంచి ఆర్‌జేడీ నేత, సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్, బీజేపీ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరి, మహువా నుంచి తేజస్వి సోదరుడు తేజ్ ప్రతాప్, అలీనగర్ నుంచి బీజేపీ సీనియర్ నేత మైథిలీ ఠాకూర్, మొకామా నుంచి జేడీ(యూ) నేత, హత్యానేరంపై జైలు పాలైన అనంత్ సింగ్ తదితర ప్రముఖులు ఉన్నారు.

### త్రికోణపు పోటీ..

అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పూర్తి స్థాయిలో జన సురాజ్ పార్టీ నేత ప్రశాంత్ కిషోర్ ఎన్నికల ప్రచారంలో తిరగడంతో చాలా చోట్ల త్రికోణపు పోటీ ఏర్పడింది. ఈ పార్టీ అన్ని స్థానాల్లో పోటీకి దిగింది.



ఓటు వేసిన లాలూ ప్రసాద్ యాదవ్, రబ్డీదేవి, తేజస్వీ యాదవ్

### డిప్యూటీ సీఎంకు నిరసన సెగ

బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత విజయ్ కుమార్ సిన్హాకు నిరసన సెగ తగిలింది. లఖిసరాయ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆయన పోలింగ్ నేపథ్యంలో తన నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం సందర్శించారు. ఓ గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. సిన్హాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు, చెప్పులు, ఆవు పేడ విసిరారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

తేజస్వి యాదవ్ గతంలో తన తల్లి రబ్డీ దేవీని ఓడించిన బీజేపీ నేత సతీష్ కుమార్‌ను ఎదుర్కొంటున్నారు. సతీష్ ఈసారి జేడీ(యూ) గుర్తుపై పోటీ చేస్తున్నారు. మొత్తం 45,341 పోలింగ్ స్టేషన్లలో అత్యధిక పోలింగ్ స్టేషన్లు (36,733) గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండడం గమనార్హం. ఈ ఎన్నికల్లో దాదాపు 10.72 లక్షల మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. ఎన్డీఏకు మహాగట్‌బంధన్‌కు మధ్య ప్రధాన పోటీ జరుగుతున్నప్పటికీ ఎన్డీఏలో ఐదు పార్టీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. వీటిలో జనతాదళ్ (యునైటెడ్), బీజేపీ, చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ, జితన్ రాం మాంఝీకి చెందిన హిందుస్థాన్ అవామీ మోర్చా, ఉపేంద్ర కుశ్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా ఉన్నాయి. మహాగట్‌బంధన్‌లోనూ ఆరు పార్టీలు రంగంలో ఉన్నాయి. వీటిలో ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్), వికాస్‌శీల్ ఇన్సాఫ్ పార్టీ (ముఖేష్ సహనీ) ఉన్నాయి. ఇక ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల కమిషన్ నిర్వహించిన వివాదాస్పద ప్రత్యేక ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్‌ఐఆర్) వివాదాస్పదంగా మారింది. బీజేపీని గెలిపించేందుకే ఈ సవరణ చేపట్టారని, లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు ఆధార్‌ను కూడా గుర్తింపు కార్డుగా అంగీకరించాలని కమిషన్‌ను ఆదేశించడంతో ఈ ఆరోపణలు సద్దుమణిగాయి. అయితే అదే సమయంలో కర్ణాటక, హరియాణా, మహారాష్ట్ర తదితర స్థానాల్లో ఎన్నికల కమిషన్ భారీ అక్రమాలకు తావిచ్చిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పోలింగ్‌కు ఒకరోజు ముందు రాహుల్ గాంధీ ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఓ బ్రెజిలియన్ మోడల్ లరిస్సా పేరుతో 22సార్లు బోగస్ ఓటింగ్ జరిగిందని ఆధారాలతో బయటపెట్టారు. దాదాపు 25 లక్షల ఓట్లను హరియాణాలో చోరీ చేశారని ఆరోపించారు. ఈ ప్రభావం పోలింగ్‌పై పడే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కాగా బిహార్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదు కావడం ప్రజాస్వామ్య విజయమని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గురువారం పేర్కొన్నారు.

## 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్'కు 5 కోట్ల మంది మద్దతు

**» రేపు అన్ని రాష్ట్రాల్లో ఫ్లాగ్-ఆఫ్**

**» ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్**



న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అక్రమాలను ఎండగట్టేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిర్వహించిన 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 5 కోట్ల మంది సంతకాలు చేసి మద్దతు తెలిపారని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర ఎన్నికల కమిషన్, బీజేపీ కుమ్మక్కై చేస్తున్న ఓటు చోరీ ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియపై సాధారణ పౌరుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ నెల 8న అన్ని రాష్ట్రాల కార్యాలయాల్లో ఫ్లాగ్-ఆఫ్ కార్యక్రమాలతో 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' తొలిదశను ముగించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆ తర్వాత సంతకాల సేకరణకు సంబంధించిన సమగ్ర వివరాలను ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి పంపాలని పీసీసీలకు సూచించారు. రెండోదశలో భాగంగా సంతకాల సేకరణ తిరిగి కొనసాగుతుందని.. కోట్లాది ప్రజల అభిప్రాయానికి ప్రతిబింబమైన ఆ సంతకాలను రాష్ట్రపతికి అందజేస్తామన్నారు. "ఫొటోలతో కూడిన మెషీన్ రీడబుల్ ఓటరు జాబితాను ప్రచురించాలి. తప్పుడు ఓటర్ల తొలగింపు కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఓటరు జాబితా మార్పుల కోసం స్పష్టమైన కటాఫ్ తేదీని ప్రకటించాలి. ఓటింగ్ ప్రక్రియలో అక్రమాలకు కారణమైన అధికారులతోపాటు ఏజెంట్లపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అనే డిమాండ్లను కేంద్ర ఎన్నికల సంఘం ముందు పెడతామని ఆయన తెలిపారు.

# న్యూయార్క్ ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సిందే!

**డెమొక్రాట్లు ఓ కమ్యూనిస్టును కూర్చోబెట్టారు.. అమెరికాను క్యూబా, వెనెజువెలాలా మార్చాలని యత్నం**

**» న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక విపత్తు తప్పదు**

**» కమ్యూనిజమా, కామన్‌సెన్సా? ఏదీకావాలో తేల్చుకోవాలి**

**» మమ్దానీ చాలా ఆగ్రహంగా ప్రసంగించారు**

**» నా పట్ల మర్యాదగా ఉంటే మంచిది: ట్రంప్ హెచ్చరిక**



మియామి, నవంబరు 6: న్యూయార్క్ కొత్త మేయర్‌గా ఎన్నికైన డెమొక్రటిక్ పార్టీ నేత జోహ్రాన్ మమ్దానీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విరుచుకుపడ్డారు. విజయోత్సవంలో జోహ్రాన్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. బుధవారం ఫ్లోరిడాలోని మియామిలో జరిగిన అమెరికా బిజినెస్ ఫోరం సదస్సులో ట్రంప్ మాట్లాడారు. ఏడాది క్రితం నవంబరు5న (ట్రంప్ గెలిచిన రోజు) అమెరికన్లు తమ సార్వభౌమత్వాన్ని తిరిగి నిలుపుకొన్నారని.. ఇప్పుడు న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో అందులో కొంత పోగొట్టుకున్నారని వ్యాఖ్యానించారు. అమెరికన్లకు ఇప్పుడు కమ్యూనిజమా, కామన్ సెన్సా ఏది కావాలో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. "మమ్దానీయా.. న్యూయార్క్‌లో అతడి పేరు ఏదైతే ఏంటి? మహిళల క్రీడల్లో మగవాళ్ల ఆడటం ఆయనకు అద్భుతంగా అనిపిస్తుంది"అని ఎద్దేవా చేశారు. డెమొక్రాట్లు దేశంలోని పెద్ద నగరంలో కమ్యూనిస్టును తీసుకొచ్చి కూర్చోబెట్టారని విమర్శించారు. "డెమొక్రాట్లు అమెరికాను ఏం చేయాలని కోరుకుంటున్నారో తెలుసా? న్యూయార్క్ ఎన్నికల ఫలితాన్ని చూస్తే తెలుస్తుంది. వాళ్లు అమెరికాను క్యూబా, వెనెజువెలాలా మార్చాలని చూస్తున్నారు. అక్క డేం జరిగిందో మీకు తెలుసు. ఇలా జరగకూడదని నేను భావించాను. న్యూయార్క్‌కు ఆర్థిక, సామాజిక విపత్తు తప్పదు. ప్రజలు న్యూయార్క్‌ను వదిలేసి ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుంది. వారికి మియామి 'శరణార్థి' క్యాంపులా మారిపోతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత వరకు అమెరికాలో ఏరకంగానూ కమ్యూనిజాన్ని అనుమతించబోనని, దానిని ఇక్కడే ఆపుతానన్నారు. కమ్యూనిస్టు పాలనలో తాను ఉండలేనని, న్యూయార్క్ నగరాన్ని వీడుతానని చెప్పారు. మేయర్ ఎన్నికలో గెలిచిన అనంతరం మమ్దానీ చాలా ఆగ్రహంగా ప్రసంగించారని, కానీ తన విషయంలో మర్యాదగా ఉంటే మంచిదని ట్రంప్ పేర్కొన్నారు. న్యూయార్క్ మేయర్‌గా ఆయనకు రావాల్సిన అన్నింటినీ ఆమోదించాల్సింది తానేనని చెప్పారు. ప్రసంగం చివరిలో ట్రంప్ తనదైన శైలిలో నృత్యం చేశారు. కాగా.. జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే తాము న్యూయార్క్ వదిలి వెళ్లిపోతామని 9శాతం మంది ప్రజలు చెప్పారని ఎన్నికల ముందు సర్వే చేసిన జేఎల్ పార్ట్‌నర్స్ వెల్లడించింది.

### భారత్-పాక్ యుద్ధంలో 8 ఫైటర్లు కూలాయి

భారత్-పాక్ యుద్ధంలో 8 యుద్ధ విమానాలు కూలిపోయాయని ట్రంప్ పేర్కొన్నారు. ఆ యుద్ధాన్ని ఆపింది తానేనని మరోసారి చెప్పారు. "భారత్-పాక్ యుద్ధంలో 7 విమానాలు కూలిపోయాయి. మరొకటి తీవ్రంగా దెబ్బతింది. మొత్తం 8 ఫైటర్లు కూలిపోయాయి. వాణిజ్య ఒప్పందం చేసుకోబోనని హెచ్చరించి ఆ యుద్ధం ఆపాను" అని మియామి సదస్సులో పేర్కొన్నారు. కాగా, ట్రంప్ ఇలా ప్రకటన చేయడం 58వసారని, కానీ ప్రధాని మోదీ ఏమీ మాట్లాడరేంటని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

# ర్యాప్ సింగర్ నుంచి న్యూయార్క్ మేయర్‌గా..

**» హిందీ, బెంగాలీ, స్పానిష్ భాషల్లోనూ అనర్గళంగా మాట్లాడగల జోహ్రాన్ మమ్దానీ**

**» పేదలకు ఇళ్లు, ఉచిత ప్రజా రవాణా హామీలు**

**» మోదీ యుద్ధ నేరస్తుడు అంటూ గతంలో విమర్శలు**



న్యూయార్క్, నవంబరు 6: న్యూయార్క్ నగర మేయర్‌గా విజయం సాధించి సంచలనం సృష్టించిన జోహ్రాన్ మమ్దానీ.. మొదట్లో హౌజింగ్ కౌన్సెలర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే పేదలు సొంతింటి కోసం ఎంతగా తపిస్తారో చూశారు. ఆ సమయంలోనే ర్యాప్ సింగర్‌గా మారారు. 'యంగ్ కార్డమామ్, మిస్టర్ కార్డమామ్' పేరుతో కొన్నిపాటల వీడియోలూ చేశారు. న్యూయార్క్ ఆధునిక హిప్-హాప్ సంగీతాన్ని, దక్షిణాసియా బాణీలను కలగలిపి ప్రయత్నించారు. రాజకీయాల్లోకి వచ్చాక మంచి ప్రజాదరణ పొందారు. 2020లో డెమొక్రాట్ పార్టీ తరఫున న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పేదలకు ఇళ్లు, ఉచిత ప్రజా రవాణా, ఉచితంగా పిల్లల సంక్షేమం, అద్దెల నియంత్రణ కోసం గట్టిగా డిమాండ్ చేశారు. ధనికులపై పన్నులు పెంచి వీటిని అమలు చేస్తానని న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో వాగ్దానం చేశారు. అమెరికాకు మిత్రదేశమైన ఇజ్రాయెల్ గాజాపై చేసిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఒకవేళ న్యూయార్క్ వస్తే అరెస్ట్ చేస్తామనీ ప్రకటించారు. ప్రధాని మోదీని 'యుద్ధ నేరస్తుడు (వార్ క్రిమినల్)' అంటూ విమర్శించి కలకలం రేపారు. వలసలకు వ్యతిరేకంగా ట్రంప్ చేపట్టిన చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. హిందీ, బెంగాలీ, స్పానిష్ భాషల్లో కూడా అనర్గళంగా మాట్లాడగలిగిన మమ్దానీ.. న్యూయార్క్‌లో స్థిరపడిన భారతీయులు, ఇతర విదేశీయులనూ ఆకట్టుకున్నారు. సోషల్ మీడియాలోనూ ఆయనకు బలమైన మద్దతు లభించింది. మమ్దానీ తాను ముస్లిం అన్న విషయాన్ని ఎక్కడా దాచుకోలేదు. మసీదులకు కూడా వెళ్లారు. జాతి, మతం అనే వివక్ష ఏదీ ఉండదని.. న్యూయార్క్‌లో ఉండే అందరి సంక్షేమమే తన లక్ష్యమని ప్రకటించారు. చివరికి విజయం సాధించారు.

# చొరబాటుదారులంటే వారికి అభిమానం

**» కాంగ్రెస్, ఆర్‌జేడీలపై మోదీ ఫైర్**

**» ఆర్‌జేడీకి మద్దతివ్వడం రాహుల్‌కు ఇష్టం లేదని వ్యాఖ్య**



భాగల్పూర్/అరారియా, నవంబరు 6: విదేశీ చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్, ఆర్‌జేడీ అమిత అభిమానం చూపుతున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం శ్రీరాముడిని, ఛాఠ్ మాతను అసహ్యించుకుంటున్నాయని విమర్శించారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం భాగల్పూర్, అరారియా జిల్లాల్లో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. అయోధ్యలో రామాలయంతో పాటు నిషాదరాజ్ (గుహుడు), శబరి మాత, వాల్మీకి మహర్షి కోసం నిర్మించిన ఆలయాలను సందర్శించడానికి ప్రతిపక్ష నేతలు విముఖత చూపుతున్నారని.. దళితులు, వెనుకబడిన తరగతులంటే వారికున్న ద్వేషానికి ఇదే రుజువని చెప్పారు. ఆర్‌జేడీ, కాంగ్రెస్ మధ్య అంతర్యుద్ధం నడుస్తోందన్నారు. ఈ రెండు పార్టీలకు దేశంలోనే అత్యంత అవినీతి కుటుంబం, బిహార్లోని అత్యంత అవినీతి కుటుంబం సారథ్యం వహిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ 'నామ్‌దార్' (రాహుల్ గాంధీ) కొద్దిరోజులుగా ప్రచారంలో కనిపించడం లేదని.. ఆర్జేడీకి మద్దతివ్వడం ఆయనకు ఇష్టమే లేదని, బలవంతంగా వస్తున్నారని తెలిపారు. 15 ఏళ్ల ఆర్‌జేడీ ఆటవిక పాలనలో రాష్ట్రంలో అభివృద్ధే లేదని.. సీఎం నితీశ్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్ నుంచి బయటకు తెచ్చేందుకు ఎంతో కష్టపడిందని చెప్పారు.

### ఆర్మీ జవాన్ల కులం అడుగుతారా?: అమిత్ షా

బెతియా/మోతిహారి/మధుబని: ఆర్మీ జవాన్ల కులం, మతం గురించి అడుగుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. అందుకు సిగ్గుపడాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మండిపడ్డారు. గురువారం బిహార్లోని మధుబని, పశ్చిమ చంపారన్, మోతిహారి జిల్లాల్లో వరుస సభల్లో ఆయన పాల్గొన్నారు. కులం, వర్గాల ఆధారంగా సైనిక సిబ్బందిపై వివక్ష చూపడం తగదన్నారు.

### బిహార్లో ఓట్ల చోరీకి బీజేపీ యత్నాలు: రాహుల్

పూర్ణియా: బీజేపీ పూర్తి శక్తియుక్తులతో బిహార్లో ఓట్ల చోరీకి ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిని అడ్డుకునే బాధ్యత యువతపైనే ఉందని చెప్పారు. గురువారం పూర్ణియా, అరారియాల్లో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. ఓట్ల దొంగతనంతో ప్రతి ఎన్నికల్లో బీజేపీ గెలుస్తోందని ఆరోపించారు. 'హరియాణా ఎన్నికలను బీజేపీ, ఎన్నికల కమిషన్ తస్కరించాయని యావత్ ప్రపంచానికి మేం చూపించాం. బిహార్లో యువత కూడా అప్రమత్తంగా ఉండాలి' అని ఆయన అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా కూడా సీతామఢీ, తూర్పు చంపారన్ జిల్లాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక హక్కులను బలహీనపరిచేందుకు ఈసీ మోదీ ప్రభుత్వంతో కుమ్మక్కైందని ఆరోపించారు.

# కేంద్రంపై మళ్లీ సీజేఐ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన విచారణ సందర్భంగా కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేసు తుది వాదనలు వినడానికి సిద్ధమైన తర్వాత అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి.. ఈ పిటిషన్లపై ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణ జరపాలని కోరారు. దీనిపై సీజేఐ అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్ వాదనలు విన్న తర్వాత విస్తృత ధర్మాసనం విచారణ జరపాలని కోరడమంటే ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తప్పించుకొనే ఎత్తుగడేనని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని తాము ఊహించలేదన్నారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం వాదనలు విని, విచారణను ముగిస్తామని, ఆ తర్వాతే విస్తృత ధర్మాసనానికి ఇవ్వాలా?వద్దా? అన్న నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. అయితే, అటార్నీ జనరల్(ఏజీ)కు శుక్రవారం అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేసుల విచారణ ఉందని.. ట్రిబ్యునళ్ల కేసు విచారణను వాయిదా వేయాలని గురువారం అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సీజేఐ ధర్మాసనాన్ని కోరారు. ఇది అసమంజసమని జస్టిస్ గవాయ్ అన్నారు. "ఆయనకు ఇప్పటికే మేం చాలా సమయం ఇచ్చాం. రెండుసార్లు వాదనలు వినిపించేందుకు అవకాశం ఇచ్చాం. ఒకవేళ ఈ అంశం ఈ నెల 24 తర్వాత విచారణకు రావాలని మీరు కోరుకుంటున్నారా? అలాంటి ఉద్దేశం ఉంటే నిజాయితీగా చెప్పండి" అని ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న సీజేఐ పేర్కొన్నారు. ఈ కేసు విచారణను సోమవారం చేపట్టాలని ఐశ్వర్య కోరగా.. సీజేఐ చిరాకుపడ్డారు. "అలాగైతే మేం తీర్పు ఎప్పుడు రాయాలి? ఆయన మధ్యవర్తిత్వంతో బిజీగా ఉన్నారని ప్రతిరోజూ మాకు చెబుతారు. చివరి దశలో వచ్చి విస్తృత ధర్మాసనానికి కేసును బదిలీ చేయమని కోరతారు"అని వ్యాఖ్యానించారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం తరఫున మరో న్యాయనిపుణుడు ఎందుకు హాజరవకూడదని ప్రశ్నించారు. శుక్రవారం తుది వాదనలు వింటామని స్పష్టం చేశారు. అలాగే అటార్నీ జనరల్‌కు సోమవారం వాదనలు వినిపించేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపింది. "ఆ రోజు ఆయన రాకపోతే, కేసును ముగించేస్తాం" అని సీజేఐ స్పష్టం చేశారు.

# ఈ చీమలతో బతకడం నా వల్ల కాదు

- లేఖ రాసి పెట్టి వివాహిత బలవన్మరణం
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన
- చిన్నప్పటి నుంచి ఆమెకు చీమలంటే భయం
- వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నా ఫలితం శూన్యం

అమీన్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆమెకు చీమలంటే జుగుప్స, భయం! చీమల గుంపే కాదు.. ఒక్క చీమ కనిపించినా కెవ్వున కేకపెట్టి బిగుసుకుపోయేది. చివరికి.. ఆ చీమలతో బతకడం తనవల్ల కాదని.. తమ మూడేళ్ల పాపను జాగ్రత్తగా చూసుకోవాలంటూ భర్తను ఉద్దేశించి ఓ లేఖ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ నరేశ్, మృతురాలి భర్త, ఆమె తల్లిదండ్రులు, స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన శ్రీకాంత్‌కు, ద్యావణపెల్లి మనీషా (25)కు నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. ఈ దంపతులకు మూడేళ్ల పాప అన్విక ఉంది. ఈ కుటుంబం రెండున్నరేళ్లుగా అమీన్‌పూర్‌లోని నవ్య హోమ్స్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. చీమలంటే జుగుప్స భయంతో వణికిపోయే 'మింకాఫోబియా'తో మనీషా బాధపడుతోంది. దీన్నుంచి బయటపడేసేందుకు ఆమెకు వైద్యులతో కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తున్నారు. అయినా నయం కాలేదు. చీమలంటే భయమూ పోలేదు. మంగళవారం సాయంత్రం చిన్నారి అన్వికను కాలనీలో తెలిసిన వారి ఇంట్లో దిగబెట్టి.. ఇంటిని శుభ్రం చేయాల్సి ఉందంటూ మనీషా వెళ్లింది. బయటి నుంచి వచ్చిన భర్త.. ఇంటి తలుపులు తెరిచేందుకు యత్నించగా సాధ్యపడలేదు. ఇరుగుపొరుగు సాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా.. గదిలో మనీషా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. ఆ పక్కనే.. 'అయామ్ సారీ శ్రీ (భర్త)..ఈ చీమలతో బతకడం నావల్ల కాదు. అన్వి(కుమార్తె) జాగ్రత్త. అన్నవరం, తిరుపతి హుండీల్లో రూ. 1116 చొప్పున వేయాలి. ఎల్లమ్మకు ఒడిబియ్యం పోయడం మర్చిపోవొద్దు' అంటూ మనీషా రాసిన లేఖ లభ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదైంది.

## 1381 కేసులు.. రూ.3.41 కోట్లు వసూలు

- అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై రవాణా శాఖ తనిఖీలు

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదాల నేపథ్యంలో అప్రమత్తమైన రవాణా శాఖ ప్రత్యేక బృందాలతో తనిఖీలు ముమ్మరం చేసింది. గత నెల 1వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై 1,381 కేసులు నమోదు చేసినట్టు రవాణా శాఖ సంయుక్త కమిషనర్ రమేష్ చిదుర తెలిపారు. రూ.64.03 లక్షల కాంపౌండింగ్ ఫీజు, రూ.2.77 కోట్ల పన్నుతో కలిపి మొత్తం రూ.3.41 కోట్లు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. చేవెళ్ల మిర్జాగూడలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం నేపథ్యంలో సరుకు రవాణా వాహనాలపైనా దృష్టి సారించారు. గత రెండు రోజుల్లో అధిక లోడుతో వెళ్తోన్న ఆరు టిప్పర్లను సీజ్ చేసినట్టు తెలిపారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా గత సోమవారం నుంచి గురువారం సాయంత్రం వరకు 60 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు రవాణా శాఖ ప్రధాన కార్యాలయ అధికారులు తెలిపారు.

## విద్యార్థులను చితకబాదిన వైస్ ప్రిన్సిపాల్

- ఒకరికి అస్వస్థత.. కలెక్టర్‌కు తండ్రి ఫిర్యాదు

దమ్మపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ అకారణంగా చితకబాదగా.. వారిలో ఓ విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. గత నెల 30న ఇది జరగ్గా.. సదరు విద్యార్థి తండ్రి గురువారం ఖమ్మం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో విషయం వెలుగులోకి వచ్చింది. గురుకుల పాఠశాలలో 9వతరగతి చదువుతున్న కౌశిక్ తోటి విద్యార్థులతో కలిసి గత నెల 29న ఉదయం ఆటలాడుతున్నట్టు గమనించిన వైస్ ప్రిన్స్‌పాల్ ఉపేందర్.. మరుసటి రోజు ఉదయం ప్రార్థన సమయంలో వారిని కర్రతో ఇష్టారీతిన కొట్టారు. దీంతో కౌశిక్ అనారోగ్యానికి గురవ్వగా.. నాలుగు రోజులు పాటు అతడిని స్కూల్లోనే ఉంచారు. అనంతరం 'మీ అబ్బాయికి జ్వరం వచ్చింది' అంటూ తండ్రి సుధాకర్‌కు పాఠశాల యాజమాన్యం సమాచారమిచ్చింది. ఈ నేపథ్యంలోనే సుధాకర్ పాఠశాలకు వెళ్లి కౌశిక్‌ను సొంతూరు సుబ్లేడుకు తీసుకెళ్లాడు. ఇంటి వద్ద కౌశిక్‌ను పరిశీలించగా శరీరంపై తీవ్రంగా కొట్టిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో ఆయన ఏం జరిగిందని నిలదీయగా.. తనను.. మరో నలుగురిని వైస్ ప్రిన్సిపాల్ కర్రతో చితకబాదాడని చెప్పాడు. దీనిపై సుధాకర్ సంబంధిత అధికారులతో పాటు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఫిర్యాదు చేశారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఏసీబీ దాడులు

మేడ్చల్, దుండిగల్, కూకట్‌పల్లి, నవబంరు 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌ల నేతృత్వంలో సూరారం, కుత్బుల్లాపూర్, బాలానగర్, మూసాపేట్, కూకట్‌పల్లి కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. కుత్బుల్లాపూర్ కార్యాలయం గేట్లకు తాళాలు వేసి మరీ క్షుణ్ణంగా పరిశీలించారు. 15మందికి పైగా డాక్యుమెంట్ రైటర్ల వద్ద స్లాట్ బుకింగ్‌ల కన్నా ఎక్కువ సంఖ్యలో డాక్యుమెంట్లు ఉన్నాయి. ఓ రైటర్ వద్ద లభించిన రూ.10 వేల నగదుపై విచారణ చేస్తున్నారు. కూకట్‌పల్లి కార్యాలయంలో అవసరం లేకపోయినా డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారు. వీరితో పాటు సబ్‌రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డిని, సిబ్బందిని విచారిస్తున్నారు. ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ల పనితీరుపై ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు దాడులు నిర్వహించినట్లు డీఎస్పీలు తెలిపారు.

# ఇలాంటోళ్లకు పిల్లలు పుట్టకూడదు

**పుట్టినా వెంటనే చనిపోవాలి.. చిన్మయి శ్రీపాద, రాహుల్ రవీంద్రన్ దంపతులపై సోషల్‌మీడియాలో తిట్లు**

- సీపీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేసిన చిన్మయి
- ఫిర్యాదును సైబర్ క్రైమ్‌కి అప్పగించిన సీపీ



తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని సామాజిక మాధ్యమాల్లో పలువురు దారుణమైన కామెంట్లు పెడుతున్నారని ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కు 'ఎక్స్' ద్వారా ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన కొన్ని స్క్రీన్ షాట్లను ఫిర్యాదుతో జతచేశారు. "మహిళల గురించి వాళ్లు ఉపయోగిస్తున్న భాష దారుణంగా ఉంది. వారి వేధింపులతో విసిగిపోయాను. మా అభిప్రాయాలు నచ్చకపోతే వాటిని పట్టించుకోవద్దు. వదిలేయండి. కానీ మా పిల్లలు చనిపోవాలని వారు కోరుకోవడం దారుణం. అందుకే మీ దృష్టికి తీసుకొస్తున్నా" అని ఆమె పేర్కొన్నారు. దీనిపై సజ్జనార్ వెంటనే స్పందించారు. చిన్మయి ఫిర్యాదును సైబర్ క్రైమ్ పోలీసులకు అప్పగించారు.

**ఇదీ నేపథ్యం..**

రాహుల్ దర్శకత్వం వహించిన 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఆ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఒకదాంట్లో ఆయన.. "నేను మహిళా పక్షపాతిని, వారికి స్వేచ్ఛను ఇవ్వాలనుకునే వాడిని, పెళ్లి తర్వాత మహిళలు తప్పనిసరిగా తాళి ధరించాలనే సంప్రదాయాన్ని నేను సమర్థించను' ..అని వ్యాఖ్యానించారు. మంగళసూత్రం ధరించాలంటూ తన భార్య చిన్మయిని తానెప్పుడూ బలవంతం చేయలేదన్నారు. ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా.. కొందరు ఆయన్ను సమర్థించారు. మరికొందరు విమర్శించారు. దీంతో చిన్మయి రాహుల్‌కు మద్దతుగా 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. 'మంగళసూత్రం మహిళలపై లైంగిక వేధింపులను, లైంగిక దాడులను ఆపలేదు. పుట్టుక నుంచి మరణించే వరకు ఈ సమాజంలో మహిళలకు ఏ దశలోనూ భద్రత లేదు. చాలా చోట్ల మృతదేహాలపై కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి. అప్పుడే పుట్టిన పసికందులపై దారుణాలు ఆగడం లేదు కదా?' అని ఆ పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నెటిజన్లు రాహుల్-చిన్మయి దంపతులను తీవ్రంగా విమర్శించారు. "ఇలాంటి వారికి పిల్లలు పుట్టకూడదు...పుట్టినా వెంటనే చనిపోవాలి" అని కామెంట్స్ చేశారు. రాయడానికి వీలుకాని తీవ్రమైన అసభ్య పదజాలంతో చిన్మయిని దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చిన్మయి సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు.

- సినిమా డెస్క్

## మీ కొడుకు మా కస్టడీలో ఉన్నాడు

- విడిచిపెట్టాలంటే రూ.10లక్షలు పంపించండి
- సీబీఐ పోలీసులమంటూ సైబర్ నేరగాళ్ల బెదిరింపు ఫోన్
- అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన తండ్రి
- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఘటన

హుజూరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల బెదిరింపు ఫోన్‌కాల్‌తో ఓ తండ్రి ఆసుపత్రిపాలయ్యారు. ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు కుమారుడు పైచదువుల కోసం అమెరికాలో వెళ్లగా సైబర్ నేరగాళ్లు దీన్నే అవకాశంగా మార్చుకున్నారు. సీబీఐ పోలీస్ అని వచ్చేలా ట్రూ కాలర్ సెట్టింగ్‌లు, డీపీ మార్చుకుని లక్ష్మణ్‌రావుకు ఫోన్ చేశారు. ఆయన కుమారుడు నేరం చేసి, తమ కస్టడీలో ఉన్నాడని, వదిలిపెట్టాలంటే తక్షణమే రూ.10లక్షలు పంపించాలని బెదిరించారు. వాయిస్ క్లోనింగ్ ఉపయోగించి లక్ష్మణ్‌రావు కుమారుడిలా మాట్లాడారు. అనుమానం వచ్చిన ఆయన తన కుమారుడికి ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. హుటాహుటిన హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫోన్ నంబర్‌ను పోలీసులకు చూపిస్తూనే బీపీ ఎక్కువై కిందపడిపోయారు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలించారు. ఈ క్రమంలో లక్ష్మణ్‌రావు కుమారుడు అమెరికా నుంచి ఫోన్ చేయడంతో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు. సైబర్ నేరగాళ్ల ఫేక్ బెదిరింపు ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ సూచించారు.

## ఏసీబీ వలలో అవినీతి చేపలు

- పౌర సరఫరాల మేనేజర్, వ్యవసాయశాఖ ఏఈఓ అరెస్టు



నీలికుర్తి ఏఈవో సందీప్



నర్సింగరావు

ఆసిఫాబాద్ రూరల్, మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల, వ్యవసాయశాఖల అధికారులు ఇద్దరు గురువారం ఏసీబీ వలలో చిక్కారు. అధికారుల వివరాల మేరకు.. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ రైస్‌మిల్లు యజమాని నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ నర్సింగరావు రూ. 75వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఎంఆర్ నాణ్యతను పరిశీలించి ధ్రువపత్రాలు ఇచ్చేందుకు ఒక్కో లారీకి రూ.25 వేలు చొప్పున ఇవ్వాలని నర్సింగరావు రైస్‌మిల్లు యజమాని సందీప్‌ను డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు నిందితుడికి రెబ్బెన మండలంలోని ఖైర్‌గాం వద్ద రూ. 75వేలు ఇస్తుండగా పట్టుకున్నారు. అతనితో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి నుంచి ఇప్పటికే 16 లారీలకు సంబంధించిన డబ్బులు తీసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. మరో ఘటనలో మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో నీలికుర్తి ఏఈఓ జి.సందీప్ రూ.10వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆనెపురం రెవెన్యూ పరిధి స్టేజీతండా జీపీకి చెందిన గుగులోత్ బీక్కు గత నెల 14న మృతి చెందారు. రైతు బీమా పొందేందుకు మృతుడి కుమారుడు వసంత్ గత నెల 30న ఏఈవో సందీప్‌కు బీమా పత్రాలు అందచేశారు. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి రూ.20వేలు ఇవ్వాలని ఏఈవో డిమాండ్ చేశాడు. బాధితుడు హనుమకొండలోని ఏసీబీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు గురువారం మరిపెడ బంగ్లాలోని ఓ బేకరీ వద్ద ఏఈఓకు తొలి విడతగా రూ.10వేలు ఇస్తుండగా అధికారులు అరెస్టు చేశారు.

# 2,310 గ్రామాల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే!

**ఒక్కో జిల్లా నుంచి 70 గ్రామాల ఎంపిక.. సర్వే పూర్తయ్యాక భూధార్ కార్డుల జారీ**

- త్వరలో కోటి మందికి భూధార్ కార్డులు
- ఇవ్వాలని నిర్ణయించిన రెవెన్యూ శాఖ

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ప్రతి జిల్లా నుంచి 70 గ్రామాలను ఎంపిక చేసి పంపాలని రెండు రోజుల క్రితం కలెక్టర్లకు సీసీఎల్ఏ కార్యదర్శి నోట్ పంపారు. ఈ మేరకు మొత్తం 2,310 గ్రామాల వివరాలతో కూడిన జాబితాలు గురువారం సీసీఎల్ఏకు అందాయి. ఆయా గ్రామాల్లో భూమి వాస్తవంగా ఎవరి అనుభవంలో ఉంది? సర్వే నంబరు, సబ్‌డివిజన్ నంబర్ సరైనదేనా? కాదా? భూమికి సమీపంలో రోడ్లు, చెట్లు, ఇళ్లు, జలవనరులు ఏమైనా ఉన్నాయా? హద్దులు పాత రికార్డులతో సరిపోతున్నాయా? లేదా? ఆర్వోఆర్ ప్రకారం హక్కుదారుడి వివరాలు సరిపోతున్నాయా? లేదా? అనే కోణాల్లో వివరాలు సేకరిస్తారు. తద్వారా భూమి హక్కుల నిర్ధారణ పూర్తి చేసి, అనుభవదారు కాలంలో ఉన్న రైతుల వివరాల ఆధారంగా భూధార్ కార్డులను అందజేయనున్నారు. జనవరి నాటికి రాష్ట్రంలో సుమారు కోటి మందికి తాత్కాలిక భూధార్ కార్డులు ఇవ్వాలని రెవెన్యూ శాఖ భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70గ్రామాల వివరాలు సేకరించనున్న అధికారులు.. త్వరలోనే మరో ప్రకటన జారీ చేసి అన్ని జిల్లాల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 69 లక్షల పాస్ పుస్తకాలు ఉన్నాయి. రాష్ట్రంలో 1.60 కోట్ల పార్శిళ్లు (సర్వే సబ్ డివిజన్ల పేరుతో ఉన్న భూమి) ఉన్నాయని రెవెన్యూ అధికారుల వద్ద సమాచారం ఉంది. ప్రతి కమతానికి యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇవ్వాలని ఇప్పటికే కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకుని భూదార్ కార్డులను ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సర్వే రికార్డులో ఉన్న వివరాలు, ఆర్వోఆర్‌లో ఉన్న వివరాలను, క్షేత్ర స్థాయి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తొలుత తాత్కాలిక భూధార్ కార్డులు ఇచ్చి, రీ సర్వే చేశాక పూర్తి స్థాయిలో శాశ్వత కార్డులు ఇవ్వనున్నారు.

# చరిత్రన్నా.. ముత్యాలన్నా గజాలా హష్మీకి ప్రాణం


**హైదరాబాద్‌తో గజాలాకు ఆత్మీయానుబంధం.. గుర్తు చేసుకున్న ఆమె పెదనాన్న కుమార్తెలు**


- వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికైన హష్మీ బంధువుల ఇళ్లలో సంబురాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికైన తొలి దక్షిణాసియా అమెరికన్‌గా గజాలా హష్మీ చరిత్ర సృష్టించారు. ఆమె పుట్టింది హైదరాబాద్‌లోనే. వర్జీనియా సెనేటర్‌గా సేవలందిస్తున్న ఆమె ఇప్పుడు ఆ రాష్ట్రంలోనే రెండో అత్యున్నత పదవిని అధిరోహించారు. దీంతో నగరంలోని గజాలా హష్మీ బంధువుల ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. ఆమె పెద్దనాన్న కుమార్తెలు రసియా నయీమ్ హష్మీ, సమీనా ఫహీమ్ హష్మీ బంధుమిత్రులు, ఇరుగు పొరుగు వారికి మిఠాయిలు పంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గజాలాతో అనుబంధాన్ని వారు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

**హైటెక్ సిటీ చుట్టొచ్చారు : రసియా**

మలక్‌పేటలోని అమ్మమ్మగారి ఇంట్లో పుట్టిన గజాలా హష్మీ నాలుగేళ్ల వయసు (1968)లో నగరాన్ని విడిచివెళ్లారు. అమెరికాలో స్థిరపడినా ఇప్పటి వరకు ఆమె 4సార్లు హైదరాబాద్ సందర్శించారు. వర్జీనియా సెనేటర్‌గా ఎన్నికవడానికి నాలుగేళ్ల ముందు 2015లో పెద్ద కుమార్తె యాస్మిన్‌తో నగరానికి వచ్చినట్టు రసియా తెలిపారు. ఆ సమయంలో బంధుమిత్రులందరితో ఎక్కువ సమయం గడిపారు. "అమెరికాలో పెరిగినా ఈ నేలపై ఆమెకు వల్లమాలిన అభిమానం. భారతదేశ చరిత్ర ముఖ్యంగా హైదరాబాద్ వారసత్వ కట్టడాలు, వాటి చరిత్ర అంటే హష్మీకి చాలా ఇష్టం. ఇక్కడికి వచ్చినప్పుడు కుమార్తెతో కలిసి చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియంతోపాటు చార్మినార్‌ను సందర్శించారు. పాత నగరంలోని గల్లీలన్నీ తిరిగి తనకు ఇష్టమైన సంప్రదాయ ముత్యాల హారాలు కొన్నారు" అని రసియా చెప్పారు. చరిత్రన్నా, ముత్యాలన్నా ఆమెకు ప్రాణమని ఆమె సోదరీమణులు గుర్తు చేసుకున్నారు. ప్రత్యేకంగా హైటెక్ సిటీ ప్రాంతాన్ని చుట్టొచ్చారని, ఐటీ కారిడార్‌లోని ఆకాశ హర్మ్యాలు, ఉద్యోగులతో కళకళలాడుతున్న ప్రాంతాలను చూసి హష్మీ మురిసిపోయారని రసియా చెప్పారు. "మా నాన్నకు గజాలా హష్మీ తండ్రి స్వయానా తమ్ముడు. మా తాతయ్య న్యాయవాదిగా పనిచేసేవారు. నా చెల్లెలు సమీనాకు నాకు గజాలా హష్మీతో మంచి అనుబంధం ఉంది. ఇంటర్నెట్ రాకముందు వరకు మేమంతా తరచుగా ఉత్తరాలు రాసుకునేవాళ్లం. ఆ తర్వాత చాట్ ద్వారా సంభాషించుకునేవాళ్లం. పదేళ్ల క్రితం హష్మీ నగరానికి వచ్చినప్పుడు..కుటుంబ సభ్యులమంతా చాలా సందడిగా గడిపాం" అని రసియా తెలిపారు. "నాకు హైదరాబాద్ అంటే చాలా ఇష్టం. ఏమాత్రం అవకాశం ఉన్నా ఇక్కడికి రావాలి. మలక్‌పేట పరిసరాలను చుట్టిరావాలి. ఇక్కడి బంధుమిత్రులందరినీ కలవాలి అనేది నా కోరిక. కానీ నా వృత్తిజీవితంలోని బిజీ వల్ల నేను ఆ అవకాశాన్ని పొందలేకపోతున్నాను" అంటూ ఆ సమయంలోనే గజాలా హష్మీ చెప్పినట్లు రసియా గుర్తుచేసుకున్నారు.





గజాలా హష్మీ, మిఠాయిలు పంచుతున్న గజాలా హష్మీ పెదనాన్న కుమార్తె సమీనా ఫహీమ్ హష్మీ

**ఎంత ఎదిగినా ఒదిగుండే స్వభావం : సమీనా ఫహీమ్**

గజాలా హష్మీ తల్లిదండ్రుల తరఫు బంధువులు నగరంలోని మెహిదీపట్నం, షేక్‌పేట, మలక్‌పేట, సైదాబాద్, ఆసిఫ్‌నగర్ పరిసరాల్లోని మురద్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్నారు. అగ్రరాజ్యంలో గొప్ప హోదాను అలంకరించినా నేటికీ నగరంలోని తన చిన్నాన్న, పెద్దనాన్న పిల్లలతో హష్మీ ప్రేమానుబంధాన్ని కొనసాగిస్తుండడం గొప్ప విషయం. "మా గజాలా హష్మీ అక్క స్నేహస్వభావం, మంచి మనసు ఉన్న వ్యక్తి. లెఫ్టినెంట్ గవర్నర్‌గా విజయం సాధించాక మేము అక్కకు శుభాకాంక్షలు తెలిపాం. అంత బిజీలోనూ ఆమె మా మెసేజ్‌కు సమాధానం ఇచ్చారు. ఎంత ఎదిగినా ఒదిగుండే వ్యక్తి మా అక్క అనేందుకు ఇది నిదర్శనం" అని సమీనా ఫహీమ్ హష్మీ అన్నారు. హష్మీ స్ఫూర్తితోనే తనతో పాటు ఇక్కడున్న మరికొందరు అక్కాచెల్లెళ్లు ఉన్నత విద్య అభ్యసించి మంచి ఉద్యోగాలల్లోనూ స్థిరపడినట్టు తెలిపారు. "మా అక్క మార్గనిర్దేశకత్వంతో ఇంగ్లిషులో నేను పీహెచ్‌డీ పరిశోధన పూర్తి చేశా. నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ విభాగం అధ్యక్షురాలిగా పనిచేస్తున్నా" అని చెప్పారు.

## అత్త ఇంటికే కన్నం వేయబోయిన దొంగ కోడలు

- తండ్రి, కుమారునితో కలిసి సుపారీ గ్యాంగ్‌తో బేరం..
- 9 మందిని అరెస్టు చేసిన పోలీసులు.. పరారీలో కోడలు

పాల్వంచ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్త సొత్తును కాజేయడానికి ఓ కోడలు వేసిన పథకం చివరి నిమిషంలో బెడిసి కొట్టింది. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు తండ్రి, కుమారుడితో కలిసి.. ఏకంగా సుపారీ గ్యాంగ్‌ను రంగంలోకి దించింది ఆ ఇంటి కోడలు. అవసరమైతే అడ్డొచ్చిన వారిని చంపాలని కూడా నిర్ణయించుకుంది. కానీ, దొంగతనానికి వచ్చిన సుపారీ గ్యాంగ్ పోలీసులకు దొరకడంతో కోడలి అసలు కథ వెలుగులోకి వచ్చింది. పాల్వంచ డీఎస్పీ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచలో గురువారం తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో రెండు అనుమానాస్పద కార్లను పోలీసులు గుర్తించారు. ఆ కార్లను ఆపి సోదా చేయగా అందులో ఉన్న వ్యక్తుల వద్ద కత్తి, ఐరన్ రాడ్లు, మంకీ క్యాపులు ఉండటంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. దమ్మపేట సెంటర్ దగ్గరలో నివాసం ఉండే ఫరాసుల్తానా ఇంట్లో దొంగతనం చేయడానికి వచ్చామని, అడ్డొచ్చిన వారిపై దాడి చేసైనా నగదు తీసుకురావాలని ఆమె కోడలు ఇసరత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని సుపారీ గ్యాంగ్ సభ్యులు పోలీసులకు తెలిపారు. పట్టుబడిన తొమ్మిది మందిలో ఇసరత్ కుమారుడు అబ్దుల్ వాజిద్‌తో పాటు ఆమె తండ్రి మహమ్మద్ ఒస్మాన్ కూడా ఉన్నారని, వారందరిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనలో ప్రధాన నిందితురాలైన మహమ్మద్ ఇసరత్ పరారీలో ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుప్రసిద్ధ బాలీవుడ్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రం 'వో కౌన్ థీ?' తరహాలో, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ బుధవారం ఒక మహిళ చిత్రాన్ని చూపిస్తూ, ఎన్నికల సంఘాన్ని 'యే కౌన్ హై?' అని ప్రశ్నించారు. హర్యానాలో పాతికలక్షల దొంగ ఓట్లు ఉన్నాయన్న తన ఆరోపణలకు నిలువెత్తు నిదర్శనంగా ఆయన ఈ మహిళ చిత్రాన్ని ప్రయోగించారు. హర్యానా ఓటర్ల సంఖ్య రెండుకోట్లు కనుక, అందులో పాతికలక్షలు, అంటే, పన్నెండున్నర శాతం నకిలీ, చెల్లని, బల్క్ ఓట్ల ద్వారా బీజేపీ అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకుందని రాహుల్ ఆరోపణ. ఎన్నికల సంఘాన్నీ, భారతీయ జనతాపార్టీనీ ఒకేగాటన కడుతూ, చేయీచేయీ కలిపి ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్నాయంటూ రాహుల్ చేస్తున్న ఓట్‌చోరీ యుద్ధం ఈ తాజా ఆరోపణలతో తీవ్ర స్థాయికి చేరింది.

బిహార్ తొలివిడత పోలింగ్‌కు ముందురోజున, గత ఏడాది తాము బీజేపీ చేతిలో ఓడిన హర్యానా రాష్ట్రాన్ని రాహుల్ తెరమీదకు తెచ్చారు. గత ఏడాది హర్యానాలో తాము ఎలా మోసపోయిందీ తెలియచెప్పి, బిహారీలను హెచ్చరించడం రాహుల్ ఉద్దేశం కావచ్చు. కర్ణాటకలో అలంద్, మహదేవ్‌పుర అసెంబ్లీ స్థానాల్లోనూ దొంగఓట్ల సృష్టి జరిగిందని ఇటీవల ఆరోపించిన ఆయన, ఇప్పుడు కట్టలకొద్దీ కాగితాలను, వందలాది స్లైడ్లనూ ప్రదర్శిస్తూ, హర్యానాలో ప్రతీ ఎనిమిది మంది ఓటర్లలో ఒకరు నకిలీ అని విస్పష్టంగా చెబుతున్నారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ హర్యానాలో కాంగ్రెస్ ఘనవిజయాన్ని సూచించిన సంగతినీ ఆయన గుర్తుచేశారు. 'ఆమె ఎవరు?' అన్న ఆ ప్రశ్న రాహుల్ ఆరోపణలకు ఎంతో బలం చేకూర్చింది. హర్యానాలో 22చోట్ల ఓటువేసిందీ మహిళ అంటూ బ్రెజిలియన్ మోడల్ లారీసా నేరి ఫోటో చూపించారాయన. ఎనిమిదేళ్ళ క్రితం ఫోటోను ఇంటర్నెట్‌నుంచి తీసి, ఆ ఒక్క చిత్రంతోనే పలు చిత్రాలు చేశారు. స్వీటీ, సరస్వతి, రష్మి, విమల, సీమ

## 'ఆమె ఎవరు?'

ఇత్యాది పేర్లు, వేర్వేరు వయసులతో నకిలీ ఓట్లను సృష్టించారు. ఈ తరహా ఫేక్ ఫోటోలతో లక్షకుపైగా ఓట్లు తయారుచేశారని, తప్పుడు చిరునామాలతో మరో లక్ష ఓట్లున్నాయని, రెండు బూత్‌లతో రెండు వందలకుపైగా ఓట్లు ఒకే ఫోటోతో ఉన్న ఘటనలు సైతం అనేకం అంటున్నారు ఆయన. డూప్లికేట్ ఓటర్లను గుర్తించే సాఫ్ట్‌వేర్ తన దగ్గర ఉన్నా ఈసీ దానిని బీజేపీ కోసం వాడలేదన్న విమర్శ ఘాటైనది. బీజేపీ పాలిత యూపీలో ఓటువేసిన ఆ పార్టీ కార్యకర్తలు వేలాది మంది హర్యానాలోనూ వేశారనీ, గత ఏడాది అక్టోబర్ ఎన్నికలకు ముందు పెద్దసంఖ్యలో ఈ రాష్ట్రంలో ఓటర్లను చేర్చడమే కాక, ముప్పై ఐదులక్షల ఓట్లను ఆఖరునిముషంలో తొలగించారన్నది పెద్ద ఆరోపణ. 'మా వాళ్ళు ఎంతో ముందుగా పోలింగ్ జరగబోయే రాష్ట్రంలో స్థిరపడి, ఓటర్ జాబితాలో చేరిపోవడం అన్నిచోట్లా జరుగుతోంది' అంటూ కేరళ బీజేపీ ఉపాధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను రాహుల్ ప్రదర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సాయంత్రం ఐదుగంటల తరువాత, క్యూలో మిగిలిపోయిన ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పోలింగ్ మట్టుకు ఆఖరునిముషంలో అత్యధికంగా జరిగిందని రాహుల్ గతంలో ఆరోపిస్తూ, ఎన్నికల సంఘం నుంచి డిజిటల్ రికార్డులు, బూత్‌స్థాయి సీసీటీవీ వీడియోలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. తన అభ్యర్థనను కాదనడమే కాక, పోలింగ్ జరిగిన నలభై ఐదురోజుల్లో వీడియోలు ధ్వంసం చేయాలని ఈసీ నిర్ణయించడం తన తప్పులు కప్పిపుచ్చుకోవడానికేనని రాహుల్ ఆరోపణ.

ఒక భారీ విదేశీ కుట్రలో పావుగా మారి, దేశం పరువు ప్రతిష్ఠలను దిగజార్చే లక్ష్యంతో రాహుల్ ఈ ఆరోపణలు చేస్తున్నారనీ, బిహార్‌లో ఓటమి ఖాయమని తెలిసిపోవడంతో హర్యానాను ముందుకు తెచ్చారంటూ బీజేపీ విమర్శలు చేస్తోంది. ఎన్నికల సంఘాన్ని వేలెత్తి చూపవద్దంటోంది. కానీ, రాహుల్ విమర్శలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం మీద ఉంది. ఓటర్ల జాబితా మీద ఒక్క అప్పీలు కూడా దాఖలు కాలేదని ఈసీ ఈ విమర్శలను తేలికగా తీసి పారేస్తోంది కానీ, హర్యానా ఓటర్ జాబితాలో తప్పిదాలు డూప్లికేట్ ఓట్లకు పరిమితం కాలేదనీ, అవి పొరపాట్ల స్థాయిని దాటి జరిగాయని సంఘం గుర్తించాలి. అప్పుడే ఎందుకు చెప్పలేదు, ఫిర్యాదు చేయలేదన్న ప్రశ్నలు సబబుగా కనిపిస్తున్నప్పటికీ, అప్పీలు చేయలేదనో, అడగలేదనో వదిలివేయగలిగే చిన్నచిన్న తప్పులేమీ కావు ఇవి.

## కోరి తెచ్చుకున్న చావులా ఇవి?

ఈ దేశంలో అనేకచోట్ల, అనేక సందర్భాల్లో జరిగే తొక్కిసలాటల్లో కేవలం పేదలే మరణిస్తున్నారు. ఆ తొక్కిసలాటలు కూడా పేదల మానసిక ఆవరణ చుట్టూ ఉన్న దారిద్ర్యం, అభద్రత, అజ్ఞానం, అసహాయత, ఉపాధి లేమి వంటి కారణాలే కాక, 'పక్కవాడిని తొక్కేసయినా దక్కించుకోవటమే విజయానికి మెట్లు' అన్న భావనలు పెంచి, పోషించే వ్యవస్థలూ దొంతర్లుగా పేరుకుపోయినందునే ఇవి జరుగుతున్నాయి. 'పుట్టినవాడు గిట్టకమాన'దన్న గీతాచార్యుడూ గిట్టక తప్పలేదు. కాకపోతే చావును కోరితెచ్చుకోరెవ్వరూ. యే ఉద్దేశంతో రాసేడోగానీ 'చావు కూడా పెళ్లిలాంటిదే' అని ఓ సినిమా కవి రాసేడు. చాలా చావులు పెళ్లిలాంటివి కానేకావు, చచ్చేచావులే. ఏ ధర్మాత్ముడో విసిరే చిల్లర నాణేలకోసం ఎగబడి, ఎగ ఊపిరొదిలిన చావులు, ఏ స్వాములోరి పాదధూళి కోసమో, పోటీపడి చచ్చే చావులు, ఏ అభిమాన నటుడి సినిమా కోసమో కొనప్రాణం కొట్టుకుచచ్చిన చావులు. ఆలయ ప్రహరీలు విరిగిపడి ఒరిగిన చావులు, పుణ్యస్నానాల చావులు, పుష్కరాల చావులు... కోరి తెచ్చుకున్న చావులా ఇవి? భవంతుల నిర్మాణంలో కూలిన బతుకుల చావులు, నెత్తుటితో తడిసే రోడ్ల మీది చావులు, రోగాల, రొప్పుల చావులు, ఆసుపత్రి చావులు, ఆఖరికి కర్కోటక కారాగారాల దిక్కులేని చావులు... కోరి తెచ్చుకున్న చావులేనా ఇవి? దేశానికిపుడు 'చావులమడుం' అన్న పేరు సరిపోతుంది (విశాఖపట్నంలో ఓ స్థలానికి చావులమడుం అన్న పేరుంది).

నిన్న, మొన్న శ్రీకాకుళం జిల్లా, కాశీబుగ్గలో కొందరు భక్తుల చావు నన్ను కలవరపెడుతోంది. ఒరిస్సా పండా ఎవరో నిర్మించిన వేంకటేశ్వరాలయంలో భక్తుల తొక్కిసలాట జరగటం, పదిమంది దాకా మరణించటం... మనసును కలచివేస్తోంది. దేవాలయంలో కార్తీకమాసంలో తొలి దినాన పూజలు చేస్తే పరలోకంలో సుఖంగా జీవిస్తారన్న ప్రచారం కంటే, ఇహలోకంలో కలిగే ఇబ్బందుల నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి రక్షిస్తాడన్న నమ్మకం జనాల్లో బాగా ఉంది. వాళ్లకి రేపెప్పుడో లేదా మరణానంతరమో కలిగే ప్రయోజనమ్మీద ఏ నమ్మకమూ, ఆశా లేదు. ఉన్నదల్లా ఇప్పుడే, ఇక్కడే ప్రయోజనం కావాలి. అలా నమ్మించగలిగే సామాజిక వాతావరణం నిండి వున్నదిపుడు!

అవసరమైన జాగ్రత్తలు తీసుకోకపోవటమే కాశీబుగ్గ ప్రమాదానికి కారణమా? నేరమెవరిది? ఈ ప్రశ్నలేవో వేసుకోవచ్చు. నేరమెవరిమీదనో నెట్టేయవచ్చు. నిజానికి ఈ దేశంలో బాధితులే నేరస్థులు. జైలు నిర్మాణంలో శ్రమించిన శ్రామికులే జైలుపాలవుతారు గానీ, జైలు నిర్మాణాన్ని చేయించినవారు జైలుపాలు కావడం జరగలేదు. ఇక్కడ కూడా చనిపోయిన వారిమీదనే నేరం నెట్టేయవచ్చు. లేదా ప్రతిపక్ష రాజకీయులమీద తోసేయవచ్చు. ఇంకా మించిపోతే నాస్తికులకు నేరం అంటగట్టవచ్చు. వీటన్నిటి కంటే... నన్ను వేధించేది వేరొకటి. గత, వర్తమానాల విశ్లేషణేదో అవసరమన్పిస్తోంది.



చాలా చావులు పెళ్లిలాంటివి కానేకావు, చచ్చేచావులే. ఏ ధర్మాత్ముడో విసిరే చిల్లర నాణేలకోసం ఎగబడి, ఎగ ఊపిరొదిలిన చావులు, ఏ స్వాములోరి పాదధూళి కోసమో, పోటీపడి చచ్చే చావులు, ఏ అభిమాన నటుడి సినిమా కోసమో కొనప్రాణం కొట్టుకుచచ్చిన చావులు. నాడు ప్రజలను చైతన్యవంతం చేసిన సుబ్బారావు పాణిగ్రాహి గుర్తొస్తున్నాడిప్పుడు. ఆయన పోరాటమంతా కేవలం కథగానే మిగిలిపోయిందా?!

ఒకానొక ఆలయ పూజారిగా వచ్చి, ఒకానొక ఊరిని, ఊరి పరిసరాలనూ, జిల్లానూ, రాష్ట్రాన్నీ తన అపూర్వకళా ప్రతిభతో ప్రభావితం చేసిన (ఒరియా బ్రాహ్మడయిన) సుబ్బారావు పాణిగ్రాహి గుర్తుకొస్తున్నాడిప్పుడు. జీవితాలను చక్కదిద్దుకోవడం తమ చేతుల్లోనే వుంటుందని, కార్యాచరణను బోధించి, 'చేతులు జోడించి దేవుణ్ణి మొక్కటం కాదు, పిడికిలి బిగించి పోరాడ'మని నేర్పినవాడు పాణిగ్రాహి. ఆ ఊరి ప్రజలు ప్రేమగా 'పూజారిబాపు' అని పాణిగ్రాహిని పిలుచుకునేవారు. ప్రజలను చైతన్యవంతం చేయడం, సంఘటితం చేయడం, జీవితాల ఉన్నతికి ఉద్యమింపచేయడం పూజారిగా పాణిగ్రాహి కార్యకలాపాలు. కొన్నాళ్లకు ఆలయంలోని మూలవిరాట్టులకు బదులుగా మార్క్సిస్టు మూలపురుషుల ఫొటోలను పెట్టడం, ప్రజలను పోరుబాట నడపడం... వీరోచిత ఘటనలు! ఇవి కేవలం కథలుగా మాత్రమే మిగిలాయా? అన్న వేదన. కాశీబుగ్గలో కానీ, కళింగాంధ్రలో కానీ జనాలు చావుతో సాము చేసి బతుకుతారు. భవంతుల నిర్మాణంలోనో, రోడ్ల ప్రమాదాల్లోనో, రోగాల అసుపత్రుల్లోనో అలవిగానపుడు చనిపోయారే తప్పా, చావుతో పోరాడినోళ్లే పోరాటంలో చనిపోయినోళ్లు గావచ్చు. నాడు అశోకుడితో యుద్ధం చేసి కొందరు కళింగులు మరణిస్తే, నేడు కార్పొరేట్ కర్మాగారాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి మరికొందరు మరణించారు. పుణ్యస్నానాల్లోనో, ఆలయ పూజల్లోనో తొక్కిసలాడి చనిపోలేదిలా. సింహాచలంలో కూడా ప్రహరీగోడ కూలి, జనాల మీద పడి చనిపోయేరు తప్పా, తొక్కిసలాటలో కాదు. ఇంతటి మూఢభక్తి కళింగ జనాల్లో కూడా నిండివుందా? కేవలం మూఢభక్తి అని నిర్ధారిద్దామా? ఆ జనాల జీవన సంక్షోభ స్థితికి వారు వెదుకుతున్న ఊరట మార్గమేమోనని ఆలోచిద్దామా? పాణిగ్రాహి గానీ, అతని బాట గానీ జనాల మనసుల్లోంచి మాసిపోయిందనుకుందామా? ఏ భూమిని యే కర్మాగారం నొల్లేస్తాదో, యే ఇంటిని యే ఎనిమిదో, తొమ్మిదో లైన్ల రోడ్డు మింగేస్తదో, యే ఊరిని యే విమానాశ్రయం ఆక్రమించేస్తాదో, యే అడవిని, కొండని, సముద్రాన్ని... సమస్తాన్ని ఏ శక్తులు చప్పరించేస్తాయో..! నిత్యగండాల సుడిగుండంలా వుందికదా కళింగం? ఓట్లేసి, గెలిపించిన నేతలంతా సామంతరాజులే తప్పా, చక్రవర్తుల (కార్పొరేట్ల) ఆజ్ఞల పాలన తప్పా, ప్రజల ఆలనా పాలనా చూడకపోవటం, శత్రువే శ్రేయోభిలాషిగా నటించడం, అక్కరకు రాని కంపెనీల రాక, అక్కరకొచ్చే ఫ్యాక్టరీల మూత, ప్రమాదాల పరవాడలు... కళింగాంధ్రను కలవరపరుస్తున్నవేమో? కలవరంలో 'పరమాత్ముడొకడు కలడో, లేడో'నన్న ప్రశ్నకు జవాబు వెదుకులాట ఈ చావులనుకుందామా? అన్నీ ప్రశ్నలే! ప్రశ్న భూమి కళింగాంధ్ర ప్రశ్న కావడమే చిత్రం!

• అట్టాడ అప్పల్నాయుడు
ఉత్తరాంధ్ర రచయితల, కళాకారుల వేదిక (ఉరకవే) అధ్యక్షులు

# నితీశ్‌ను కాదనలేని బీజేపీ






■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'బిహార్‌కి మజ్‌బూరి హై, నితీశ్‌కుమార్ జరూరి హై' (బిహార్ నిస్సహాయంగా ఉన్నది, నితీశ్‌కుమార్ నాయకత్వం అవసరం)... ఈ ఆకర్షణీయ నినాదాన్ని నేను మొట్టమొదట 2017లో భారతీయ జనతా పార్టీ కార్యాలయం వెలుపల విన్నాను. అనూహ్యంగా విన్న ఉద్ఘోష అది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీలో మళ్లీ చేరేందుకు నితీశ్ నిర్ణయించుకున్న సందర్భమది. బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగేందుకే నితీశ్ పార్టీ మారారని మరి చెప్పనవసరం లేదు. మోదీతో ఉన్న పాతస్నేహాన్ని మళ్లీ చిగురింపచేసుకునేందుకే ఆయన ఆ నిర్ణయం తీసుకోలేదు. రాజకీయ సౌలభ్యం కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. ఇది జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆ పరిస్థితిలో మార్పు ఏమీ లేదు. సరే బీజేపీకి నితీశ్‌బాబు పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వృద్ధాప్యం పైబడిన నేత నితీశ్. వయసు పొద్దు వాలిపోయిన వేళ ఆరోగ్యం సైతం ఆయనకు దూరంగా ఉంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉండడమే మేలు అని నితీశ్ నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయంతో ఆయన నిశ్చింతగా ఉన్నారు.

బిహార్ రాజకీయాలలో షేక్స్‌పియర్ విషాద నాటకం తరహాలో ఒక నాటకం సుదీర్ఘకాలంగా ప్రదర్శితమవుతోంది. మండల్ ఉద్యమంతో ఈ విషాద ప్రహసనం ప్రారంభమయింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు ఆ సుదీర్ఘ నాటకంలో చివరి అంకంగా చెప్పవచ్చు. మూడున్నర దశాబ్దాల క్రితం మండల్ ఉద్యమంతో ప్రభవించిన నాయకద్వయం లాలూప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్. 'బ్రదర్స్ బిహారీ'గా సుప్రసిద్ధమయ్యారు. అయితే పరస్పరం పూర్తిగా భిన్నమైనవారు. తొలి జనప్రియ నాయకుడుగా అధికార అందలాలు ఎక్కిన లాలూ ప్రసాద్ యాదవ్ ఇప్పుడు శారీరకంగా బలహీనుడు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోతున్న అనారోగ్యగ్రస్తుడు. పార్టీ బాధ్యతలను పూర్తిగా కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. తేజస్వి నవతరం నాయకుడు. అయితే తండ్రిలో ఉన్న జన సమ్మోహన శక్తి ఈ యువనేతలో కానరాదు. 1970 దశకంలో జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన విద్యార్థి యువజన ఉద్యమం నుంచి ప్రభవించిన నాగరీక నాయకుడు నితీశ్‌కుమార్. ఈయనా ఇప్పుడు వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. శరీరాని కంటే మానసిక సామర్థ్యాలను కుంగదీస్తున్న అనారోగ్యమది. భారతీయ జనతా పార్టీకి నరేంద్ర మోదీయే సర్వోన్నత నాయకుడు. మోదీ మాటే తుది మాట. అయితే సమస్త బిహార్ ప్రజలను సమరీతిలో ఆకట్టుకోగల సమర్థ నాయకత్వం బిహార్‌లో బీజేపీకి లేదు. భారత జాతీయ కాంగ్రెస్ శక్తియుక్తులను కాలం హరించివేసింది. ఇప్పుడు ఈ పార్టీ దాదాపు అచేతన స్థితిలో ఉన్నది. ఇక యువ నాయకుడు ప్రశాంత్ కిశోర్ బిహారీలను విశేషంగా ఆకట్టుకుంటున్నారు, సందేహం లేదు. అయితే కులమే నిర్ణయాత్మక అంశంగా ఉన్న బిహార్ రాజకీయాలలో ఈ యువనేత జయపతాక ఎగురవేయగలడా? సంప్రదాయ అధికార నిర్మాణాలు, సామాజిక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఈ కొత్త నేత బిహార్ సమాజంలో మౌలిక మార్పులు తీసుకువస్తానని వాగ్దానం చేస్తున్నారు. బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా?

ఇప్పుడు మళ్లీ నితీశ్‌కుమార్ విషయానికి వద్దాం.

> మహిళా ఓటర్లు మాత్రమే కాకుండా బాగా వెనుకబడిన కులాల వారూ నితీశ్‌కుమార్‌కే పూర్తి మద్దతునిస్తున్నారు. బిహార్‌లో పార్టీ ఎదుగుదలకు, ఎన్నికల విజయాలకు నితీశ్‌ను తమ పక్షాన నిలుపుకోవలసిన ఆవశ్యకత అమితంగా ఉన్నందునే ఆయనను 'మార్గదర్శక్' విశ్రాంత జీవితంలోకి పంపే యోచన బీజేపీ చేయదు.

బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు. ఇప్పటికి మొత్తం తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. రాజకీయ అథ్లెటిక్స్‌లో ఒలింపిక్ స్వర్ణపతకాన్ని అందుకోవడానికి ఆయన అందరికంటే బాగా ముందంజలో ఉన్నారు మరి. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేందుకు బీజేపీ ప్రయత్నించింది నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. ఈ వ్యూహం దాదాపుగా ఫలించింది. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజకవర్గాలలో జయపతాక నెగురవేసింది. బీజేపీ, జనతాదళ్(యు) మధ్య అధికార సమతౌల్యత జాతీయ రాజకీయ పక్షానికే అనుకూలంగా మారింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్‌కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకున్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువునా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. సంభావ్య పర్యవసానాల గురించి భయపడ్డారు. 2022లో బీజేపీతో తెగతెంపులు చేసుకుని ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో చేరారు. అయితే జాతీయ స్థాయిలో అగ్రగామి నాయకుడుగా ఎదగాలన్న తన ఆకాంక్ష నెరవేరేందుకు ఇండియా కూటమి సహకరించదనే భావన ఆయన మనసును తొలిచివేసింది. దీంతో గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఒక శుభ దినాన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చేరారు. ప్రజా జీవితంలో నైతిక విలువలకు నిబద్ధమైన నేతగా పేరుపొందిన నితీశ్‌కుమార్ ఇప్పుడు తన రాజకీయ మనుగడను కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారు. సైద్ధాంతిక విశ్వాసాల స్థానంలో అవకాశవాద రాజకీయాలు ప్రబలిపోయాయి.

ఒకప్పుడు 'నయా' బిహార్‌కు సగర్వంగా సారథ్యం వహించిన నితీశ్‌కుమార్ ఇప్పుడు బీజేపీ 'చక్రవ్యూహం'లో చిక్కుకున్నారు. పలు ఇతర రాష్ట్రాలలో తమ మిత్రపక్షాలను బీజేపీ శాసిస్తోంది. తన నిర్ణయాలను ఆ పార్టీలపై రుద్దుతోంది. ఆ మిత్రపక్షాల నాయకులను బహిరంగంగా చిన్నబుచ్చుతోంది. అయితే బిహార్‌లో సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ జోలికి ఏ విధంగానూ పోయేందుకు బీజేపీ సాహసించడంలేదు. బహిరంగంగాను, అంతర్గతంగాను సీనియర్ నాయకుడుగా ఆయన్ని గౌరవిస్తోంది. ఇతర హిందీ రాష్ట్రాలలో వలే బిహార్‌లో విశ్వసనీయమైన వెనుకబడినవర్గాల నాయకత్వాన్ని పెంపొందించుకోవడంలో బీజేపీ బాగా వెనుకబడిపోయింది బిహార్‌లోని బీజేపీ శ్రేణుల్లో పాత కాలం నాటి అగ్రకులాల ఆధిపత్యం ఇప్పటికీ బలీయంగా ఉన్నది. 2015లో బీజేపీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో సొంతంగా అన్ని స్థానాలకూ పోటీ చేసింది. మోదీ హవా ఉధృతంగా ఉన్న ఆ కాలంలో కూడా బీజేపీ చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించలేకపోయింది. లాలూ-నితీశ్‌ల సంయుక్త నాయకత్వం బీజేపీ పురోగతిని పూర్తిగా నియంత్రించింది. 2024 సార్వత్రక ఎన్నికలలో సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో నితీశ్ కుమార్‌ను బీజేపీ ఏమీ చేయలేకపోతోంది. సంకీర్ణ రాజకీయ ధర్మాన్ని అనుసరిస్తోంది. తనకు మద్దతునిచ్చిన ప్రతి పార్టీ పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించడాన్ని బీజేపీ అలవరచుకున్నది. 2029 సార్వత్రక ఎన్నికలకు ఇంకా వ్యవధి ఉన్నప్పటికీ ప్రస్తుత దశలో నితీశ్‌ను తొలగించడం తమ భవిష్యత్తుకు శ్రేయస్కరం కాదని బీజేపీ భావిస్తోంది.

నితీశ్‌కుమార్ ప్రాభవ ప్రభావాలను ఎంతగా తగ్గించినప్పటికీ ఆయన గెలుచుకోగల ఓట్ల వాటా చాలా అత్యధికంగా ఉంటుందన్న వాస్తవాన్ని బీజేపీ అర్థం చేసుకున్నది. పోటీ కూటమి రాజకీయాలు ప్రబలంగా ఉండే బిహార్ లాంటి రాష్ట్రంలో స్వల్పస్థాయి ఓట్ల వాటా సైతం అంతిమ విజయంలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తుంది. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జనతాదళ్ ఓట్ల వాటా 15 శాతంగా ఉన్నది. నితీశ్ మళ్లీ అధికారానికి రావడానికి ఇది విశేషంగా తోడ్పడింది. 2005 నుంచి ప్రతి ఎన్నికల్లోను రెండు వర్గాలు నితీశ్‌కు పూర్తి మద్దతునిస్తున్నాయి. మహిళలు, బాగా వెనుకబడిన కులాలవారు నితీశ్‌కు ఎటువంటి మినహాయింపు లేని మద్దతునిస్తున్నారు. మహిళా ఓటర్ల శక్తిని జాతీయ రాజకీయ పక్షాలు కనుగొనక ముందే నితీశ్‌కుమార్ మహిళా ఓటర్ల ఆదరాభిమానాలను ఇతోధికంగా చూరగొన్నారు. మృదుభాషి, అంతర్ముఖుడు అయిన నితీశ్ తన ప్రత్యర్థిగా మారిన స్నేహితుడు, పల్లెటూరి మనిషిలా వ్యవహరించే లాలూప్రసాద్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈ కారణంగానే మహిళా ఓటర్లను నితీశ్ ఆకట్టుకున్నారు. అచంచలమైన కుల సంబంధిత విధేయతలతో పాటు మహిళా ఓటర్ల మద్దతు నితీశ్ విజయాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి 2005లో నితీశ్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చదువుకుంటున్న బాలికలు అందరికీ ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఆనాడు లబ్ధి పొందిన బాలికలు ఇప్పుడు వయోజన ఓటర్లుగా ఉన్నారు. ఆ మహిళా ఓటర్లే నితీశ్ నాయకత్వానికి, అధికార ప్రాభవానికి వెన్నుదన్నుగా ఉన్నారనడం సత్యదూరం కాదు.

ఈ కారణంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నితీశ్‌ను తన పక్షాన ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తనను వ్యతిరేకించిన వారిని క్షమించే అలవాటు లేని మోదీ, ఒకప్పుడు నితీశ్ తనను తీవ్రంగా వ్యతిరేకించారన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించారు. బిహార్‌లో బీజేపీ ఎదుగుదలకు నితీశ్‌తో పొత్తు తప్పనిసరి అని ప్రధానమంత్రి గ్రహించారు. అయితే జనతాదళ్(యు)లోకి బీజేపీ శ్రేణులు క్రమంగా చొరబడుతున్న దృష్ట్యా సమీప భవిష్యత్తులో బిహార్‌లో కూడా ఏక్‌నాథ్ షిండే లాంటి తిరుగుబాటు సంభవించే అవకాశం లేకపోలేదు. అయినా ప్రస్తుతానికి మాత్రం బీజేపీ ఎన్నికల విజయాలకు నితీశ్‌కుమార్ ఆవశ్యకత అమితంగా ఉన్నది. ఆయనను 'మార్గదర్శక్' విశ్రాంత జీవితంలోకి పంపే యోచన బీజేపీ చేయబోదనే చెప్పవచ్చు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

# స్వాతంత్ర్యోద్యమ మహామంత్రం

వందేమాతరం గీతం విరచితమై 150 సంవత్సరాలు పూర్తయిన శుభ సందర్భంగా 2025 నవంబర్ 7 నుంచి సంవత్సరం పాటు ఉత్సవాలు జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సంకల్పాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ నెల 'మన్ కీ బాత్'లో పునరుద్ఘాటించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో పాటు పలు ఇతర సంస్థలూ 'వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవం'ను జరుపుకుంటున్నాయి.


జూన్ 23, 1757న బెంగాల్‌లోని ప్లాసీ మైదానంలో నవాబ్ సిరాజ్-ఉద్-దౌలా, లార్డ్ క్లైవ్‌ల మధ్య జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారి చేతిలో భారత్ ఓటమి చవిచూసింది. ఆ విధంగా భారత స్వాతంత్ర్య సూర్యుడు అస్తమించాడు. ఈ పరాజయం అనంతరం దేశంలోని మిగిలిన ప్రాంతాలు కూడా బ్రిటిష్ వారి వశమైపోయాయి. ఆంగ్లేయుల అకృత్యాలను చూసి, సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలని బెంగాల్ ప్రాజ్ఞుడు బంకించంద్ర ఛటర్జీ (1838-1894) సంకల్పించి, అనేక వ్యాసాలు, నవలలు రచించారు. వీటిలో శ్రీకృష్ణ చరిత్ర, దుర్గేశ్ నందిని, రాజసింహ, చంద్రశేఖర్ వంటి కావ్యాలు ప్రఖ్యాతిగాంచాయి. సన్యాసుల తిరుగుబాటు నేపథ్యంగా ప్రసిద్ధి చెందిన రచన 'ఆనందమఠం' వాటిలో ఒకటి. ఈ నవలలోనే జాతీయ గీతం వందేమాతరం ఆవిర్భవించింది. భారతమాతను ప్రస్తుతిస్తూ సన్యాసులు పాడుకున్న గీతమే వందేమాతరం.

1875 నవంబర్ 7న భారతీయ కాలగణన ప్రకారం, కార్తీకమాసం శుక్ల పక్ష నవమి నాడు వందేమాతరం గీతం విరచితమైంది. ఆ రోజు అక్షయ నవమి కావడం వల్ల జగద్ధాత్రి పూజ కూడా ప్రజలు జరుపుకుంటారు. 1896లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటి సారి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఇది మల్హార్ రాగంలో స్వరపరచబడింది. 1896 తర్వాత, కాంగ్రెస్ సమావేశాలలో వందేమాతరం పాడడం ఒక సంప్రదాయంగా మారింది.

బెంగాల్ నుంచి ఉద్భవించిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని విభజించడానికి, అక్టోబర్ 16, 1905న ఆంగ్లేయులు వంగ-భంగ (బెంగాల్ విభజన) పథకాన్ని అమలుచేశారు. బెంగాల్ ప్రభావాన్ని తగ్గించడం, బెంగాలీ విప్లవకారుల ప్రభావాన్ని తగ్గించడం, హిందూ-ముస్లింల మధ్య విభజన సృష్టించడం ఈ వంగ-భంగ పథకం ఉద్దేశ్యాలు. దూరదృష్టి గల నాయకులు విభజనకు ముందే 1905 ఆగస్టు 7న కలకత్తా టౌన్ హాల్లో ఒక సభను ఏర్పాటు చేసారు. ఆ సభకు హాజరైన ప్రతి వ్యక్తీ ఒక్క 'వందేమాతరం' అనే పదాన్ని మాత్రమే నినదించారు. అక్టోబర్ 16న నిర్వహించిన 'నేషనల్ బ్లాక్ డే' సందర్భంగా, ఆనంద్ మోహన్ బసు, సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలో, కలకత్తాలోని సెంట్రల్ మైదాన్‌లో 50వేల మంది ప్రజలు 3.5 కిలో మీటర్ల మేర 'వందేమాతరం' అని నినదిస్తూ, చెప్పులు లేకుండా నడిచారు.

మహాకవి సుబ్రమణ్య భారతి తమిళ భాషలోకి, మహాత్మాగాంధీ గుజరాతీలోకి వందేమాతర గీతాన్ని అనువదించగా తెలుగు, కన్నడ, మలయాళం, ఉర్దూ భాషలలోకి కూడా ఈ గీతం అనువదితమయింది. నాగపూర్‌లోని నీల్ సిటీ పాఠశాల తనిఖీకి వచ్చిన ఆంగ్లేయ అధికారికి సంఘ్ వ్యవస్థాపకుడు డా. హెడ్గేవార్ వందేమాతరంతో స్వాగతం పలికారు. 1947 ఆగస్టు 15న, శ్రీమతి సుచేతా కృపాలాని వందేమాతరం గీతాన్ని ఆలపించారు. సర్దార్ పటేల్ కోరిక మేరకు ఆలిండియా రేడియోలో పూర్తి వందేమాతరాన్ని ప్రసిద్ధ సంగీతకారుడు ఓంకారనాథ్ ఠాకూర్ ఆలపించారు.

○ ఎన్. మధుకర్
బీజేపీ సంస్థాగత కార్యదర్శి, ఏపీ




# జాతీయోద్యమ చైతన్య జీవనాడి

> పరాధీన భారత జాతిని స్వాతంత్ర్య సాధనకు జాగృతం చేసిన చైతన్య గీతిక 'వందేమాతరం'. 150 సంవత్సరాలుగా మన సమష్టి జీవనంలో అంతర్భాగంగా ఉన్న ఈ అజరామర గీతాన్ని బెంగాలీ కవి బంకించంద్ర ఛటర్జీ రచించారు.

వందేమాతరం నినాదం లేని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఊహించలేం. ఆనాడు బ్రిటిష్ వారు వెయ్యి ఫిరంగులు ఎత్తి పెడితే మన భారతీయులు వందేమాతరం నినాదంతో 1000 ఫిరంగులకు మించిన భయాన్ని బ్రిటిష్ వారిలో పుట్టించారు. 'వందేమాతరం' అని పసిపిల్లల నుంచి వృద్ధుల దాకా నినదించారు. అంత గొప్ప స్ఫూర్తిని, ఉద్యమకాంక్షను రగిలించిన ఆ శక్తిమంతమైన గీతమే మన జాతీయ గీతం అయినది. నర నరాన దేశభక్తిని నింపిన వందేమాతర గీతంలో భారతదేశ గొప్పతనం తెలుస్తుంది. బ్రిటిష్ వారి మెడలు వంచిన సమరఘోషే వందేమాతరం.

మన జాతీయ గీతం వందేమాతరం. దీన్ని 1875 నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ రాశారు. బ్రిటిష్ కొలువులో.. భారతీయ ఆత్మతో పనిచేసిన ఛటర్జీ (1838-94) బెంగాలీ కవి, వ్యాస రచయిత, సంపాదకుడు. ఆయన రాసిన 'ఆనంద్ మఠ్' అనే నవల నుంచి ఈ అజరామర వందేమాతరం గీతాన్ని సంగ్రహించారు. ఈ గీతం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సమరశంఖంగా పనిచేసింది.

వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని నేడు దేశ ప్రజలంతా జరుపుకుంటున్నారు. నవంబర్ 7న ఒక నిర్ణీత సమయంలో దేశ ప్రజలందరూ ఈ గీతాలాపన చేయాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది.

'ఆనంద్ మఠ్' నవల 1882లో ప్రచురితమైంది. 1884 ఏప్రిల్ 8న బంకించంద్ర ఛటర్జీ మరణించాక, 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరకల్పన చేసి జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలపించారు. అక్కడి నుంచి వందేమాతరం అందరి నోళ్లలో నినాదంగా మారింది. 1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్‌ను విభజించడంతో ప్రజ్వరిల్లిన ఆందోళన వందేమాతర ఉద్యమంగా పరిణమించింది. ఇది బ్రిటిష్ వారికి శత్రు నినాదంగా మారిపోయింది. భారతదేశ చరిత్రలో వందేమాతర ఉద్యమం ఒక నూతన శకానికి నాంది పలికింది.

బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర గీతం స్వాతంత్ర్య పోరాటంలో ఉద్యమకారులకు ఎనలేని స్ఫూర్తినిచ్చింది. వందేమాతర ఉద్యమం బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తమైంది. మొదట్లో ఈ ఉద్యమం సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాదుల నేతృత్వంలో జరిగినా క్రమంగా అతివాద, తీవ్రప్రభావ నాయకత్వానికి మరలింది. ఈ ఉద్యమాన్ని బెంగాల్ నుంచి దేశవాప్తంగా ప్రచారం చేయడంలో బిపిన్ చంద్రపాల్ ప్రముఖ పాత్ర పోషించారు. మద్రాస్, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బెంగాల్‌లో బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్; బరిసాల్‌లో అశ్వనీకుమార్; దత్త పంజాబ్, ఉత్తర భారత్‌లలో లాలా లజపతిరాయ్, అజిత్ సింగ్, హన్స్‌రాజ్; పశ్చిమ భారత్ (పూనా, ముంబయి)లో తిలక్, పరంజపే, మద్రాస్‌లలో చిదంబరం పిళ్లై, సుబ్రహ్మణ్య అయ్యర్, ఆనందాచార్యులు, టి.ఎం. నాయర్; ఆంధ్రలో గాడిచర్ల, పట్టాభి, అయ్యదేవర; ఢిల్లీ & జమ్మూలలో సయ్యద్ హైదర్ రాజా; యునైటెడ్ ప్రావిన్స్‌లలో మదన్‌మోహన్ మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ; బెనారస్‌లో సుందర్‌లాల్ మొదలైనవారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ దేశభక్తులు అందరూ వందేమాతరంలో స్వాతంత్ర్య కాంక్షను చూశారు కానీ.. మతం కోణం చూడలేదు. ఈ గీతం భారతీయులలో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, 1950 జనవరి 24న రాజ్యాంగ సభ 'వందేమాతరం' గీతాన్ని 'జనగణమన'తో సమానంగా గౌరవిస్తూ జాతీయ గీతంగా అధికారికంగా స్వీకరించింది. భారత స్వాతంత్రోద్యమంలో వివిధ దశలలో జరిగిన ఉద్యమాలలో సామాన్యులు, స్వాతంత్ర్యోద్యమకారులు, తెల్లవాళ్ల చేతుల్లో బానిస జీవితాన్ని కొనసాగించిన ప్రతి భారతీయుడి చైతన్యంలో వందేమాతరం జీవనాడి అయింది.

■ నర్సింగు కోటయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, నల్గొండ

(వందేమాతర గీతానికి 150 ఏళ్లు)


# రైతుబీమాలో కాసుల వేట

- డబ్బులు చెల్లించేందుకు ఏఈవో లంచం వేధింపులు
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన రైతు కుమారుడు
- రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- మరిపెడలో కలకలం



ఏసీబీకి పట్టుబడ్డ నీలికుర్తి ఏఈవో సందీప్

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతు బీమా డబ్బులు చెల్లించేందుకు లంచం వేధింపులకు పాల్పడుతున్న మరిపెడ మండలం నీలికుర్తి ఏఈవో జీ.సందీప్‌ను రూ.10 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడలో గురువారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలంలోని ఆనెపురం రెవెన్యూ పరిధి స్టేజీతండా జీపీకి చెందిన గుగులోత్ బీక్కు గత నెల 14న మృతి చెందాడు. మృతుడికి వ్యవసాయం ఉండడంతో రైతు బీమా వరిస్తుంది. దీంతో బీమా క్లెయిమ్ కోసం మృతుడి కుమారుడు వసంత్ గత నెల 30న ఏఈవో సందీప్‌ను కలిసి అన్ని రకాల బీమా పత్రాలు అందచేశారు. రూ.20 వేలు ఇస్తేనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తానని ఏఈవో చెప్పాడు. దీంతో వసంత్ ఎంత బతిమాలాడినా ఏఈవో వినలేదు. రూ.10 వేలు ఇప్పుడు ఇస్తా, మరో రూ.10వేలు బీమా వచ్చాక ఇస్తానని ఏఈవోతో వసంత్ ఒప్పందం చేసుకొని అదే రోజున బీమాకు సంబంధించిన పత్రాలు ఏఈవోకు ఇచ్చాడు. అయితే (మిగతా 6లో..)



# మునిసిపాలిటీలకు మహర్దశ

- రూ.332.69కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు
- మార్చిలోగా పనుల పూర్తికి గడువు
- పనుల వేగవంతానికి ఉన్నత స్థాయి పర్యవేక్షణ
- మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట

## యూఐడీఎఫ్ కింద నిధుల విడుదల

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నగర పాలక సంస్థతో పాటు పురపాలక సంఘాల్లో త్వరలో అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి. మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) నిధులను విడుదల చేసింది. దీనితో నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల్లో ప్రధానంగా నెలకొన్న తాగునీరు, మురుగు నీటి నిర్వహణ వంటి సమస్యలు తొలగనున్నాయి. యూఐటీడీఎఫ్ నిధులను ప్రధానంగా వీటి కోసమే ఖర్చు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఆ మేరకు కార్పొరేషన్, మున్సిపాలిటీలు పంపిన ప్రతిపాదలకే ఈ నిధులు విడుదల చేసింది.

### రూ.332.69కోట్ల నిధులు

ఉమ్మడి వరంగల్లో ఒక నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీలతోపాటు ఇటీవల కొత్తగా ఏర్పాటైన రెండు పురపాలక సంఘాలు ఉన్నాయి. ప్రస్తుతం పాతవాటికే ప్రభుత్వం నిధులను కేటాయించింది. వీటి మొత్తంగా 332.69 కోట్లను విడుదల చేసింది. వరంగల్ మహా నగర పాలక సంస్థకు రూ.155కోట్లు, మహబూబాబాద్ మున్సిపాలిటీకి రూ.59.69కోట్లు, జనగామ మున్సిపాలిటీకి రూ.18కోట్లు, తొర్రూరు, మరిపెడ, డర్నోకల్, పరకల, వర్ధన్నపేట మున్సిపాలిటీలకు రూ.15కోట్ల చొప్పున, నర్సంపేట మున్సిపాలిటీకి రూ.20కోట్లు, భూపాలపల్లి మున్సిపాలిటీకి రూ.20కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో నగర పురపాలక సంఘాలలోని విలీన గ్రామాలతో పాటు నగరాలు, పట్టణాల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. యూఐడీఎఫ్ ప్రకటించిన నిధులను నేషనల్ హౌసింగ్ బ్యాంక్ సమకూర్చనున్నది. అభివృద్ధి పనులతో పాటు ఈ నిధుల నుంచే పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. రూ.10లక్షల లోపు బకాయిలను సంబంధిత కాంట్రాక్టర్లకు ఈ నిధుల నుంచే చెల్లించనున్నారు.

### ప్రత్యేక పర్యవేక్షణ

ఈ నిధులు నిర్దేశిత పనులకు ఖర్చు అయ్యేట్టు చూడడానికి వీలుగా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టెండర్ల నిర్వహణ మొదలుకొని పనులు పూర్తయ్యే వరకు ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. మార్చిలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇటీవల పురపాలక నిర్వహణ తీరును సమీక్షించిన ముఖ్యమంత్రి.. ఇంత కాలం నిధుల కొరత వల్ల కనీస వసతులకు నోచుకోని పుర, నగర పాలికలు ఇక అభివృద్ధిలో పరుగులు పెట్టాలనే లక్ష్యంతోనే ఈ నిధుల కేటాయింపు చర్యలు తీసుకున్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థతో పాటు మేజర్ మున్సిపాలిటీలు అయిన మహబూబాబాద్, జనగామ, నర్సంపేటలు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అత్యవసర, అభివృద్ధి పనులకు సంబంధించి బ్లూప్రింట్లను తయారుచేసి సిద్ధంగా ఉంచాయి. నిధుల కేటాయింపు సందర్భంగా ఆయా మున్సిపాలిటీలు ముందుగానే సమర్పించిన అంచనా వ్యయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

### విలీన గ్రామాలపై దృష్టి

యూఐడీఎఫ్ నిధుల్లో సింహ భాగం నగరపాలిక, పురపాలికల్లోని విలీన గ్రామాల్లో ఖర్చు చేయనున్నారు. విలీన గ్రామాలు చాలా కాలంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అవి విలీనమై అయిదు నుంచి పదేళ్ళవుతున్నప్పటికీ వాటి పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పటికీ మౌలిక సదుపాలు నోచుకోని విలీన గ్రామాలు అనేకం ఉన్నాయి. వీటిలో మురుగునీటి పారుదల వ్యవస్థ, అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిలో నగరాలను తలపించేలా రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాల కల్పించడానికి ఈ నిధులను వినియోగిస్తారు.



వరంగల్ స్టేషన్ రోడ్డులో ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరోయిన్ శ్రీలీల

# నగరంలో మెరిసిన శ్రీలీల

## వరంగల్ స్టేషన్‌రోడ్డులో ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

- మూడంతస్థుల్లోని వివిధ విభాగాల్లో సందడి
- 'ఐ లవ్ యూ వరంగల్' అంటూ అభివాదం
- భారీగా తరలివచ్చిన అభిమానులు



అభిమానులకు అభివాదం చేస్తున్న దృశ్యం

గిర్మాజీపేట(వరంగల్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరోయిన్ శ్రీలీల గురువారం వరంగల్ నగరంలో సందడి చేశారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రముఖ వ్యాపార సంస్థ ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ చైర్మన్ పొట్టి వెంకటేశ్వర్లు, మేనేజింగ్ డైరెక్టర్ సిర్ల రాజమౌళి, డైరెక్టర్ ప్రసాదరావు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లో వినూత్న డిజైన్‌ల కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి చీరలను చూపుతూ సందడి చేశారు. మొదటి, రెండో అంతస్థుల్లోని కిడ్స్, పురుషులు, మహిళల డ్రెస్సింగ్ విభాగాలను సందర్శించారు. అనంతరం షోరూమ్ బయట ఏర్పాటు చేసిన స్టేజిపైకి చేరుకోగా, అప్పటికే అక్కడికి తరలివచ్చిన అశేష అభిమానులు కేరింతలు కొట్టారు. వారిని చూసిన శ్రీలీల 'ఐ లవ్ యూ వరంగల్' అనడంతో అభిమానులు కేకలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ ఆర్ఎస్ బ్రదర్స్ 15వ షోరూమ్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేశారని, ఇక్కడ అందరికీ అనువైన అందమైన దుస్తులు ఉన్నాయని తెలిపారు. 'అబ్బాయిలను ఆర్ఎస్ బ్రదర్స్ దుస్తుల్లో (మిగతా 7లో..)

# మహిళా డెయిరీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో అధికారులు, సభ్యులతో సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన అన్ని అనుమతుల ప్రక్రియను అధికారులు త్వరగా పూర్తిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులు, మహిళా డెయిరీ నిర్వాహకులతో ఎమ్మెల్యే రేవూరి సమీక్ష నిర్వహించారు. దామెరలో ఏర్పాటు చేస్తున్న పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు మిగిలిన అనుమతుల ప్రక్రియ, నిర్వహణ, తదితర అంశాలపై కలెక్టర్, డీఆర్‌డీఓ, సహకార, పశుసంవర్ధక శాఖల అధికారులతోపాటు మహిళా డెయిరీ నిర్వాహకులతో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళా డెయిరీకి పూర్తిస్థాయి బైలాస్‌ను అధికారులు త్వరగా రూపొందించాలన్నారు. డెయిరీ ఏర్పాటుకు (మిగతా 6లో..)

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం తగదు

- వైఎస్ఆర్ తీసుకొచ్చిన పథకాన్ని తుంగలో తొక్కుతున్నారు..
- డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం నాయకుడు సుందర్‌రాజ్ యాదవ్
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు.. కలెక్టర్‌కు వినతి పత్రం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. కళాశాలలు బంద్ పాటిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఫీజు యింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలలు బంద్ పాటిస్తున్నాయని, ప్రభుత్వం మంజూరు చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నాయన్నారు. అందుకయ్యే ఖర్చులను విద్యాసంస్థల యాజమాన్యాలు భరిస్తూ కళాశాలలను నెట్టుకొస్తున్నాయన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో ఏం చేయాలో అర్థంకాని స్థితిలోకి యాజమాన్యాలు నెట్టివేయబడ్డాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి కళాశాలలను, విద్యార్థులను ఆదుకోవాలన్నారు. డబ్బులు రాక కళాశాలల అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుమాధవ్, జిల్లా కోఆర్డినేటర్ గోలి వెంకట్, సభ్యులు సదానందం, కృష్ణమోహన్, తిరుపతిరెడ్డి, రవీందర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, సంపత్, అన్ని కళాశాలల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మంత్రి కొండా సురేఖ నివాసం వద్ద విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## మంత్రి సురేఖ ఇంటి ముట్టడికి యత్నం

- పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట
- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

6


## దివ్యాంగుల పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

### ఈ నెల 12వ తేదీ వరకు గడువు

హనుమకొండ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు పురస్కారాల ప్రదానోత్సవ దరఖాస్తుల స్వీకరణ చేపట్టినట్లు హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. హనుమకొండ జిల్లాకు చెందిన వివిధ విభాగాల్లోని దివ్యాంగులు నవంబరు 12 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీయస్:/డబ్లూడీయస్‌సీ.తెలంగాణ.గవ్.ఇన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు హనుమకొండ కలెక్టరేట్‌లోని మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల శాఖ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని పేర్కొన్నారు. దరఖాస్తులను కార్యాలయంలో కూడా అందచేసే సమాచారాన్ని పొందవచ్చన్నారు.

# ఖద్దరుకు ఖాకీ సలామ్

రాజకీయ నాయకుల కనుసన్నల్లో పోలీసులు



- నేతల పైరవీ ఉంటేనే కేసుపై దృష్టి
- పెద్దలు చెబితే నిందితులకు రాచమర్యాదలు
- బాధితులను ముప్పు తిప్పలు పెడుతున్న అధికారులు
- రాజీపడేలా బాధితులపై పోలీసుల మానసిక ఒత్తిడి
- ఉన్నతాధికారులు దృష్టిసారించాలని విన్నపం

వరంగల్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖద్దరుకు ఖాకీలు లొంగిపోతున్నారు. వారు చెప్పిందే వేదంగా పాటిస్తున్నారు. అభాగ్యులకు సాయం చేయాల్సిన పోలీసులు.. ప్రజాప్రతినిధులు, నాయకుల చేతిలో కీలుబొమ్మగా మారి బాధితులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయనేతలు, వారి అనుచరులు, రౌడీషీటర్లు, చీటర్స్ భూకబ్జాదారులతో అంటకాగుతూ అప్రతిష్ఠను మూటగట్టుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్ వస్తే చాలు.. నిందితుడికి వత్తాసు పలుకుతున్నట్లు విమర్శలున్నాయి. లేకుంటే బాధితులనే ముప్పు తిప్పలు పెడుతూ వారికి వారే రాజీపడేలా పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పార్టీల పేరుతో చెలామణి అవుతున్న కొంత మంది నాయకులు (పెద్ద మనుషులు) (మిగతా 6లో..)

### పోలీస్‌బాస్‌కు చేరడం లేదా?

ప్రజలు ఏయే సమస్యలపై ఠాణాలు ఆశ్రయిస్తున్నారు..? స్టేషన్ అధికారులు ఏ విధంగా స్పందిస్తున్నారు..? ప్రతి రోజూ ప్రైవేట్ వ్యక్తులు స్టేషన్‌లో గంటల తరబడి ఎందుకు కూర్చొంటున్నారు..? ఒక వ్యక్తి నెలల కొద్దీ న్యాయం కోసం స్టేషన్‌ను ఆశ్రయిస్తుంటే అసలు సమస్య ఎంటీ? అనే విషయాలను పోలీస్‌బాస్‌కు చేర్చాల్సిన ఎస్‌బీ విభాగం ఏంచేస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది సీఐలు, ఎస్సైల తీరుపై పెద్దసార్లు పట్టించుకోరా..? అని గ్రామాల్లోని ప్రజలు పేర్కొంటున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగక వారానికి వందలాది మంది బాధితులు పోలీస్ కమిషనరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌ను ఆశ్రయిస్తున్నారని బాధితులు వెల్లడిస్తున్నారు. అక్కడ న్యాయం జరిగితే ఇక్కడకి రావాల్సిన అవసరమే ఉండదంటున్నారు.

### ఖద్దరు లీలలు

- వరంగల్ పోలీస్ సబ్‌డివిజన్‌లోని ఓ ఠాణాలో ఎస్సై, బదిలీ అయిన సీఐ ఓ మాజీ ప్రజాప్రతినిధితో చేతులు కలిపి ఓ భూ వివాదంలో రిటైర్ ఉద్యోగిపై కేసు పెట్టారు. దీంతో బాధిత రిటైర్డ్ ఉద్యోగి సెంట్రల్‌జోన్ డీసీపీని కలిసి తన గోడు వెళ్లబోసుకోగా.. అప్పటికప్పుడు మాజీ ప్రజాప్రతినిధితో పాటు మరి కొంతమందిపై ఎస్సై కేసు నమోదు చేశాడు. అయితే ఇది మనసులో పెట్టుకుని రిటైర్డు ఉద్యోగిపై మరో కేసులో ఇరికించి కేసు నమోదు చేశారు.
- వరంగల్ సబ్‌డివిజన్ పరిధిలో నివాసం ఉంటున్న దంపతులకు తక్కువ ధరకు భూమి కొనుగోలు చేయిస్తామని చెప్పి ఓ ఎమ్మెల్యే, ఆయన అనుచరుడు కలిసి వారి నుంచి కొంత నగదుతో పాటు బంగారు ఆభరణాలు తీసుకుని మోసం చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఎమ్మెల్యే ఒత్తిడితో తన అనుచరుడిని అరెస్టు చేయకుండా మధ్యవర్తిని అరెస్టు చేశారు. కానీ బంగారు ఆభరణాలు మాత్రం రికవరీ చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.
- ఓ వ్యక్తి నుంచి రావాల్సిన డబ్బులను ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేశాడు. డబ్బులను బాధితులకు తిరిగి ఇవ్వకపోవడంతో నగర శివారులోని ఓ గ్రామంలో తన పేరిట ఉన్న 6 గుంటల భూమిని బాధితులకు రాసిచ్చాడు. తీరా అక్కడికి పోతే స్థలం ఆయనది కాదని తేలింది. దీంతో బాధితులు హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఓ ఎమ్మెల్యే నిందితుడిని కాపాడేందుకు సీఐపై ఒత్తిడి తెస్తున్నట్లుగా తెలుస్తోంది.

# వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపించాలి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ నగరాన్ని వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం లభించేందుకు ప్రణాళికలు రూపొందించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు ఇరిగేషన్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల వింగ్ అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నగరంలోని లోతట్టు ప్రాంతాల పరస్థితిని వీక్షించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరద నీరు సులువుగా ప్రవహించేందుకు అధికారులు అప్రమత్తమై శాశ్వత ప్రణాళికలు రూపొందించాలన్నారు. స్ట్రాంవాటర్ డ్రైన్‌లతో పాటు కాలనీలలో మురుగు నీరు వెళ్లేందుకు అంతర్గత డ్రైన్‌లు నిర్మించేందుకు డీపీఆర్(డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారు చేయాలన్నారు. ఈసమావేశంలో ఎస్ఈ సత్యనారాయణ, ఇన్‌చార్జి సీపీ రవీందర్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, డీఈలు రంగారావు, రవికిరణ్, కార్తీక్‌రెడ్డి, రోజారాణి, రాజ్‌కుమార్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరం జరిగితే 1930కు ఫోన్ చేయాలి

● సైబర్ క్రైం డీఎస్పీ కలకోట గిరికుమార్



ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్‌కు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సైబర్ టీం సిబ్బంది

వరంగల్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరం జరిగినట్లుగా భావిస్తే తక్షణమే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని సైబర్ క్రైం డీఎస్పీ కలకోట గిరికుమార్ తెలిపారు. సైబర్ జాగరూకత దినోత్సవంలో భాగంగా గురువారం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో ఉదయం క్రీడా మైదానాలు, సీకేఎం కళాశాల, ఎఫ్ఎంఎం సంస్థ అనుంత భవన్, ఏకశిల పార్కులో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నకిలీ పెట్టుబడులైన స్టాక్స్ ట్రేడింగ్ పేరిట మోసాలు, డిజిటల్ అరెస్టు, లోన్ యాప్స్, ఏపీకే ఫైల్స్ (పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ యోనో, ఆర్‌టీఐ చలాన్) సోషల్ మీడియాకు సంబంధించి డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలతో డబ్బులు కట్ చేస్తున్న తరహా, ఫొటోలు మార్ఫింగ్ చేసి నేరాలకు పాల్పడుతున్న తీరును డీఎస్పీ గిరికుమార్ వివరించారు.

# కోళ్ల రైతులను ఆదుకున్న మహనీయుడు బీవీ రావు



ఉడక బెట్టిన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం

న్యూశాయంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పరిశ్రమను స్థాపించి కోళ్ల రైతులను ఆదుకున్న మహనీయుడు బీవీ రావు అని నెక్ వరంగల్ జోనల్ కమిటీ మెంబర్ టి.సుబ్రహ్మణ్యం అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో గురువారం పౌల్ట్రీ పితామహుడు బీవీ రావు 90వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, రావు జ్ఞాపకార్థం ఉడుకబెట్టిన కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఈనెల 26, 27, 28 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌ను కోళ్ల రైతులు సందర్శించి పరిశ్రమ అభివృద్ధి చేసేందుకు అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య, వి.రామారావు, పి.హరిబాబు, జి.రమణారెడ్డి, రాంప్రసాద్, రాంచందర్‌రావు, వీరన్న, ప్రతాప్, గాంధీ, ధనుంజయ, వినయ్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

గీసుగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారం వద్ద వరంగల్ - నర్సంపేట రహదారిలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం సమీపంలో ఆదిదేవ్ పంక్షన్‌హాల్ వద్ద నర్సంపేట వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. దీంతో యూపీకి చెందిన సూరజ్ ముఖేష్, విక్కీ, జాన్‌పాకకు చెందిన అహ్మద్ అలీ, షహీన్‌సుల్తానాలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వెంటనే 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తప్పించుకుపోతున్న కారును పట్టుకొని డ్రైవర్ భానుప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు.

కాగా, మధ్యాహ్నం ధర్మారం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో సంగెం మండలం నల్లబెల్లికి చెందిన బానోతు శివ, అజ్మీరా గణేశ్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన లావుడ్యా హోమ్లీ, శరత్ అనే నలుగురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వరంగల్ వైపు నుంచి నర్సంపేటకు వెళ్తున్న వాహనం టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు.



# స్టేడియంలో పెండింగ్ పనులు పూర్తిచేయాలి

● వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

● జేఎన్ మైదానంలో పనుల పరిశీలన



జేఎన్ఎస్‌లో పనులను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్ మైదానంలో జీడబ్ల్యూఎంసీ చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న కాలనీలతోపాటు 49వ డివిజన్‌లోని పలు కాలనీలలో పర్యటించారు. రామకృష్ణ కాలనీ, తారాగార్డెన్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మేయర్ పర్యటించి అక్కడి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లో జేఎన్ఎస్‌లో అగ్నివీర్ ఆర్మీ ర్యాలీ ఉన్న నేపథ్యంలో మైదానంలో మొత్తంగా బల్దియా అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. స్టేడియంతో గ్రావెల్ పనులు, ఫ్లోరింగ్, లైటింగ్ పనులు త్వరిత గతిన అమర్చాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాసన రాంప్రసాద్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీవైఎస్‌వో అశోక్, ఆర్మీ మేజర్ గురుదయాల్‌సింగ్, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈలు రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్, సారంగం, శానిటరి సూపర్‌వైజర్ నరేందర్, ఏఈ విజయలక్ష్మి తో పాటు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సురేఖ ఇంటి ముట్టడికి యత్నం

● పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట

● ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

హనుమకొండ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులుగా కళాశాలలకు తాళాలు వేసి నిరవధిక బంద్ చేపట్టారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇంటిని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుల ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని నినాదాలు చేస్తూ ఇంటిముందు విద్యార్థులు గంట పాటు బైఠాయించి ధర్నా చేశారు. సమాచారం తెలుసుకున్న సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతుండగానే కొందరు విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొండా సురేఖ ఇంటిలోపలికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు విద్యార్థులను పక్కకు తోసివేయడంతో తోపులాట జరిగింది. అనంతరం విద్యార్థులను సుబేదారి పోలీసు స్టేషన్‌కు తరలించి సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేరని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేయడంపై మండిపడ్డారు. రాష్ట్రంలో 18లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తక్షణమే విద్యాశాఖపై సమీక్ష జరిపి విద్యా సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 10, 11 తేదీల్లో బంద్‌ను విజయవంతం చేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

హనుమకొండ చౌరస్తా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల హక్కులను సాధించుకోవడానికి ఈ నెల 10, 11 తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన పని బంద్, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ 9,10వ డివిజన్లలో పర్యటించి అక్కడ విధులు నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులను ఉప్పలయ్య కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునిసిపల్ కార్మికులకు రాష్ట్రంలో ఇతర కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలాగా 8 గంటల ఒక్కపూట పనిపెట్టాలని కోరారు. మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం అమలుతో పాటు కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో లాగా మునిసిపల్ జవాన్లకు రూ.19వేల500 వేతనం అందించాలని డిమాండ్ చేశారు. హార్టికల్చర్, వాటర్ సప్లయి విభాగాల్లో పనిచేస్తున్న రోజువారీ కార్మికులకు కలెక్టర్ గెజిట్ ప్రకారం రూ.16926 ఇవ్వాలన్నారు. ట్రాక్టర్, టిప్పర్లు, జేసీబీలు నడిపే హెవీ వెహికిల్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.20,500 వెంటనే అమలుచేయాలని ఉప్పలయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మునిసిపల్ యూనియన్ నాయకులు మహేష్, వై.బాబు, రమేష్, సదానందం, రవి, మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ చౌరస్తాలో మునిసిపల్ కార్మికులను కలిసి బంద్‌కు సహకరించాలని కోరుతున్న ఉప్పలయ్య

# రైతుబీమాలో కాసుల వేట

(5వ పేజీ తరువాయి)

డబ్బులు ఇచ్చాకే పని మొదలు పెడతానని ఏఈవో చెప్పడంతో బాధితుడు హనుమకొండలోని ఏసీబీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం వసంత్ ఏఈవోకు ఫోన్ చేసి డబ్బులు పట్టుకొస్తున్నానని, ఎక్కడికి రావాలని అడగగా మరిపెడ బంగ్లాలోని జేజే రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ఓ బేకరి దగ్గరకు రమ్మని చెప్పాడు. వసంత్ డబ్బులు పట్టుకొని అక్కడికి వెళ్లాడు. రూ.10వేలు ఏఈవో సందీప్‌కు ఇస్తుండగా ఏసీబీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఏఈవో నివాసం ఉంటున్న ఇంట్లో, మరిపెడ వ్యవసాయ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ఏసీబీ వరంగల్ కోర్టుకు తీసుకెళ్లారు. ఈ దాడుల్లో డీఎస్పీ వెంట సీఐ ఎల్.రాజు, శేఖర్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు. ఈ సంఘటన మండల కేంద్రంతో పాటు, వ్యవసాయ శాఖ ఉద్యోగ వర్గాల్లో కలకలం సృష్టించింది.

# అశోక్‌నగర్ కాంగ్రెస్‌లో వర్గపోరు

● ఒకే రోజు రెండు గ్రామ కమిటీల ఎన్నిక

● రెండుగా విడిపోయిన కార్యకర్తలు

ఖానాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొందరు ఒక వర్గంగా, మాజీ ఎంపీపీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో మరికొందరు ఇంకొక వర్గంగా ఏర్పడ్డారు. కొద్దినెలల కిందట గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఎల్తి శ్రీనివాస్‌ను పార్టీ పెద్దలు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో నాటినుంచి గ్రామపార్టీ అధ్యక్ష స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో గురువారం నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేయడానికి హరిబాబు ఆధ్వర్యంలో మండల నాయకులు అశోక్‌నగర్ గ్రామానికి వచ్చారు. దీంతో విషయం తెలుసుకున్న రవీందర్‌రావు వర్గం వారు కమిటీ ఎన్నిక జరిగే వేదిక వద్దకు వెళ్లారు. అధ్యక్షుడి నియామకం కోసం ఓటింగ్ పెట్టాలని సూచించారు. అందుకు హరిబాబు వర్గం అంగీకరించకుండా తమకు ఇష్టమైన వ్యక్తిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీంతో రవీందర్‌రావు వర్గం సమావేశం నుంచి లేచి వెళ్లిపోయారు. అనంతరం పాకాలకువెళ్లి అక్కడ వారు సైతం మరో నూతన గ్రామ కమిటీని నియామకం చేసుకున్నారు.

కాగా, అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా గ్రామ కమిటీలను వేసుకోవడంతో పార్టీలో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు రుచించడం లేదు. పార్టీలో చీలిక రావడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం కష్టమవుతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కల్పించుకుని పరిస్థితి చక్కదిద్దాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.

**పోటాపోటీ కమిటీల ఎన్నిక**

అశోక్‌నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు తెలిపారు. అధ్యక్షుడిగా జాడి అచ్యుతం, యూత్ అధ్యక్షుడిగా గోనెల మురళిని ఎన్నుకున్నారు. అలాగే మరోవర్గం వారు అశోక్‌నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుదురు సారయ్య, ఉపాధ్యక్షుడిగా బండి సంజీవ, ప్రధాన కార్యదర్శిగా అలువాల రమేష్‌ను, అదేవిధంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూస మునేందర్, ఉపాధ్యక్షుడిగా దొడ్డ మురళిని ఎన్నుకున్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

● బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్



అంబేద్కర్ విగ్రహం వద్ద మౌనదీక్ష చేస్తున్న బీసీ జేఏసీ నేతలు

వడ్డేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిందేనని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ నాయకులు మౌనదీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో 10శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొని అన్ని రంగాలను శాసిస్తూ బీసీ సమాజాన్ని అణగదొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలు మాత్రం అగ్రవర్ణ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలుగా, ఓట్లు వేసే యంత్రాలుగా మిగిలిపోతున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే మద్దతునిచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని దుయ్యబట్టారు.

ఈ మౌన దీక్షలో వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాడి మల్లయ్య యాదవ్, బొనగాని యాదగిరి గౌడ్, బీసీ జేఏసీ మహిళా నాయకురాళ్లు తమ్మల శోభారాణి, మాదం పద్మజాదేవి, తేళ్ల సుగుణకిశోర్, హైమావతి, బచ్చు ఆనందం, దాడి రమేష్ యాదవ్, గొట్టి మహేందర్, డాక్టర్ ఒడితెల రాము, తంగళ్లపెల్లి రమేష్, పంజాల మధుగౌడ్, జ్ఞానేశ్వర్, రజినీకాంత్, పొన్నం సంపత్, చాగంటి రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

# ముగిసిన క్రీడా పాఠశాల ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) ఆదేశాల మేరకు జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ప్రారంభం కానున్న క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసింది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాకు చెందిన బాలురకు జేఎన్ఎస్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 28మంది పాల్గొన్నారని డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 14 లోపు జేఎన్ఎస్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రీడాపాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ పూర్తి చేశామన్నారు. ఈ మేరకు 40 మంది బాలురు, 40 మంది బాలికలకు రెండురోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్‌లో 28మంది బాలురు, 27మంది బాలికలు మొత్తం 55 మంది ఈ ప్రక్రియలో పాల్గొన్నరన్నారు. జేఎన్ఎస్ క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం అర్హత సాధించిన బాలబాలికలకు డీఎస్ఏ నుంచి ఫోన్ ద్వారా త్వరలోనే సమాచారం అందిస్తామని అశోక్‌కుమార్ తెలిపారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి సాట్ అబ్జర్వర్లుగా ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ రవికుమార్, హాజరయ్యారని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది, వివిధ జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ గడ్డకు పూర్వవైభవం తెస్తా..

● స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

● మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కమలాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ గడ్డకు పూర్వ వైభవం తీసుకువస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలోని రాశచెట్టు వద్ద గురువారం మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన 200 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీజేపీలో చేరగా.. పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించానని అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్ అంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నిద్రపట్టకుండా చేశామన్నారు. ఆయా ప్రభుత్వాలకు చెందిన పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఎన్నో రకాలుగా బెదిరింపులకు గురిచేసినా బెదరలేదని, రాష్ట్ర సాధన కోసం ఉడుంపట్టు పట్టి ఉద్యమాలు చేశామన్నారు. పెడింగ్‌లో ఉన్న దళితబంధు బిల్లులపై కరీంనగర్, హనుమకొండ జిల్లాల కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి నియోజకవర్గంలోని దళితులకు బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులను, కార్యకర్తలను గెలిపించి పార్టీకి కానుకగా ఇవ్వాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ సర్పంచ్ చకిలం శ్రీనివాస్, పంజాల సారయ్య గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు కట్కూరి అశోక్ రెడ్డి, బండి కళాధర్, కనుకుంట్ల అరవింద్, పల్లె వెంకట్ రెడ్డి, మౌటం సంపత్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఖద్దరుకు ఖాకీ సలామ్

(5వ పేజీ తరువాయి)

పోలీసులతో దోస్తీ చేస్తూ కొద్దోగొప్పో ముట్టచెబుతూ.. వాళ్ల పని చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. నగరంలో అయితే నేతల అనుచరులైన పొలిటికల్ రౌడీషీటర్లు సైతం నిందితులను కాపాడటం కోసం పోలీసులతో పైరవీ చేయించుకుంటున్నట్లు సమాచారం.

**బాధితుల ప్రదక్షిణలు**

న్యాయం చేస్తారని ఠాణాలను ఆశ్రయిస్తే..న్యాయం దేవుడెరుగు కొత్త సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. సమస్య ఉందని వస్తే నెలలకొద్దీ నానబెడుతూ పెద్ద మనుషుల వద్దకు పంపిస్తున్నారంటున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసు అధికారులు సమస్య తీవ్రత తెలుసుకోకుండా, ఫిర్యాదుదారుడితో మాట్లాడకుండానే అందుబాటులో ఉన్న కానిస్టేబుల్‌కు అప్పగించి ఇదేందో చూడండంటూ తేలికగా తీసుకుంటున్నారు. దీంతో గత్యంతరం లేక బాధితులు ఎవరో ఒక ప్రజాప్రతినిధినో, రాజకీయ నాయకుడినో ఆశ్రయించి కొంత ఖర్చుపెట్టుకొని పైరవీ చేయించుకుంటే తప్ప సమస్యపై దృష్టిసారించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పైరవీ లేకుండా పని కాదనే పరిస్థితిని పోలీసులు తీసుకొచ్చారని న్యాయం కోసం ఠాణాలను ఆశ్రయించి విసుగు చెందిన బాధితులు గోడు వెళ్లగక్కుతున్నారు. బాధితుడు ఎన్ని ఆధారాలు చూపించినప్పటికీ తమకు అనుకూలంగా ఉండే పొలిటీషియన్స్, గ్రామాల్లో పెద్ద మనుషులుగా చెలామణి అయ్యే పొలిటీషియన్స్ అనుచరుల జడ్జిమెంట్‌కే కొంతమంది పోలీసులు జై కొడుతున్నారనే అపవాదు ఉంది.

# మహిళా డెయిరీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళా డెయిరీకి గ్రామాల నుంచి పాల సేకరణ మొదలుకొని బ్రాంచ్ మిల్క్ సెంటర్లకు, అక్కడి నుంచి డెయిరీకి తరలింపు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఇప్పటికే సంఘాలలోని సభ్యులకు ముల్కనూరు డెయిరీలో శిక్షణ కార్యక్రమం ఇప్పించినట్లు తెలిపారు. త్వరలోనే నడికూడ, పరకాల మండలాలలో బ్రాంచ్ మిల్క్ సెంటర్‌లను ప్రారంభించి, వాటి ద్వారా మహిళా డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను విక్రయించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సబ్సిడీపై ఎస్సీ, ఎస్టీ బీసీ పాడిరైతులకు గేదెలను ఇప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే రేవూరి పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. రెండు రోజుల్లో ప్రస్తుతం సభ్యత్వం ఉన్న 21 మంది ఆధార్ కార్డులు అందజేయాలని, ఫీజుబిలిటీ రిపోర్టు త్వరగా అందజేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందన్నారు. డెయిరీ నిర్వహణ బాధ్యతలు సొసైటీలోని మహిళలే చేపడితే బాగుంటుందన్నారు. డెయిరీ ఆపరేషన్స్‌లో ప్రాసెసింగ్, క్వాలిటీ చెకింగ్, తదితర అంశాలను అనుభవం ఉన్నవారిలో ప్రారంభించాలన్నారు. మహిళా డెయిరీ ఏర్పాటు నేపథ్యంలో మూడు వేల యానిమల్స్ కావాల్సి ఉండగా, ఎక్కడ లభిస్తాయనే వివరాలతో కూడిన ప్రతిపాదనలు పశుసంవర్ధక శాఖ అధికారులు రెండు రోజుల్లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఇతర శాఖల అధికారులతో మహిళా డెయిరీ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వందేమాతరం గీతం ఆలపించాలి


● ఇన్‌చార్జి డీఈవో వెంకట్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉదయం 10 గంటలకు సామూహిక వందేమాతరం గీతం ఆలపించాలని అడిషనల్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో ఎ.వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో ఆయన యూడైస్, వర్క్‌అడ్జెస్ట్‌మెంట్‌పై ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేమాతరం గీతం 150 ఏళ్ల వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అవసరమున్న చోట మాత్రమే ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు డాక్టర్ మన్మోహన్, సుదర్శన్‌రెడ్డి, మహేష్, ఏసీజీఈ భువనేశ్వరి, ఎంఈవోలు పాల్గొన్నారు.

# అధునాతన సాంకేతికత

## మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- తొలిసారిగా 16 సర్కిళ్లలో ఏర్పాటు
- లోపాల సవరణకు ఎఫ్‌పీఐలు
- ఆటోమేటిక్ మీటర్ రీడింగ్
- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి వెల్లడి


సబ్‌స్టేషన్‌లో అమర్చిన ఆధునిక పరికరాలు

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి సాంకేతికంగా అందిపుచ్చుకొని రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్‌టీఎఫ్‌ఎం)ను ఎన్‌పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లలో ఏర్పాటు చేశామని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. దేశంలోని అధునాతన టెక్నాలజీ అయిన ఆర్‌టీఎఫ్‌ఎంను ఎన్‌పీడీసీఎల్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో రియల్ టైమ్‌లో కచ్చితమైన సమాచారం పొందగలుగుతామని, తద్వారా వేగవంతంగా చర్యలు చేపట్టవచ్చునని అన్నారు. ఫీడర్ల పర్య వేక్షణ, త్వరగా ప్రతిస్పందించడం ద్వారా అంతరాయాలు గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు. టెక్నికల్ టీమ్ సభ్యులు ఆరు రాష్ట్రాలలో ఈ సాంకేతిక తను అధ్యయనం చేసిన తర్వాత ఎంచుకున్నామని చెప్పారు. ఒడిశా రాష్ట్రంలో ఈ టెక్నాలజీ వాడుతున్నా రని తెలిపారు. ఎన్‌పీడీసీ ఎల్‌కు అనుగుణంగా ఈ టెక్నాలజీ సరిపడేలా తీర్చిది ద్దామని చెప్పారు. ఈ అధునా తన టెక్నాలజీ ఎన్‌పీడీసీఎల్‌కు ఉపయోగకరంగా ఉందని నిర్ధారించు కున్న తర్వాతనే, ముందుగా ఐదు సబ్‌స్టేషన్లలో ప్రయోగాత్మకంగా పరీక్షించామన్నారు. ఈ 5 సబ్‌స్టేషన్లు స్కాడా కు అనుసంధానం అయిన తర్వాత వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మిగతా 133 సబ్‌స్టేషన్లకు అనుసంధానించామని వివరించారు. మిగిలిన సబ్‌స్టేషన్ల పనులు చురుకుగా సాగుతున్నాయని, లక్ష్యాలను సాధించే దిశగా ఇంజనీర్లు శక్తివంచన లేకుండా కృషి చేస్తు న్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని సబ్‌స్టేషన్లకు అవసరా నికి తగ్గట్టుగా తక్కువ ఖర్చుతో ప్రభావంతంగా నిరూపితమైన సమాచార సాంకేతికత రూపొందించామని చెప్పారు. వరంగల్ హెడ్‌క్వార్టర్స్‌లో స్కాడాకు సబ్‌స్టేషన్ల కొరకు కొత్త సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశామని వరుణ్‌రెడ్డి తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్లను దృష్టిలో ఉంచుకొని రాబోయే 15 ఏళ్లకు సంబంధిచి సాఫ్ట్‌వేర్ పరంగా సర్వర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

### ఆర్‌టీఎఫ్‌ఎంతో ప్రయోజనాలు

ఈ సాంకేతికత వల్ల స్కాడా కంట్రోల్ రూమ్ నుంచి నిర్వహించవచ్చు. రియల్ టైంలో విద్యుత్ అంతరాయం సమాచారాన్ని ఫీల్డ్ సిబ్బందికి తెలియజేసి అతిత క్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించవచ్చు. ఓవర్‌లోడ్ హెచ్చరికలను ఫీల్డ్ సిబ్బందికి రియల్ టైమ్‌లో తెలియజేయవచ్చు. విద్యుత్ వినియోగం, వోల్టేజీ లెవల్స్ మొదలైన వివరాలను రియల్ టైమ్‌లో సేకరించవచ్చు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొని వేగవంతంగా విద్యుత్ సమస్యలను పరిష్కరించడం ద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టం ఎంతో ప్రయోజనకరమని సీఎండీ తెలిపారు.

### ఎఫ్‌పీఐ ప్రయోజనాలు


ఎఫ్‌పీఐ విద్యుత్ సమస్యను, సమాచారాన్ని, స్థానాన్ని వేగంగా గుర్తించి కంట్రోల్ సెంటర్‌కు తెలియజేస్తుంది. సంబంధిత ఫీల్డ్ సిబ్బందికి ఎస్‌ఎంఎస్ హెచ్చరికలు వెళతాయి. అదే విధంగా ఎఫ్‌పీఐ ద్వారా ప్రదేశంలో ఫ్లాష్‌లైట్ సూచన కూడా కనిపిస్తుంది. ఫీల్డ్ సిబ్బంది మొత్తం లైన్‌లో పెట్రోలింగ్ చేయకుండా నేరుగా సమస్య ఉన్న భాగాన్ని గుర్తించగలుగుతారు. దీనివల్ల ఫాల్ట్ డిటెక్షన్, పునరుద్ధరణ సమయం ఆదా అవుతుంది.

### ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు (ఎఫ్‌పీఐ)

దీనికి అనుసంధాంగా విద్యుత్ సరఫరా వ్యవస్థలో 33 కేవీ, 11 కేవీ సుదూర లైన్లలో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను పెడుతున్నామ ని చెప్పారు. బ్రేక్‌డౌన్ సమయంలో ప్రకృతి వైపరిత్యాలు లేదా సాంకేతిక కారణాల వల్ల లైన్ మొత్తం తనఖీ చేసే అవసరం లేకుండా, విద్యుత్ అంతరాయం ఏర్పడిన భాగాన్ని ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ గుర్తిస్తుంది. తద్వారా అంతరాయం ఏ భాగంలో జరి గిందో వెంటనే విశ్లేషించి, అక్కడికే వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు. ఫాల్ట్‌ను త్వరగా పున రుద్ధరించడంలలో ఎఫ్‌పీఐఎస్ ఎంతో దోహదపడుతున్నాయని వివరించారు. 33,11 కేవీ ఫీడర్లలో 2500 ప్రదేశాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని తెలిపారు.

### ఆటోమేటిక్ మీటర్ రీడింగ్

హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులకు బిల్లుల అందజేతలో వేగం, పారదర్శకత పెంచేందుకు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఎఎంఆర్) వ్యవస్థను రూపొందించామని తెలిపారు. విద్యుత్ వినియోగదారు లకు మాన్యువల్ బిల్లింగ్ సమస్యలు లేకుండా ఉండేందుకు ఎఎంఆర్ విధానం ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సర్కిల్‌లో అధిక సామర్థ్యంతో విద్యుత్ వినియోగించే పరిశ్రలకు వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ విధానం వల్ల తప్పులు జరిగే అవకాశం ఉండదని, విద్యుత్ సరఫరాలో వచ్చే హెచ్చు తగ్గులను త్వరితగతిన గుర్తించవచ్చునని తెలిపారు. సిబ్బంది సమయం వృథా కాదని సీఎండీ పేర్కొన్నారు.


ఎన్‌పీడీసీఎల్ ఏర్పాటు చేసిన సరికొత్త సాంకేతిక యంత్రాలు



డీన్ కార్యాలయం వద్ద బైఠాయించిన పీహెచ్‌డీ ఆశావహ అభ్యర్థులు

# పీహెచ్‌డీ ప్రవేశాల్లో గందరగోళం

- సీట్లు పెంచాలని అభ్యర్థుల ఆందోళన
- డీన్ ఆఫీస్ ఎదుట బైఠాయింపు
- కేయూ వీసీ, రిజిస్ట్రార్లను కలిసి వినతి

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పీహెచ్‌డీ అడ్మిషన్ల రీషెడ్యూల్ ఇంటర్వ్యూ ప్రక్రియ గందరగోళంగా మారింది. గురువారం ఉదయం కేయూక్యాంపస్‌లోని డీన్ కార్యాలయం ఎదుట పీహెచ్‌డీ అభ్యర్థులకు రీ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సమాయత్తం అయ్యారు. ఈ క్రమంలో అభ్యర్థులందరూ ఇంటర్వ్యూల ప్రక్రియను అడ్డుకున్నారు. గతంలో నిర్వహించిన తెలుగు పీహెచ్‌డీ అడ్మిషన్ల ఇంటర్వ్యూలు ఎందుకు రద్దు చేసి రీషెడ్యూల్ ప్రకటించారని అభ్యర్థులు వర్సిటీ ఉన్నతాధికారులను నిలదీశారు. డీన్ కార్యాలయం ఎదుట బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. తెలుగు విభాగంలో ఆశావహులైన పీహెచ్‌డీ అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారని, సీట్లు రెండు ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ వర్సిటీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలతో అభ్యర్థుల గొడవ నేపథ్యంలో పోలీసులు డీన్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అభ్యర్థులను శాంతించేందుకు ప్రయత్నించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సీట్ల పెంపు అంశం తన పరిధిలో లేదని, వీసీ దృష్టికి తీసుకుపోతామని ఆర్ట్స్ విభాగం ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ ప్రకటించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు వర్సిటీ పరిపాలన భవనానికి చేరుకుని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి తమ డిమాండ్లను విన్నవించారు. వీసీ, రిజిస్ట్రార్లకు తెలుగు విభాగంలో సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సీట్ల పెంపు ఇప్పటికప్పుడు సాధ్యం కాదని, డీన్ కార్యాలయంలో అర్హులైన అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని, మళ్లీ నోటిఫికేషన్‌లో వారికి సీట్ల కేటాయించేలా ప్రయత్నిస్తామని వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. తమకు ఇప్పటి నోటిఫికేషన్‌లోనే సీట్లను పెంచి ఇంటర్వ్యూలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు నోటిఫికేషన్ ఇచ్చిన సీట్ల సంఖ్య పెంచడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. 2022 పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో అన్ని విభాగాల్లో సీట్లు పెంచి ఆశావహులైన అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించగా, తెలుగు విభాగంలో కొద్దిమందికే అవకాశం కల్పించారని అభ్యర్థులు అధికారులకు విన్నవించారు.

ఇదిలాఉండగా, తెలుగు విభాగంలో నిర్వహించిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలలో అవకతవకలు జరిగాయని వర్సిటీ ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఈ దఫా పకడ్బందీగా పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహించాలని భావించిన కేయూ ఉన్నతాధికారులు తిరుపతిలోని పద్మావతి మహిళ వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌తోపాటు నాగార్జున వర్సిటీ తెలుగు విభాగం సీనియర్ ప్రొఫెసర్లను ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ సబ్జెక్టు ఎక్స్‌పర్టులతో కమిటీని నిర్వహించారు. కాగా కేయూ తెలుగు విభాగం విభాగం రిటైర్డు ప్రొఫెసర్ ఇంటర్నల్ సబ్జెక్టు ఎక్స్‌పర్టుగా ఉండి అవకతవకలకు పాల్పడిన అంశాలపై వర్సిటీ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ ఆందోళనలో తెలుగు పీహెచ్‌డీ ఆశావహులైన అభ్యర్థులు రాజు, యాదగిరి, సునీల్, శైలజ, తిరుపతితో పాటు దివ్యాంగులు పాల్గొన్నారు.

# గురుకుల జోనల్ పోటీలు అదుర్స్!

**చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : మల్టీ జోనల్ అధికారి అలివేలు**


క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి మల్టీ జోనల్ క్రీడా పోటీలు అదుర్స్ అనిపించాయి. గురువారం మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఈ పోటీలను సాంఘిక సంక్షేమ గురుకుల జోనల్ స్థాయి అధికారులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భద్రాద్రి జోన్ పరిధిలోని 11 గురుకులాల నుంచి మొత్తం 935 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, రన్నింగ్, హై, లాంగ్ జంప్ తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అతిథులకు వివిధ గురుకులాల విద్యార్థులు గౌరవ వందనం సమర్పించి ఘన స్వాగతం పలికారు. మల్టీ జోనల్ అధికారి అలివేలు క్రీడా జ్యోతిని విద్యార్థులకు అందించి పోటీలను ప్రారంభించారు. డ్యాన్స్‌తో విద్యార్థులు హోరెత్తించారు. తొలి రోజు నుంచే పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో డీసీవో జాక్వెలిన్, క్రీడల అధికారి రూత్మనీ, డీఎంహెచ్‌వో రవిరాథోడ్, డీపీఏహెచ్‌వో కిరణ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ విజయానంద్, ఎస్సై వీరభద్రరావు, డాక్టర్ రవినాయక్, ప్రిన్సిపాల్ దయాకర్, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు, పీడీ, పీఈటీలు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భద్రాద్రి మల్టీజోన్ అధికారి అలివేలు ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మరిపెడ ఎస్సీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 11వ జోనల్ పోటీల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు గెలుపోటములను సహజంగా తీసుకొని మెళకువలను నేర్చుకోవాలని కోరారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గుర్తు చేశారు. పోటీలకు హాజరైన విద్యార్థులను అభినందిస్తూ మల్టీజోన్ నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎదగాలన్నారు.

# ప్రజా ఉద్యమాల ద్వారానే బీసీ రిజర్వేషన్ల అమలు

- 9వ షెడ్యూల్‌లో బిల్లును చేర్చాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- బీసీ దీక్షలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్


నర్సంపేటలో బీసీ దీక్ష వద్ద మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాల ద్వారానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య ఆధ్వర్యంలో నర్సంపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం ఒక రోజు బీసీ దీక్షను నిర్వహించారు. దీక్షను ప్రారంభించిన అనంతరం అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రిజర్వేషన్ల బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపించినంత మాత్రాన 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశ పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చినప్పుడే బీసీ రిజర్వేషన్లు అమలు సాధ్యమవుతుందన్నారు. రిజర్వేషన్ల అమలుకోసం కేంద్రంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తే 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే అవకాశాలు ఉంటాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

వడ్డెర సంఘం నాయకుడు ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, బీసీ నాయకుడు గుంటి రాంచందర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య మాట్లాడుతూ.. బీసీలను ఓటు బ్యాంక్‌గానే వినియోగించుకుంటున్నారే తప్ప జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాలలో న్యాయం చేయడం లేదన్నారు. జెండాలు పక్కకు పెట్టి 42 శాతం రిజర్వేషన్ల అమలుకోసం ఉద్యమాలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపి 7నెలలు గడిచిపోతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని ఆయన అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను గ్రామాల్లో తిరగ కుండా చేస్తే దిగివచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లును చేరుస్తుందని ఆయన అన్నారు. ఇంటలెక్చువల్స్ ఫోరం చీఫ్ కో-ఆర్డినేటర్ వీరస్వామి మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ పేరులో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండా బీజేపీ నాయకులు బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, జిల్లా కో-ఆర్డినేటర్ సాంబరాతి మల్లేశం, సోమ రాంమూర్తి, గండు రవి, వివిధ సంఘాల నాయకులు పంజాల వెంకట్, పులిగిల్ల యాదగిరి, డాక్టర్ జగదీశ్వర్, ఆబోతురాజు యాదవ్, సోల్తి మధు. సోల్తి సాయికుమార్, భిక్షపతి, బూస అశోక్, శివరాత్రి స్వామి, మనోహర్, గౌడ సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి చంద్రమౌళి. మద్దెల శ్రీనివాస్, సీపీఐ నాయకులు పంజాల రమేశ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. దీక్ష చేపట్టిన బీసీ నాయకులకు డాక్టర్ వీఎం.జయుడు, మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, రామ్మూర్తి, జాటోత్ బాలునాయక్, నిమ్మరసం అందించి దీక్షను విరమింప జేశారు.

# నగరంలో మెరిసిన శ్రీలీల

(5వ పేజీ తరువాయి)

చూడాలనుకుంటున్నాను...' అని హుషారుగా మాట్లాడారు. కొత్తదనం కోరుకునే షాపింగ్ ప్రియులకు సరికొత్త షాపింగ్ ప్రపంచం ఆర్.ఎస్. బ్రదర్స్ అని తెలిపారు. సంస్థ చైర్మన్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దక్షిణ భారతంలో విస్తరణలో భాగంగా వరంగల్ మహానగరంలో సరికొత్త షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కుటుంబంలోని అన్ని తరాలవారి అభిరుచులకు అనుగుణంగా వైవిధ్యభరితమైన, నాణ్యమైన ఆకర్షణీయమైన ఉమెన్స్, కిడ్స్, మెన్స్ వేర్ వస్త్రాలు అందుబాటు ధరలతో లభ్యమవుతాయని తెలిపారు.

కాగా, శ్రీలీల రాకతో ఆర్‌ఎస్ బ్రదర్స్ షాపింగ్‌మాల్‌ప్రాంతం సందడిగా మారింది. తాను నటించిన వివిధ సినిమాల ట్రెండింగ్ పాటలు డీజేలతో హోరెత్తుతుండగా... అభిమానులను అలరిస్తూ మాట్లాడారు. అభిమాని ఒకరు తాను చిత్రించిన శ్రీలీల ఫొటోను చూపగా, ఆమె వెంటనే అతడిని స్టేజిపైకి పిలిచి ఆ చిత్రాన్ని అందరికీ చూపుతూ అభినందించారు. అభిమానులు స్టెప్స్ వేయాలని కోరగా.. 'మీరు వేస్తే నేను చూస్తాను..' అని ఆమె చెప్పడంతో అభిమానులు హుషారుగా స్టెప్స్ వేశారు. ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను స్టేషన్‌రోడ్డులోని పాత సునీల్ థియేటర్ స్థలంలో ఏర్పాటు చేశారు.

# కార్మిక శాఖలో దళారుల మాయాజాలం

- కార్మికురాలు బతికుండగానే మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్
- వెలుగు చూస్తున్న విచిత్ర ఘటనలు
- నిధుల కాజేతకు యత్నం

బాలసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ నిధులు కాజేసేందుకు కొందరు దళారులు అధికారులను బురిడి కొట్టించేందుకు యత్నించిన ఘటన వెలుగు చూసింది. లేబర్ కార్డు కలిగి ఉన్న ఒక కార్మికురాలు బతికుండగానే ప్రమాదవశాత్తు చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఈ-సేవలో క్లెయిమ్ రిజిస్ట్రేషన్ అప్‌లోడ్ చేశారు. సుమారు ఆరు నెలల క్రితం లేబర్ కార్డు కలిగి ఉన్న వరంగల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రాసమల్ల రజితకు ప్రమాదవశాత్తు కాలికి గాయం కావడంతో సంక్షేమ నిధి నుంచి డబ్బుల కోసం కార్డు పట్టుకొని హనుమకొండలోని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. కార్డు నంబర్‌తో రికార్డులను పరిశీలించిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సదరు కార్మికురాలు రజిత మృతి చెందినట్లుగా క్లెయిమ్ కోసం డెత్ సర్టిఫికెట్ సమర్పించినట్లు కంప్యూటర్‌లో చూసి విస్తుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని కార్మికురాలికి సలహా ఇచ్చారు. అంత రాద్ధాంతం ఎందుకని కార్మికురాలి కుటుంబ సభ్యులు మిన్నకున్నారు.

గత మంగళవారం వరంగల్ జిల్లా కొత్తపేటకు చెందిన రాసమల్ల రజిత బతికుండగానే మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి రూ. 6 లక్షల 30 వేల నిధులు దళారులు దండుకున్నారని ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. బుధవారం సెలవురోజు కావడంతో గురువారం కార్మికురాలి కుటుంబ సభ్యులు కార్మిక శాఖ కార్యాలయానికి చేరుకొని అధికారులను నిలదీశారు. తాము అక్రమంగా నిధులు కాజేసినట్లు తమ కుటుంబాన్ని గ్రామస్థులు అనుమానిస్తున్నారని వాపోయారు. ఇంతలో అక్కడికి చేరుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు రాజేందర్, ఇతర కార్మిక నాయకులు మహ్మద్ గౌస్, అజీమొద్దీన్, భిక్షపతి ఆరా తీశారు. అందుకు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రజిత సమాధానమిస్తూ ఎవరో క్లెయిమ్ కోసం అప్‌లోడ్ చేశారని అందుకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించలేదని వివరించారు. ఈ విషయంపై తమ అధికారి, సంక్షేమ బోర్డు, బాధితురాలికి లెటర్ పెట్టినట్లు తెలిపారు.


విచారణ కోసం కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చిన కార్మిక నాయకులు

- ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు రాజేందర్ మాట్లాడుతూ.. కార్యాలయంలో దళారులు రాజ్యమేలుతున్నారని కార్మికులు కానివారికి లేబర్ కార్డులను ఇప్పిస్తున్నారని అసలైన కార్మికులు దరఖాస్తులను సమర్పించేందుకు వస్తే కొందరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు అనేక కొర్రీలను పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కార్మిక శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# లైంగిక దాడుల నివారణకు అప్రమత్తత అవసరం

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే**



సమావేశంలో మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణకు అవగాహన, అప్రమత్తత అవసరమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో గురువారం ఆన్‌లైన్‌లో చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్, చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లైంగిక వేధింపులపై సమాజానికి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు బాలల హక్కులు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని, నేటి విద్యార్థులు మొబైల్‌ఫోన్లకు అలవాటు పడి ఆన్‌లైన్ గేమ్స్, ఇతర ఆప్షన్లు డౌన్‌లోడ్ చేసుకుని అనేక సమస్యల్లో చిక్కుకుంటున్నారన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా సంక్షేమ అధికారి కె.జయంతి, పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎస్.భాస్కర్, శ్యాంసుందర్, సునిత, విశ్వజ, స్వరూప, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేయూలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని మొదటి అంతస్థుతో పాటు పరీక్షల విభాగంలో స్ట్రోర్‌రూమ్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌కట్ల రాజేందర్‌లు పాల్గొంటారని కేయూ డీవో ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి తెలిపారు.


డీఈవో వెంకట్‌రెడ్డిని అభినందిస్తున్న జీటీఏ నాయకులు

## డీఈవోకు సన్మానం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా డీఈవో బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డిని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం, టీఎస్ యూటీఎఫ్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. గురువారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీటీఏ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్, నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. రవీందర్‌రాజు, పెండెం రాజు, కార్యదర్శి మోజెస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కొలను సంతోష్‌రెడ్డి

## గుండె నిండుగా వందేమాతరం పాడాలి

- 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ర్యాలీ
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి

రాంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వందేమాతం రచించి 150 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతీ భారతీయుడు వందేమాతరం గేయాన్ని పూర్తిగా గుండె నిండుగా ఆలపించాలని హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హంటర్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 150 కేంద్రాల్లో 150 ఏళ్ల వేడుకలు జరుగుతున్నాయని, అందులో భాగంగా తెలంగాణలో ఐదు కేంద్రాల్లో కార్యక్రమం జరుగుతుండగా, వాటిలో ఉమ్మడి వరంగల్ ఒకటి అన్నారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు హనుమకొండ కాళోజీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మైనారిటీల తృప్తికోసం కాంగ్రెస్ పార్టీ గేయాన్ని సగం వరకు పాడేలా చేసిందని, నేడు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సమష్టిగా పాల్గొని ర్యాలీ అనంతరం పూర్తి గేయాన్ని ఆలపించి గౌరవించాలని కోరారు.

మాజీ అధ్యక్షుడు రాజమౌళి మాట్లాడుతూ.. వందేమాతరంలో ప్రతీ పదం మన భూమాత, గౌరవాన్ని, సంస్కృతిని, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. వందేమాతరాన్ని రచించిన మహానుభావుడు బంకిమ్‌చంద్ర చటర్జీని స్మరించుకొని గౌరవించాలన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్షుడు దొంతు దేవేందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, కూతురు రాజు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

వరంగల్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 48మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా జడ్జి ఎ.వేణుగోపాల్ ఆరుగురికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 42 మందికి రూ.47,100 జరిమానా విధించారన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 17 మందిని కోర్టులో హాజరుపరచగా రూ. 11,600 జరిమానా విధించామన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


కేయూలో నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జేఏసీ నేతలు

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని బీసీ జేఏసీ రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. గురువారం కేయూ దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని పూలే విగ్రహాల వద్ద కేంద్రం ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీల మౌన దీక్షలను చేశారు. ఈ సందర్భంగా బీసీ నేతలు చిర్రా రాజుగౌడ్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకట్‌నారాయణ, సంగాని మల్లేశ్వర్, కె.వీరాస్వామిలతో పాటు ఇతర నేతలు హాజరై మాట్లాడారు. కేంద్రం చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నాగరాజుపటేల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ తిరుణహరి శేషు, గడ్డం కృష్ణ, సతీశ్, సాధు రాజప్రశ్, నాగయ్య, ఎర్రబోజ్జ రమేశ్, తాళ్లపల్లి నరేశ్, బొట్ల మనోహర్, సుమన్, అజయ్, రాజశేకర్, శివకుమార్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశాఖ ఉద్యోగి మల్లారెడ్డికి డాక్టరేట్



వరంగల్ మెడికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గంగిడి మల్లారెడ్డికి గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేశారు. ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు సోషల్ సర్వీస్, హెల్త్ సర్వీస్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. డాక్టరేట్ పొందిన మల్లారెడ్డిని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ హిమబిందు, వైద్య ఆరోగ్య శాఖలోని మినిస్టర్ సిబ్బంది, వైద్యులు అభినందించారు.

## టీడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడిగా సిద్ధూనాయక్



వడ్డెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం గురువారం హనుమకొండలోని ప్రైవేటు హోటల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకట్‌నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భూక్య సిద్ధూనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్య రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ దేవేందర్ నాయక్, కోశాధికారిగా భూక్య శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నూనావత్ శ్రీనివాస్ నాయక్, సహాయ కార్యదర్శిగా బాదావత్ ప్రదీప్ నాయక్‌లు ఎన్నికయ్యారు.

# బీసీ ధర్మదీక్షకు అనుమతివ్వాలి

### విద్యార్థి బీసీ జేఏసీ నేతలు


రిజిస్ట్రార్ రామచంద్రానికి వినతిపత్రం ఇస్తున్న బీసీ జేఏసీ నాయకులు

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం ప్రాంగణంలో నవంబరు 10న నిర్వహించే బీసీ ధర్మదీక్షకు అనుమతి కల్పించాలని కోరుతూ గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. దీనికి రిజిస్ట్రార్ రామచంద్రం సానుకూలంగా స్పందించినట్లు విద్యార్థి బీసీ జేఏసీ నేతలు వెల్లడించారు. బీసీలకు విద్య, ఉద్యోగాలతోపాటు రాజకీయాల్లోనూ తమ జనాభా మేరకు వాటా కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ నేతలు రాజశేఖర్, అన్వేశ్, రాజేశ్, అనిల్, శ్రీహరి, వినోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ర్యాగింగ్ జరుగకుండా చర్యలు తీసుకోవాలి

కేయూ క్యాంపస్‌లో ర్యాగింగ్ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నేతలు గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. కేయూ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షురాలు పి.అనూషలు మాట్లాడుతూ.. పీజీ మొదటి ఏడాదిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ర్యాగింగ్‌కు గురికాకుండా బాయ్స్, గర్ల్స్‌హాస్టల్‌తో పాటు అన్ని విభాగాల్లో సంబంధిత అధికారులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. సీనియర్లు, జూనియర్లను పరిచయాల పేరుతో వేధింపులకు గురిచేయకుండా చూడాలని కోరారు. పరిచయాల కార్యక్రమాలు అధ్యాపకుల సమక్షంలోనే నిర్వహించాలని పేర్కొన్నారు. ర్యాంగింగ్‌పై కఠినంగా వ్యవరిస్తామని రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు గణేశ్, శ్రీజా, రాము, సాధన, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి


నినాదాలు చేస్తున్న కేయూ విద్యార్థి ఉద్యమకారులు

బాలసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేయూ విద్యార్థి ఉద్యమకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని హరిత హోటల్‌లో కేయూ మలిదశ తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమావేశం కేయూ జేఏసీ చైర్మన్ సాధు రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా విద్యార్థి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలైన ఒక్కొక్కరికి 250 గజాల స్థలం కేటాయింపు తక్షణమే అమలు చేయాలని, ఉద్యమకాలంలో తమపై మోపిన పెండింగ్ కేసులను వెంటనే ఎత్తివేయాలని, అమర వీరుల కుటుంబాలను, విద్యార్థి ఉద్యమకారులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. నాటి తెలంగాణ ఉద్యమంలో ఐదేళ్ల పాటు తమ విలువైన భవిష్యత్‌ను వదులుకొని ఉద్యమంలో పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపి రౌడీషీటర్లుగా కేసులు నమోదైన విద్యార్థి, ఉద్యమకారుల తెగువ పోరాటం మూలంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. దాని ఫలితంగానే నేడు వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాష్ట్రంలో రాజ్యాధికారాన్ని చేపట్టారని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ ఫిరోజ్ పాషా, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, డాక్టర్ బి. వీరేందర్, జమ్మికుంట మాజీ జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యలో కృత్రిమ మేధకు ప్రాధాన్యం


విద్యార్థులకు జ్ఞాపికలు ఇస్తున్న రాజశేఖర్, ప్రిన్సిపాల్ రమణ తదితరులు

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో కృత్రిమ మేధ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందని హైదరాబాద్ కామన్ కలెక్టివ్ ఆర్గనైజేషన్ కౌన్సిల్ డైరెక్టర్ పి.రాజశేఖర్ అన్నారు. గురువారం కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు 'ఏఐ బిహైండ్ ఆల్గోరిథమ్స్ అండ్ ఇన్‌టైి ఇంజనీరింగ్' అనే అంశంపై విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ హాజరై విద్యార్థులకు ఏఐ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కృత్రిమ మేధ ఇంజనీరింగ్ విద్యను ప్రభావితం చేస్తోందన్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ.. జిజ్ఞాస కల్గి, నూతన సాంకేతిక అంశాలను అన్వేషించాలని, సృజనాత్మకతతో సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఇంటర్న్‌షిష్ సెల్ కోఆర్డినేటర్ డి.ప్రియాంక, అధ్యాపకులు షరీఫ్ ఫాతిమా, ఎం.సౌజన్య, ఆర్.లక్ష్మణ్ నాయక్, రుమానా అబిదీస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్క్‌లో చెట్లను కూల్చడం అవాస్తవం

**రెవెన్యూ కాలనీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వివరణ**

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రెవెన్యూ కాలనీలోని పార్క్ కబ్జా, పార్కులోని చెట్ల నరికివేత, కమ్యూనిటీ హాల్ ఆక్రమణ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సొసైటీ బాధ్యులు అని కార్పొరేషన్ అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేసినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ అండ్ అదర్ డిపార్టుమెంటల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కె. మురళీ మోహన్‌రావు తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీవాసుల, భక్తుల ఆర్థికసాయంతో ఎటువంటి ఫిర్యాదు లేకుండా రోజువారి పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. దేవాలయ వ్యవహారాలను పారదర్శకంగా, ఎటువంటి అవినీతికి అవకాశం లేకుండా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్కు కమ్యూనిటీ హాల్‌కు నిర్మించిన 150 అడుగుల కాంపౌండ్ వాల్‌ను కూలగొట్టినట్టు, ఏపుగా పెరిగిన చెట్లను నరికివేయించారనడంలో కూడా వాస్తవం లేదని పేర్కొన్నారు.కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రభుత్వ సహాయం పొందలేదని, ఆ నిర్మాణానికి కమ్యూనిటీ హాల్ అని బోర్డు ఎప్పుడూ పెట్టలేదని, కనుక బోర్డు తొలగించే అవసరం కాలనీవాసులకు లేదని వివరణ ఇచ్చారు.

## కేయూ ఉద్యోగులకు శిక్షణ

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నేతృత్వంలో కేయూలోని నలుగురు బోధనేతర ఉద్యోగులకు నెలపాటు వృత్యంతర శిక్షణ ఇచ్చారు. శిక్షణలో వర్సిటీ బోధనేతర ఉద్యోగులు ఎం.రాజేశ్, డి.ప్రవీణ్‌కుమార్, కె.రజనీ, కె.ప్రవక్షిత్‌కుమార్‌లు పాల్గొన్నారు. వీరికి 30 రోజులపాటు కండక్టు రూల్స్, లీవ్, ఆఫీస్ విధివిధానాలు, ఆర్‌ఐటీతోపాటు ఇతర అంశాలపై అవగాహన శిక్షణ ఇచ్చారు. శిక్షణ ధ్రువపత్రాలను గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు అందచేసి అభినందించారు.

## జోహ్రాన్ గెలుపుపై సంబరాలు

వడ్డెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): న్యూయార్క్ నగర మేయర్‌గా జోహ్రాన్ మమ్దాని గెలుపుతో ప్రపంచ అభ్యుదయ, ప్రగతిశీల శక్తులకు నైతిక బలం చేకూరిందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జోహ్రాన్ మమ్దాని గెలుపు పురస్కరించుకొని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలను నిర్వహించుకొని ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జోహ్రాన్ మమ్దాని గెలువకుండా రిపబ్లికన్ పార్టీ, ట్రంప్ సర్వశక్తులు ఒడ్డారని అన్నారు. జోహ్రాన్ మమ్దాని గెలిస్తే నిధులు కూడా ఇవ్వబోమని ట్రంప్ హెచ్చరించారని పేర్కొన్నారు. ట్రంప్ మాటలను లెక్కచేయకుండా న్యూయార్క్ ప్రజలు జోహ్రాన్‌మమ్దాని గెలిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, తేలూరి ఉప్పలయ్య, రాగుల రమేష్, గొడుగు వెంకట్, వాంకుడోత్ వీరన్న, కాడపోయిన లింగయ్య, తిరుపతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## 'ధర్నాను జయప్రదం చేయాలి'

న్యూశాయంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఈ నెల 13న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ధర్మేంద్ర పిలుపునిచ్చారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మేంద్ర మాట్లాడారు. 13న నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె. దేవరాజ్, గఫార్, దామోదర్, ఇంద్రసేనారెడ్డి, సభ్యులు బత్తిని సారయ్య, అశోక్‌కుమార్, వెంకటయ్య, రవీందర్ పాల్గొన్నారు.

## వివాదాస్పదంగా టీఎస్ఆర్‌డీసీ స్థలం

**2.07 ఎకరాల భూమి మాయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

హసన్‌పర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టు గుట్ట క్రాస్‌రోడ్డులోని తెలంగాణ బాలికల గురుకుల డిగ్రీ కళాశాల కోసం ప్రభుత్వం హసన్‌పర్తి రెవెన్యూ శివారు 127/3లో 2.07 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. అదే భూమిలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు గురువారం బోరు వేస్తుండడంతో తెలంగాణ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకే సర్వే నెంబరు గల భూమిలో ఇటు డిగ్రీ కళాశాలతో పాటు పలువురికి స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు టీఎస్ఆర్‌డీసీకి కేటాయించిన సర్వే మ్యాపుతో పాటు ప్రైవేటు వ్యక్తులకు అసైన్డ్ చేసిన భూములపై సమగ్ర విచారణ జరిపి సత్వరమే డిగ్రీ కళాశాల స్థలాన్ని కాపాడాలని ప్రిన్సిపాల్ ఇందుమతి కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసిన వారిలో అధ్యాపక సిబ్బంది రాజకుమారి, తులసి, కమిటీ ప్రతినిధులున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫాతిమా కాంప్లెక్స్, ఫాతిమానగర్ దర్గా, రామాలయం ఏరియా, అఫ్జల్‌నగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

## కేయూలో కనీస సౌకర్యాలు కల్పించాలి


పరిపాలన భవనం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతృత్వంలో విద్యార్థులు పరిపాలన భవనం ఎదుట బైఠాయించి నిరసన ఆందోళనకు దిగారు. వర్సిటీ ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. వర్సిటీ క్యాంపస్ హాస్టల్స్ కామన్ మెస్‌లో మౌలిక సదుపాయాలను పరిష్కరించాలని అన్నారు. న్యూ పీజీ హాస్టల్స్ జేడీలు వృథా ఖర్చులు పెడుతున్నారని, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షకార్యదర్శులు చెన్నూరు సాయికుమార్, భీరెడ్డి జస్వంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.వంశీకృష్ణ, విద్యార్థి సంఘాల నాయకులు రాహుల్, సూరజ్, మల్లేశ్, సందీప్, సాయి, పవన్‌కుమార్, ప్రవళిక, అనూష, రాధిక, మానస, నితీషా తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఓబీసీ ఉద్యోగుల సంఘం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కాజీపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఉద్యోగులు, కార్మిక సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. లోకో రన్నింగ్ బ్రాంచ్ అధ్యక్షుడిగా తోట రమేశ్, బ్రాంచ్ కార్యదర్శిగా ఎం.వెంకటరాజన్, బ్రాంచ్ ఫైనాన్స్ సెక్రటరీగా కె.రాజేందర్, 13 మంది కార్యవర్గ సభ్యులు, 9 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి రేండ్ల రమేశ్, కంచు రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకో పైలెట్లు జి.కుమారస్వామి, వై.సుదర్శన్, జి.రమణమూర్తి, కె.సతీష్ కుమార్, ఎండి.రజాక్, ప్రవీణ్ కుమార్, టి.కిశోర్, సందీప్, శ్రీజ కుమార్, జే.నాగరాజు, ఎన్.శ్రీనివాస్, నీరజ్ కుమార్, ఏ.మహేశ్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### కేయూ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి


కేయూ మైదానంలో వాకర్స్‌కు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని కేయూ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ మైదానంలో లెజెండ్రీ వాకర్స్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగినకొద్ది సైబర్‌నేరాలు ఎక్కువయ్యాయని, ప్రధానంగా సైబర్ నేరస్థుల వలలో చదువుకున్న వారే పడిపోతున్నారన్నారు. ఇటీవల కాలంలో అపరిచిత వ్యక్తులు వాట్సాప్ గ్రూపులకు ఏపీకే ఫైల్స్ పంపుతున్నారని, అలాంటి ఫైల్స్ ఓపెన్ చేస్తే ఫోన్ హ్యాక్ చేయబడి బ్యాంకులో ఉన్న డబ్బులు మొత్తంగా తస్కరించబడుతుందని అన్నారు. ఇంకా కుటుంబ సమాచారాన్ని ఎప్పుడూ ఫేస్‌బుక్, వాట్సాప్‌లో పెట్టడం వల్ల ఫొటోలు మార్ఫింగ్ చేసి డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేసే ముఠాలు ఉన్నాయన్నారు. ఈ చలాన్స్, ఉద్యోగ, వ్యాపార మోసాలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లెజెండ్రీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, ప్రధాన కార్యదర్శి తుపాకుల రవి, ఉపాధ్యక్షులు నాచు సుధాకర్, పస్తం అనిల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అర్షం సదానందం, ఆర్డీవో డీఎస్ వెంకన్న, సభ్యులు మనోహర్, ఎల్లస్వామి, యాదగిరి, సంగాల జయాకర్, డాక్టర్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

## షరతులు ఉపసంహరించుకోవాలి

న్యూశాయంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన పత్తి పంట కొనుగోలు చేయడానికి సీసీఐ పెట్టిన పరిమితిని వెంటనే ఎత్తివేయాలని భారతీయ ఖేల్ మజ్దూర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎదునూరి వెంకట్రాజం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం మునిగాల భిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రాజం మాట్లాడారు. వ్యాపారులకు మేలు చేసి రైతులకు అన్యాయం చేసే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు కొట్టెపాక రవి, అల్వాల రాజు, దొమ్మాటి ప్రవీణ్, మాదాసి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రాజం

ఆలయ దర్శనం

# నంది లేని శివాలయం



ప్రమథ గణాలలో అత్యంత ముఖ్యుడు, పరమేశ్వరునికి ఎంతో విధేయుడు నంది. అందుకే శివుని వాహనంగా నందీశ్వరుడు ప్రతి శివాలయంలో... గర్భాలయం బయట ఉంటాడు. కానీ నంది లేని అరుదైన క్షేత్రం... ఆంధ్రప్రదేశ్‌లోని అంబాజీపేట మండలం నందంపూడిలో ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వర ఆలయం.

## సంతాన పార్వతి

స్థలపురాణం, క్షేత్ర విశేషాల ప్రకారం... ఈ ఆలయంలోని లింగాన్ని త్రేతాయుగంలో పరశురాముడు ప్రతిష్ఠించాడు. క్రీస్తుశకం పదకొండో శతాబ్దంలో అప్పటి పాలకులు ఆ ప్రాంతంలో ఒక ఆలయాన్ని నిర్మించారు. అందులో రామలింగేశ్వర స్వామి మాత్రమే కొలువై ఉండేవాడు.



బ్రహ్మచారి అయిన పరశురాముడు... రామలింగేశ్వరుణ్ణి మాత్రమే ప్రతిష్ఠించడంతో... నందంపూడి గ్రామంలోని దంపతులెవరికీ ఆ రోజుల్లో సంతానం కలిగేది కాదట. బంధువులు, స్నేహితుల పిల్లలను దత్తత తీసుకొనేవారట. ఈ నేపథ్యంలో ఆ గ్రామ జమీందారు వడ్లమాని కామేశ్వర రావు పూర్వీకుల ఇంటికి ఒక స్వామీజీ వచ్చారు. ఆయనకు గ్రామస్తులు తమ సంతానలేమి సమస్యను వివరించగా... ఆయన దివ్యదృష్టితో పరిస్థితిని తెలుసుకొని... పార్వతీ దేవిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి గ్రామ ప్రజలకు సంతాన భాగ్యం కలుగుతోందని, ఇక్కడి అమ్మవారు 'సంతాన పార్వతి'గా ప్రఖ్యాతి పొందారని, ఈ సంగతి తెలుసుకున్న ఇతర ప్రాంతాల వారు కూడా అమ్మవారిని దర్శించుకొని సంతానవంతులయ్యారని ఆలయ అర్చకుడు యలమంచలి సుబ్రహ్మణ్య శర్మ వివరించారు.

## నందీశ్వరుడి కోరిక

నందంపూడి గ్రామాన్ని రాజరాజనరేంద్రుడు... నన్నయభట్టుకు అగ్రహారంగా దానం చేసినట్టు ప్రతీతి. ఆలయంలోని రాతి శాసనం మీద ఈ ఊరి పేరు 'ఆనందపురి'గా నమోదై ఉంది. కాలక్రమేణా నందంపూడిగా మారింది. ఇక్కడి శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామికి మరెన్నో విశిష్టతలు ఉన్నాయి. ఇక్కడ శివుడు పశ్చిమాభిముఖంగా ఉంటాడు. గర్భాలయంలో పానవట్టం ఉండదు. అమ్మవారు గర్భాలయంలో ఉండరు. అంతరాలయంలో... ఉత్తరాభిముఖంగా కొలువుతీరి ఉంటారు. సాధారణంగా ప్రతి ఆలయంలో.. అక్కడ కొలువైన దేవుడి వాహనం ఉంటుంది. పరమేశ్వరుడి వాహనమైన నంది... విగ్రహ రూపంలో, శివుడికి అభిముఖంగా అంతరాలయంలో లేదా ముఖమండపంలో ఉంటుంది. ఆ ఆలయాలలోని దేవుణ్ణి దర్శించుకోవడానికి భక్తులు వెళ్ళినప్పుడు... వాహనం అనుమతి తీసుకోవడం ఆనవాయితీ. అయితే తన అనుమతి అవసరం లేకుండా భక్తులకు నేరుగా దర్శనం ఇవ్వాలని నందీశ్వరుడు కోరాడట. అందుకే ఈ ఆలయంలో నంది ఉండదు. ఈ ఆలయంలో శివుణ్ణి దర్శించుకొని, భక్తిశ్రద్ధలతో సేవిస్తే... అనంతమైన ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

• సి.ఎన్.మూర్తి, 8328143489

---

కాళిదాస మహాకవి తన 'రఘువంశ' కావ్యంలో పార్వతీ పరమేశ్వరులను 'మాట-అర్థం'తో పోల్చాడు. (వాగర్థా వి సంపృక్తౌ... పార్వతీ పరమేశ్వరౌ). ఏదో కొంత భావాన్ని మనసులో పెట్టుకొని... ఆ అర్థం వచ్చేలా మాటను మాట్లాడుతాం. ఏదైనా ఒక మాట మాట్లాడామంటే... దానికి ఒక అర్థం రానే వస్తుంది. అర్థం లేని మాట ఉండదు. మాట లేకుండా అర్థం పుట్టదు. అలా 'వాక్-అర్థం' అనే విడదీయరాని, విడదీయలేని జంటగా పార్వతీ పరమేశ్వరులు ఉంటారని ఆ శ్లోకం అర్థం. ఇంతకుమించి వారి అన్యోన్యతను చెప్పగల మరొక పోలిక ఉందా, ఉంటుందా? ఇది నిజం అనడానికి... ఆ ఇద్దరిలోనూ భౌతికంగా కనిపించే 'అర్ధ+నారీ+ఈశ్వర' రూపం మరొక తిరుగులేని సాక్ష్యం.



# వాగర్థాలు... అన్యోన్యతా చిహ్నాలు

## ఒకే మాట...

సృష్టిని నిర్వహించే బ్రహ్మ... తన భార్య సరస్వతికి కేవలం తన ముఖం (నోరు) భాగాన్నే ఇచ్చాడు. స్థితి (రక్షణ) బాధ్యతను చేపట్టిన శ్రీహరి... తన భార్యకు తన వక్షస్థలాన్ని ఇచ్చాడు. ఏ వ్యక్తి శరీరంలోనైనా ఉండే ప్రధాన అవయవాల సంఖ్య 42 కాగా... వాటిలో ఒక్కొక్కటి చొప్పున బ్రహ్మ, విష్ణువు తమ భార్యలకు ఇస్తే... శంకరుడు మాత్రమే 21 భాగాలను.. అంటే తన శరీరంలో తన అర్ధ భాగాన్ని భార్యకు ఇచ్చాడు. ఇక్కడ మరొక విశేషం కూడా ఉంది. బ్రహ్మ భార్య అయిన సరస్వతి... ఆయన మీద తాత్కాలికంగా అలిగి, ఒక నదిగా మారి, ప్రవహించడానికి వెళ్ళిపోయింది. అదే తీరుగా... శ్రీహరి భార్య అయిన లక్ష్మీదేవి కూడా... తాత్కాలికంగా అలిగి, తన తల్లిదండ్రులతో కలిసి సుఖంగా ఉండిపోవడానికి... తన పుట్టిల్లయిన కొల్హాపురానికి వెళ్ళిపోయింది. ఈ రెండు సంఘటనల్లోనూ తత్త్వపరమైన అర్థాలు, సాంకేతిక రహస్యాలు ఉన్నాయనేది వేరే విషయం. అభిప్రాయ భేదాలు రావడానికి కారణం ఒకరు చెప్పినదాన్ని మరొకరు వినకపోవడమే కదా! కానీ శివ పార్వతుల విషయంలో మరొక మాటంటూ లేదు, ఉండదు. పాల సముద్రాన్ని చిలికే వేళ... చెప్పలేనంత వేడిమితో, విషపు వాసనతో గొప్ప ధూమం బయటకు రాసాగింది. శ్రీహరితో సహా అందరూ వెళ్ళిపోతూ ఉంటే... 'మ్రింగుమనె సర్వమంగళ... మంగళసూత్రంబునెంత మది నమ్మినదో'... అలా చోద్యం చూడడమేమిటి? ఈ లోకాలన్నిటినీ భస్మం చెయ్యగల శక్తితో వస్తున్న ఆ విషాగ్నిని మింగాలని శివుణ్ణి ఆజ్ఞాపించింది. అంతే... ఆమె చెప్పడం, ఆయన ముందూ వెనుకా చూడకుండా ఆ విషాన్ని స్వీకరించడం జరిగిపోయింది.

> **పార్వతీ పరమేశ్వరులు ప్రకటించిన సత్యం ఒక్కటే! నిజమైన ఆభరణం అంటే విలువైన బంగారు హారాలు, వడ్డాణాలు... ఇవికావు. స్త్రీకి ఆభరణం భర్త. భర్తకు ఆభరణం భార్య అని. ఆ అన్యోన్యతే లేనప్పుడు... ఆభరణాలు బంగారానివే అయినా అవి విలువలేనివి. శరీరానికి బరువు పెంచే రాళ్ళతో సమానం.**

## దాంపత్యం అంటే...

అలాగే మరొక సంఘటన. పార్వతి... సతీదేవిగా ఉన్న కాలంలో.. ఆమెను, అల్లుడైన శివుణ్ణి పిలువకుండానే దక్షుడు యాగాన్ని ప్రారంభించాడు. మొదట్లో సతీదేవి కూడా వెళ్ళకూడదని అనుకుంది. కానీ ఆకాశంలో ప్రయాణిస్తున్న అందరి విమానాలు తన పుట్టింటివైపు వెళ్తూ ఉంటే... తనకూ వెళ్ళాలని అనిపిస్తోందని శంకరుడికి చెప్పింది. "వెళ్ళాలని ఉంది గనుక నువ్వు వెళ్ళు. పిలుపు లేకుండా నేను రాకూడదు. ఇది అర్థం చేసుకో. అయితే అక్కడ నీ మనసుకు బాధ కలిగే సంఘటన ఏదైనా జరిగినా, జరగబోతోందని అనిపించినా... నన్ను మనసులో తలచుకో" అని చెప్పాడు. అనుకున్నట్టుగానే ఆమె వెళ్ళింది. తండ్రి ఇంటి ప్రధాన ద్వారం దగ్గర నిలబడింది. ఆమెను చూసిన ఋత్విక్కులు, సోదరులు, ఇతర ముఖ్యులు 'ఏం జరుగుతుందో' అనే భయంతో ముఖం తిప్పుకున్నారు. దక్షుడు కూడా ఆమెను చూసి పక్కకు వెళ్ళిపోయాడు. అప్పుడు ఆమె తీవ్ర మనోవేదనతో శివుణ్ణి స్మరించుకున్న తక్షణమే ఆయన వీరభద్రుణ్ణి పంపాడు. వీరభద్రుడు యాగాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, దక్షుడి తలను తెంచి, యాగాగ్నిలో పడేసి, తల పూర్తిగా దగ్ధమయ్యేదాకా ఉండి, తిరిగి వచ్చేశాడు. సాధారణంగా లోకంలో ఇలాంటి సందర్భం ఎక్కడైనా ఎదురైతే ఏ భర్త అయినా "వద్దంటే వెళ్తున్నావుగా! జరగరానిది ఏది జరిగినా అనుభవించు" అనే అంటాడు. దాంపత్యం అంటే... శివ పార్వతుల మాదిరిగా అన్యోన్యత కలిగి ఉండడమే!

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

---

సందేశం

# గుర్తుంచుకోవాల్సిన సత్యం

ధనవంతులమనే అహంకారం కలిగినవారికి, వస్తు ప్రపంచానికి మాత్రమే ప్రాధాన్యాన్ని ఇచ్చి, దైవాన్ని నిర్లక్ష్యం చేసేవారికి గుణపాఠం తప్పదని దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్ స్పష్టం చేస్తోంది. ఎన్నో ఘన విజయాలను సాధించిన అలెగ్జాండర్ అంతిమ ఘడియల్లో తన సేనానులను పిలిచి... "నా చేతులు బయటకు కనిపించేలా నా అంతిమ యాత్రను నిర్వహించండి. ఎందుకంటే అలెగ్జాండర్ చక్రవర్తి ఈ లోకం నుంచి ఉత్త చేతులతో వెళుతున్నాడు. తనతో పాటు ఏదీ తీసుకు వెళ్ళడం లేదని లోకానికి తెలియాలి" అని చెప్పాడు. మానవులలో ప్రతి ఒక్కరి పరిస్థితీ ఇంతే.

అందుకే "నీరు చేరినప్పుడు ఇనుము తుప్పుపట్టినట్టు... (దేవుడి మార్గాన్ని తప్పిన) హృదయాలకు కూడా తుప్పు పడుతుంది. దాన్ని వదిలించుకోవడం కోసం... మృత్యువును సదా గుర్తు చేసుకుంటూ ఉండండి" అని మహా ప్రవక్త మహమ్మద్ సూచించారు. మనిషి వాస్తవాల నుంచి తప్పించుకొని తిరగగలడు. కానీ అలా తప్పించుకోవడం వల్ల కలిగే పరిణామాల నుంచి తప్పించుకోలేడు. గడిచే ప్రతి క్షణం మనల్ని మృత్యువుకు మరింత దగ్గరగా తీసుకుపోతోంది. కాబట్టి పుట్టిన రోజులను వేడుక చేసుకోవడమే కాదు... మృత్యువును కూడా గుర్తు చేసుకోవాలి. ఊరేగింపుగా జరిగే అంతిమ యాత్రల్లోని అంతరార్థం... 'ఎప్పుడో ఒక రోజు నా గతీ ఇంతే' అని తెలుసుకోవడానికే. "చివరకు మీరందరూ అల్లాహ్ వద్దకు మరలిపోవాల్సిందే" అని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తోంది.



ఈ సత్యాన్ని మనుషులు మరచిపోవడం వల్లే మానవత్వాన్ని వదులుకుంటున్నారు. విలువల పట్ల విశ్వాసం కోల్పోతున్నారు. ధర్మాన్ని నిర్దేశించిన దైవాన్ని విస్మరిస్తున్నారు. స్వార్థాన్ని పెంచి పోషిస్తున్నారు. బలహీనులను హింసిస్తున్నారు, దోచుకుంటున్నారు. ఒకరికన్నా మరొకరు ఎక్కువ సంపద కూడబెట్టుకోవాలనే పోటీలో పరుగులు పెడుతున్నారు. అలాంటి వారిని ఉద్దేశిస్తూ "మీ హృదయాలు బండరాళ్ళకన్నా కఠినమైపోయాయి. మీ కార్యకలాపాలపట్ల అల్లాహ్ అజాగ్రత్తగా ఉంటాడని అనుకోవద్దు" అని అని ఖుర్‌ఆన్ స్పష్టం చేసింది. మృత్యువును ఎంత తిరస్కరించాలనుకున్నా ప్రతి ఒక్కరికీ అది రాకమానదు. అలాగే దేవుడి శక్తిని, ధర్మాన్ని నిర్లక్ష్యం చేసేవారు... దానివల్ల కలిగే పరిణామాలను అనుభవించక తప్పదు. ఈ సత్యాన్ని గుర్తుంచుకొని మానవతతో, దైవ చింతనతో మెలిగే వారికే అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది.


• మహమ్మద్ వహీదుద్దీన్

---

యోగం

భారతీయ యోగ, తంత్ర సంప్రదాయాలు మానవ జీవితంలోని పరమార్థాన్ని అన్వేషించే లోతైన మార్గాలను సూచిస్తాయి. వీటిలో ప్రాణాయామం, ముద్రలు, బంధాలు, ధ్యానం, కుండలినీ శక్తిని మేలుకొలపడం లాంటి ప్రక్రియలు.. కేవలం శారీరక ఆరోగ్యానికే కాదు, పరమాత్మ సాక్షాత్కారం కోసం కూడా రూపుదిద్దుకున్నాయి.

# ద్వాదశాంతం... చైతన్య వికాసం



ఆధునిక జీవితం వేగం, ఒత్తిడి, మానసికమైన కలతలతో నిండిపోయింది. మనిషి జీవనశైలి వేగంగా మారిపోతోంది. ఒత్తిడి, పనిభారం, కుటుంబ సమస్యలు, భవిష్యత్ భయం, అస్థిర సంబంధాలు, భద్రతా లోపం, 'నేను' అనే పరిమితి... ఇవన్నీ కలిసి డిప్రెషన్‌కు, అసహనానికి, శారీరక వ్యాధులకు దారి తీస్తున్నాయి. సోషల్ మీడియా, వార్తలు లాంటివి మెదడులో అనవసరమైన కల్లోలాన్ని సృష్టిస్తున్నాయి దీనివల్ల అశాంతి, ఆందోళన పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక సమతుల్యతను కోల్పోవడం సహజం. ఈ సమయంలో ధ్యానం అనేది మానవుని ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక వికాసానికి, మానసిక ప్రశాంతతకు ఒక శక్తిమంతమైన పరిష్కారం. ధ్యానం క్రమంగా క్రియ నుంచి స్థితిగా మారుతుంది. అనంతంతో ఏకమయ్యే స్థితికి తీసుకువెళుతుంది. యోగ, తంత్ర సంప్రదాయాల్లో ధ్యానాన్ని కేవలం మనిషి మానసిక ఒత్తిడిని, శారీరక అలసటను తగ్గించి, లోతైన విశ్రాంతిని ప్రసాదించే సాధనంగా కాకుండా. చైతన్య వికాసంగా చూశారు. పూర్వకాలంలో ఋషులు 'ఓం'కారాన్ని కానీ, 'సోహం' మంత్రాన్ని కాని అంతర్గతంగా జపించేవారు. ఆ మంత్రజపం కొన్ని రోజులకు, నెలలకు శ్వాసతో అనుసంధానమై, జపంకాని జపంగా మారి... సమాధి స్థితికి తీసుకువెళ్ళేది. సమాధిస్థితికి చేరుకున్న సాధకుడు 'ద్వాదశాంతం'లో లయమవుతాడు. 'ద్వాదశాతం' అనేది శూన్య బిందు ధ్యాన కేంద్రం. అది మానవ చైతన్యం నుంచి దైవ చైతన్యానికి దారి చూపే ద్వారం. ప్రాణం, మనస్సు, నాదం, బిందువులం లయమయ్యే స్థానం.

## ఎన్నో సంప్రదాయాల్లో, గ్రంథాల్లో...

శైవ, తాంత్రిక, నాథ సంప్రదాయాల ప్రకారం... 'ద్వాదశాంతం' అంటే నాసికాగ్రం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో ఉన్న శూన్యస్థలం. కొందరు సిద్ధ గురువులు "ద్వాదశాంతం అనేది సహస్రారం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో ఉన్న శివశక్తుల లయస్థానం" అని సూచించారు. 'ద్వాదశ' అంటే పన్నెండు, 'అంతం' అంటే అంతిమ స్థానం. "ద్వాదశాంతం... అమృతధార ఉద్భవించే స్థానం" అని పేర్కొంది సిద్ధ సంప్రదాయం. ఉపనిషత్తులలో కూడా ద్వాదశాంతం ప్రస్తావన ఉంది. యోగి నాసికాగ్రం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో చిత్తాన్ని నిలిపినప్పుడు... అక్కడ ప్రాణం... అంటే కుండలినీశక్తి లయమై, అమృతరసం ఉద్భవిస్తుందని 'అమృత నాదోపనిషత్తు' చెబుతోంది. "నాసికాగ్రం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో శూన్య బిందువు ప్రకాశిస్తుంది. అది శివశక్తి స్థానం. అంతేకాదు, శూన్య, నాద బిందువులకు కేంద్ర స్థానం" అంటోంది 'ధ్యానబిందూపనిషత్'. "ద్వాదశాంతం... ప్రాణం, మనస్సుల లయక్షేత్రం" అని పేర్కొంది 'యోగవాశిష్ఠం'. "నాసాగ్ర దృష్టి, బ్రహ్మరంధ్రం, ద్వాదశాంత ధారణలు... ప్రాణసమాధి సాధనతో అనుసంధానమై ఉంటాయి" అని స్వాత్మారామ యోగి తన 'హఠయోగ ప్రదీపిక'లో చెప్పారు. తంత్రాగమ గ్రంథాల విషయానికి వస్తే... ద్వాదశాంతం అనేది శూన్యస్థానం అనీ, అది శివశక్తుల లయక్షేత్రం అనీ 'మాలినీ విజయోత్తర తంత్రం' వివరించింది. "మంత్రోపాసనలో మంత్ర జపం అక్షర లక్షలు అయినప్పుడు... మంత్రం శ్వాసతో అనుసంధానమై, కుండలినీశక్తి మేల్కొని ద్వాదశాంతం వైపు పయనిస్తుంది. ద్వాదశాంతం అనేది శక్తి లయ బిందువు. నాదకుడు నాద, బిందు, శూన్య స్థితుల ద్వారా ఈ స్థితిలోకి ప్రవేశిస్తాడు. సహస్రారానికి పైన... పన్నెండు అంగుళాల దూరంలో ఉన్న శూన్యాన్ని దీర్ఘకాలంగా ధ్యానిస్తూ, ప్రణవాన్ని పరిపూర్ణంగా ఉచ్చరించేవారికి ఇంద్రియాతీతమైన శక్తి లభిస్తుంది" అని అభినవగుప్తుడి 'లోకతంత్రం' గ్రంథం చెబుతోంది. అలాగే కాశ్మీరీ శైవతంత్రం, స్కంద కారికలు, పరాత్రిశికా గ్రంథాలు, వసుగుప్తుడు రాసిన శివసూత్రాలు, సిద్ధ గురువు బోగర్ రాసిన 'బోగర్ 7000', తిరుమూలర్ రాసిన 'తిరుమంతిరం' లాంటి అనేక గ్రంథాలు ద్వాదశాంతం గురించి ఎన్నో అంశాలను వివరించాయి. బౌద్ధంలో దీన్ని 'శూన్య ధ్యానం'గా, సూఫీ మతంలో 'నూర్ అనుభవం'గా, క్రైస్తవ సంప్రదాయంలో 'దివ్యకాంతి దర్శనం'గా పేర్కొన్నారు.

• యోగి భరద్వాజ బొడ్డు

---

# అక్రమాలపై తిరుగుబాటు

దైవమార్గం



ఏసు క్రీస్తులో స్పష్టంగా కనిపించే రెండు కోణాలు ఉన్నాయి. వాటిలో ఒకటి... ఆయనలో ఉన్న దైవికమైన స్వభావం. రెండోది.. స్వచ్ఛమైన మానవ స్వభావం. సముద్రం అలజడిని, కల్లోలాలను ఆపినప్పుడు, నీటిని ద్రాక్షరసంగా మార్చినప్పుడు మొదటి స్వభావం కనిపిస్తుంది. ఆయన పడిన బాధల్లో, మరణ యాతనలో మానవ స్వభావం దర్శనమిస్తుంది. ఆయన బోధలు కూడా మానవ స్వభావానికి అనుగుణంగా సాగాయి. మనిషి పరిపూర్ణంగా ఎలా జీవించాలో ఆయన నేర్పాడు. మామూలు మనిషిని మహోన్నత స్థాయికి తీసుకుపోవడం కోసం బోధలు చేశాడు. వాటిని స్వయంగా ఆచరించాడు.

ఏసు క్రీస్తు మీద ఆ రోజుల్లో 'తిరుగుబాటుదారు' అనే ముద్ర ఉంది. దీనికి కారణం ఏమిటంటే... నాటి రాచరిక వ్యవస్థ సామాన్య ప్రజల అజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని పాలన సాగించేది. ఏసు ఉంటే తాము బోధించే మూఢాచారాలకు భంగం వాటిల్లుతుందని, తమ భావాలు చెల్లవనీ భయపడేది యూదా మత వ్యవస్థ భావించింది. ఈ రెండు వ్యవస్థలూ కలిసి ఆయనను ఒక ద్రోహిగా చిత్రీకరించాయి. దానికితోడు "నేను ఈ లోకంతో సమాధానపడి రాజీ కుదుర్చుకోవడానికి రాలేదు, నిప్పు రగిలించడానికి వచ్చాను" అని ఏసు చేసిన ప్రకటనతో ఈ వ్యతిరేకత మరింత బలపడింది. కానీ స్వార్థపరులైన, సంకుచిత మనస్తత్వం కలిగిన ప్రత్యర్థులతో తాను రాజీ పడేది లేదని, ప్రజల్లో చైతన్యాన్ని రగిలించడానికి వచ్చాననీ ఆయన భావం. అన్యాయాన్ని చూస్తూ ప్రశాంతంగా ఉండడం కాదనీ, దాన్ని ఖండించాలని, శాశ్వత నిద్రలోకి జారుకున్న సమాధుల్లా ఉండవద్దని ఉద్బోధించాడు. లోకం తీరు తెలిసినవాడు కనుకనే... సత్యాన్ని బోధించడం కోసం తన శిష్యులను సంఘంలోకి పంపినప్పుడు "జాగ్రత్త! తోడేళ్ళ మధ్యకు గొర్రె పిల్లలను పంపినట్టు మిమ్మల్ని పంపుతున్నాను" అని చెప్పాడు. ఆయన మొదటిసారిగా ఒక ప్రార్థనా మందిరంలోకి అడుగు పెట్టినప్పుడు... అక్కడ అక్రమాలు సాగిస్తున్న వ్యాపారులను తరిమి కొట్టి, తన తిరుగుబాటును ప్రకటించాడు. అప్పటి నుంచి మూఢనమ్మకాలను, స్వార్థ శక్తులను ఎదిరించడమే ధ్యేయంగా ఆయన ప్రయాణం కొనసాగింది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

---

తెలుసుకుందాం

అర్చాస్వరూపుడైన భగవంతుని విగ్రహ రూపాన్ని మూడు విధాలుగా అభివర్ణిస్తారు. అవి... రూపం, అరూపం, రూపారూపం. వీటినే శిల్ప, ఆగమ గ్రంథాలు... 'వ్యక్తం, అవ్యక్తం, వ్యక్తావ్యక్తం' అనీ, 'సకళం, నిష్కళం, సకళనిష్కళం' అని పేర్కొంటున్నాయి. పదాలు వేరైనా భావం ఒక్కటే. స్పష్టంగా కనిపించేది రూపం. అస్పష్టంగా కనిపించేది అరూపం. స్పష్టాస్పష్టంగా కనిపించేది (కనిపించీ కనిపించనిది) రూపారూపం.

# భగవంతుని రూపాలు

## రూపం/ వ్యక్తం/ సకళం:



'సకళం' అంటే రూపంతో కూడినది. అంటే తాళమాన (దైవికమైన కొలతల) ప్రమాణాలను అనుసరించి, శిల్ప, ఆగమ నియమాలకు అనుగుణంగా... తల, శరీరం, కాళ్ళు, చేతులు, సకల ఆభరణాలు, ఆయుధాలు, వస్త్రాలంకరణతో కూడిన ప్రతిమలను 'సకళములు' అనీ, 'వ్యక్తములు' అనీ పిలుస్తారు. సామాన్య భక్తులు కూడా ఈ విగ్రహరూపంలోని భగవంతుణ్ణి దర్శించగలరు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు తదితర విష్ణురూపాలు, చంద్రశేఖర మూర్తి, ఆనందతాండవమూర్తి లాంటి శివరూపాలు, ఇంకా వివిధ దేవతా ప్రతిమలు దీనికి ఉదాహరణలు.

## అరూపం/ అవ్యక్తం/ నిష్కళం:



'నిష్కళం' అంటే రూపరహితం. కానీ ఇది అఖండమైన చైతన్య స్వరూపం. ప్రత్యేకించి ఎటువంటి లక్షణాలు, అంగ విన్యాసం, ఆభరణ విన్యాసం, ఆయుధ విన్యాసం భౌతికమైన కళ్ళకు కనిపించకపోయినా... అఖండమైన భగవత్ శక్తిని తమలో నింపుకొని, ఆశ్రయించిన భక్తులను అనుగ్రహించే స్వరూపాలను 'అరూప బింబాలు' అనీ, 'అవ్యక్త బింబాలు' అనీ పిలుస్తారు. ఈ నిష్కళ రూపాలలోని భగవంతుణ్ణి యోగులు, సిద్ధులు, తపస్సంపన్నులు, ఆచార్యులు మాత్రమే గమనించి, ఈ లోకానికి ప్రకటించగలరు. సామాన్యులకు నేరుగా అంతుపట్టనిది ఈ అరూప బింబం. శివలింగం, నర్మదానదిలో సహజసిద్ధంగా దొరికే బాణ లింగాలు, గండకీ నదిలో దొరికే విష్ణు స్వరూపాలైన సాలగ్రామాలు ఈ నిష్కళ మూర్తికి ఉదాహరణలు. సాలగ్రామం సదా విష్ణు సాన్నిధ్యంలో ఉంటుంది. సాలగ్రామారాధనలో ప్రత్యేకించి ఆవాహన ఉండదు. అవి సాక్షాత్తూ సుకుమారమైన భగవంతుడి దివ్య స్వరూపం కాబట్టి.. అభిషేకం అయ్యాక 'ప్లోత వస్త్రం' (మెత్తటి వస్త్రం)తో తుడవడం కూడా చెయ్యరు. అభిషేకం అనంతరం తిరుమణి (నామం)తోపాటు చందనం, తులసి తప్పకుండా సమర్పిస్తారు.



## రూపారూపం/ వ్యక్తావ్యక్తం/ సకళనిష్కళం:

కనిపించీ కనిపించక, ఉందా, లేదా? అన్నట్టు ఉండే రూపమే... 'రూపారూపం లేదా 'వ్యక్తావ్యక్త' బింబాలు. అరూపమైన శివ లింగానికి నలువైపులా సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష రూపాల ముఖాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఊర్ధ్వ ముఖంగా ఈశాన రూపమూ చెక్కి ఉంటుంది. దీనినే 'ముఖలింగం' అంటారు. ఇవి వ్యక్తావ్యక్త బింబానికి ఉదాహరణ. రేణిగుంట సమీపంలోని గుడిమల్లంలో ఉన్న అతి ప్రాచీన శివలింగంపై ఒక మూర్తి చెక్కి ఉంటుంది. రూపానికి ప్రతీక అయిన ప్రతిమ, అరూపానికి ప్రతీక అయిన శివలింగం కలిసిన ఈ రూపాన్ని 'రూపారూపం' అని పేర్కొనవచ్చు. ఇక విష్ణు రూపానికి వస్తే... గోచరించీ గోచరించని పూరీ శ్రీ జగన్నాథ స్వామి విగ్రహాలు వైష్ణవ సంప్రదాయంలో 'వ్యక్తావ్యక్త' లేదా 'సకళనిష్కల' బింబానికి ఉదాహరణ.

• దగ్గుపాటి నాగవరప్రసాద్, స్థపతి, 9440525788

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## త్వరలోనే కొత్త షెడ్యూల్



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై నందమూరి కల్యాణ్ రామ్, హరికృష్ణ కొసరాజు, నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి నిర్మాణ సంస్థ ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. 'బీస్ట్ మోడ్ మళ్లీ మొదలు కానుంది. త్వరలోనే కొత్త షెడ్యూల్ షురూ' అని ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ ఉన్న ఓ పిక్ పోస్ట్ చేసింది.

## వినోదాల విందు



విశ్వక్‌సేన్ హీరోగా హాస్య చిత్రాలు రూపొందించడంలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు కలిగిన దర్శకుడు కేవీ అనుదీప్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఫంకీ' చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. వినోదాల విందుకు హామీ ఇస్తూ వచ్చే ఏడాది ఏప్రిల్ 3న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రకటించారు.

## సంతాన ప్రాప్తిరస్తు.. విజయోస్తు!

**- దిల్ రాజు**



'కల్యాణ ప్రాప్తిరస్తు అని వినేవాళ్లం. ఇప్పుడు సంతాన ప్రాప్తిరస్తు అని వింటున్నాం. లివ్ ఇన్ రిలేషన్, పెళ్లి సులువు అయ్యింది. కానీ, పిల్లలు పుట్టడమే సమస్యగా మారుతోంది. అందుకే ఈ సినిమాకు ఈ టైటిల్ పెట్టారు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా ప్రేక్షకులకు, మీడియాకు నచ్చి మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు నిర్మాత దిల్ రాజు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్వి ఆర్ట్స్ బేనర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ విడుదల వేడుకకు నిర్మాత దిల్ రాజు, కథానాయకుడు ఆనంద్ దేవరకొండ అతిథులుగా హాజరయ్యారు. 'ఈ సినిమా ట్రైలర్ చాలా ప్రామిసింగ్‌గా ఉంది. వినోదంతో ఆకట్టుకుంటోంది. మూవీ బ్లాక్‌బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నా' అని ఆనంద్ దేవరకొండ ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ కథకు కుటుంబ భావోద్వేగాలు, వినోదంతోపాటు ఒక చిన్న సామాజిక సమస్యను కూడా జత చేశాను' అని చెప్పారు. నిర్మాత మధుర శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'కంటెంట్ ఉన్న చిత్రాలనే ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. మా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాను కూడా ఆదరిస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో హీరో, హీరోయిన్లు విక్రాంత్, చాందినీ చౌదరి, నిర్మాత నిర్వి హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం

**- హేషమ్ అబ్దుల్ వహాబ్**



'ది గర్ల్‌ఫ్రెండ్' ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం. కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా మంచి సందేశం ఉన్న సినిమా ఇది. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరిలోనూ ఓ అంతర్మథనం మొదలవుతుంది' అని సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించగా, రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రమిది. నేడు విడుదలవుతోన్న సందర్భంగా హేషమ్ మీడియాతో ముచ్చటించారు. 'తెలుగులో నేను సంగీతం అందించేందుకు అంగీకరించిన తొలి చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమా చిత్రీకరణలో జాప్యం వల్ల నేను వేరే ప్రాజెక్ట్‌లతో బిజీగా మారడంతో నేపథ్య సంగీతం కోసం ప్రశాంత్ విహారిని తీసుకున్నారు. అతను చాలా మంచి బీజీఎం ఇచ్చారు. ఈ చిత్రంలో మొత్తం నాలుగు పాటలు ఉంటాయి. ఇటీవలే విడుదల చేసిన 'నీదే నీదే కథ' అనే పాట కంపోజింగ్ కోసం ఎక్కువగా కష్టపడ్డాను. హీరో హీరోయిన్ల పాత్రల మధ్య ఉండే సంఘర్షణే ఈ సినిమాకు మంచి పాటలు చేసే స్ఫూర్తినిచ్చింది. రాహుల్ కోరిక మేరకు మన స్వరాలు, వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఉపయోగించాం. తమిళ, మలయాళ చిత్రాల కన్నా తెలుగులో ఎక్కువ సినిమాలు చేస్తున్నాను' అని చెప్పారు.

## దుల్కర్‌ను నట చక్రవర్తి అని పిలుస్తారు

**- రానా**



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా దగ్గుబాటి తన స్పిరిట్ మీడియా పతాకంపై నిర్మిస్తున్నారు. నవంబర్ 14న విడుదల కానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభాస్ చేతుల మీదుగా ట్రైలర్‌ను విడుదల చేశారు. 1950-60ల నాటి మద్రాస్ సినీ పరిశ్రమ నేపథ్యంలో కథ సాగుతుంది. దుల్కర్ టీకే మహదేవన్ అనే సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. అతనికీ, దర్శక నిర్మాత అయిన అయ్య(సముద్రఖని)కు మధ్య ఉన్న సంఘర్షణ నేపథ్యంలో కథ సాగుతుంది అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ 'ఈ సినిమాను అందరూ థియేటర్లలో చూడండి. ఇదొక గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. నా స్నేహితుడు రానాతో కలసి నిర్మించడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ 'కథ విన్న వెంటనే తప్పకుండా ఈ సినిమా చేయాలనిపించింది. ఇలాంటి పీరియాడిక్ చిత్రానికి దుల్కర్ లాంటి రెట్రోకింగ్ పర్ఫెక్ట్. నవంబర్ 14 తర్వాత మీరందరూ దుల్కర్‌ను నట చక్రవర్తి అని పిలుస్తారు' అని చెప్పారు. కాంత నాకు చాలా స్పెషల్ చిత్రం అని భాగ్యశ్రీ బోర్సే తెలిపారు. కాంత లాంటి గొప్ప చిత్రంలో నటించినందుకు గర్వంగా ఉందని సముద్రఖని తెలిపారు. దుల్కర్ సల్మాన్ నటన ప్రతి ఒక్కరినీ మెప్పిస్తుందని సెల్వమణి సెల్వరాజ్ చెప్పారు.

# భారత్‌కు బడా బ్యాంకులు కావాలి

● ఆర్‌బీఐ, బ్యాంకులతో చర్చలు జరుపుతున్నాం ● ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి
● బ్యాంకింగ్‌లో మరిన్ని విలీనాలు, ప్రైవేటీకరణకు అవకాశం ● భగ్గుమన్న ఉద్యోగ సంఘాలు

ముంబై: భారత్‌లోనూ ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకుల అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), సంబంధిత బ్యాంకులతో చర్చిస్తున్నట్టు వెల్లడించారు. ఎస్‌బీఐ 12వ బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్ కాంక్లేవ్- 2025 సదస్సులో ఆమె ఈ విషయం చెప్పారు. మన దేశంలో ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకుల ఏర్పాటుపై తుది నిర్ణయం తీసుకునేందుకు చాలా కసరత్తు చేయాల్సి ఉంటుందని సీతారామన్ తెలిపారు. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనల కోసం ఆర్‌బీఐ, బ్యాంకులతో చర్చిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ లేదా విలీనాల ద్వారా ప్రభుత్వం ఇందుకు శ్రీకారం చుట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.



**బడా బ్యాంకులు ఎలా?**

అయితే ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకులను మన దేశంలో ఏర్పాటు చేయడం ఎలా? అనే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)ను మరింత కుదించి ఏర్పాటు చేస్తారా? లేక వేరే మార్గమేదైనా ఆలోచిస్తారా? అనే అంశంపై స్పష్టత రావడం లేదు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) వంటి పీఎస్‌బీల ప్రైవేటీకరణకు నీతి ఆయోగ్ నాలుగేళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉద్యోగ సంఘాల వ్యతిరేకత, ఇతర సమస్యల కారణంగా గత నాలుగేళ్లుగా ఈ విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఐఓబీ, సీబీఐతో పాటు మరో రెండు పీఎస్‌బీలను ఆర్థికంగా బలంగా ఉన్న ఇతర పీఎస్‌బీల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి.

**ఎస్‌బీఐ మార్కెట్ క్యాప్ రూ.8.86 లక్షల కోట్లు**

మరో ఐదేళ్లలో ప్రపంచంలోని టాప్-10 బ్యాంకుల్లో ఒకటిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇదే సదస్సులో ప్రసంగించిన ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. గురువారం తమ బ్యాంకు షేర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ 10,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.86 లక్షల కోట్లు) చేరినట్టు ఆయన వెల్లడించారు. కాగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రస్తుత 20 శాతం నుంచి 49 శాతానికి పెంచే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు. దీనివల్ల ప్రభుత్వ-ప్రైవేట్ బ్యాంకుల మధ్య మరింత సమతుల్యత ఏర్పడుతుందన్నారు.

**ప్రైవేటీకరణతో ముప్పే**

పీఎస్‌బీల ప్రైవేటీకరణతో దేశ ప్రయోజనాలకు, ఆర్థిక సమ్మిళితానికి ఎలాంటి ముప్పు లేదని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. పీఎస్‌బీలను ప్రైవేటీకరించడం ముమ్మాటికీ దేశ, సామాజిక ప్రయోజనాలకు ముప్పని బ్యాంకింగ్ ఉద్యోగులకు సంబంధించిన తొమ్మిది యూనియన్లకు ప్రాతినిధ్యం వహించే యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఒక ప్రకటనలో తెలిపింది. దీనివల్ల ఉద్యోగ భద్రతతో పాటు బ్యాంకుల్లోని ప్రజల సొమ్ముకూ ఎలాంటి భద్రత ఉండదని హెచ్చరించింది. ప్రైవేటీకరణ కంపెనీలకు మేలు చేస్తుందే తప్ప, ప్రజలకు కాదని స్పష్టం చేసింది. ప్రభుత్వాలు బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక, రాజ్యాంగ బాధ్యతగా చూడాలే తప్ప, లాభాల కోసం చేసే వ్యాపారంగా చూడకూడదని యూఎఫ్‌బీయూ కోరింది. ఏ పీఎస్‌బీని ప్రైవేటీకరించబోమని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,21,910 ▲ | 1,11,750 ▲ | 1,64,000 ▲ |
| విజయవాడ | 1,24,600 ▲ | 1,16,000 ▼ | 1,52,600 ▲ |
| విశాఖపట్నం | 1,24,510 ▲ | 1,11,350 ▼ | 1,64,000 ▲ |
| రాజమండ్రి | 1,21,910 ▲ | 1,11,750 ▲ | 1,48,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,20,400 ▼ | 1,10,770 ▼ | 1,51,300 ▲ |
| ముంబై | 1,20,670 ▲ | 1,10,534 ▲ | 1,48,242 ▲ |

## ప్లాస్టో నుంచి అన్‌బ్రేకబుల్ టేబుల్



హైదరాబాద్: ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ తన ఉత్పత్తుల పోర్టు ఫోలియోను మరింతగా విస్తరించింది. తాజాగా గృహ, వాణిజ్య అవసరాల కోసం అన్‌బ్రేకబుల్ టేబుల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పటిష్ఠమైన, డ్యూరబుల్ ప్లాస్టిక్‌తో సరికొత్త స్టైల్‌తో యూవీ ప్రొటెక్షన్, యాంటీఆక్సిడెంట్ టెక్నాలజీతో ఈ టేబుల్‌ను తయారు చేసినట్లు ప్లాస్టో పేర్కొంది. ఆఫీస్, గృహావసరాలకు చక్కగా సరిపోయే ఈ టేబుల్‌ను పదేళ్ల వారంటీతో అందిస్తున్నట్లు ప్లాస్టో వెల్లడించింది.

## తగ్గిన ఎన్‌సీసీ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎన్‌సీసీ లిమిటెడ్.. రూ.4,585.06 కోట్ల కన్సాలిడేటెడ్ టర్నోవర్‌పై రూ.154.70 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.5,224.36 కోట్లుగా ఉండగా లాభం రూ.162.96 కోట్లుగా ఉంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.3,773.96 కోట్ల ఆదాయంపై రూ.100.96 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ కొత్తగా రూ.6,223 కోట్ల ఆర్డర్లు అందుకోవటంతో మొత్తం ఆర్డర్ బుక్ రూ.71,957 కోట్లకు చేరుకుంది.

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 106 |
| వరంగల్ | 100 | గుంటూరు | 108 |
| కరీంనగర్ | 100 | ఒంగోలు | 108 |
| మహబూబ్‌నగర్ | 100 | చిత్తూరు | 97 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 102 |
| విశాఖపట్నం | 108 | అనంతపురం | 102 |
| గోదావరి | 106 | | |

# దాతృత్వంలో నాడార్ మేటి

» గత ఏడాది రూ.2,708 కోట్ల విరాళాలు ఇచ్చిన హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకుడు
» రోజుకు సగటున రూ.7.4 కోట్లు దానం

**ఎడెల్‌గివ్-హురున్ దాతల నివేదిక విడుదల**

న్యూఢిల్లీ: దానం చేసేందుకు డబ్బుతో పాటు గొప్ప మనసు కూడా ఉండాలి. ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ దేశంలో అత్యంత దయాగుణం కలిగిన వ్యక్తిగా నిలిచారు. గురువారం విడుదలైన 'ఎడెల్‌గివ్-హురున్ ఇండియా దాతలు 2025' జాబితా ప్రకారం.. గత ఏడాది నాడార్ కుటుంబం శివ్ నాడార్ ఫౌండేషన్ ద్వారా రూ.2,708 కోట్ల విరాళాలిచ్చింది. అంటే, రోజుకు సగటున రూ.7.4 కోట్లు దానం చేసిందీ కుటుంబం. ఎడెల్‌గివ్-హురున్ ఏటా విడుదల చేస్తున్న ఈ జాబితాలో నాడార్ అగ్రస్థానంలో నిలవడం ఐదేళ్లలో ఇది నాలుగో సారి. గడిచిన ఐదేళ్లలో నాడార్ ఫ్యామిలీ మొత్తం రూ.10,122 కోట్లు ప్రధానంగా విద్యా రంగానికి విరాళాలిచ్చింది.

- భారత్‌లో అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబం దాతృత్వం విషయంలో మాత్రం రెండో స్థానంలో నిలిచింది. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా ఈ కుటుంబం రూ.626 కోట్లు దానం చేసింది.
- దేశంలో రెండో అతిపెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీ, కుటుంబం రూ.386 కోట్ల విరాళాలతో ఐదో స్థానంలో ఉంది.
- ఈసారి జాబితాలో మొత్తం 191 మందికి స్థానం లభించింది. అందులో 12 మంది కొత్తవారు. వారి మొత్తం విరాళాలు రూ.10,380 కోట్లు. మూడేళ్ల క్రితంతో పోలిస్తే ఈ విలువ 85 శాతం పెరిగింది. మొత్తం విరాళాల్లో దాదాపు 40 శాతం విద్యా రంగానికి, 9 శాతం హెల్త్‌కేర్ రంగానికి దక్కాయి.
- దేశంలోని టాప్-10 దాతలు మొత్తం రూ.5,834 కోట్ల విరాళాలిచ్చారు. గత ఏడాదితో పోలిస్తే 26 శాతం అధికమిది. అంతేకాదు, లిస్ట్‌లోని అందరి విరాళాల్లో వీరి వాటాయే 56 శాతంగా ఉంది.
- జాబితాలోని టాప్ -25 దాతలు గత మూడేళ్లలో మొత్తం రూ.50,000 కోట్లు దానం చేశారు. అంటే, రోజుకు సగటున రూ.46 కోట్లు ఇచ్చారు.

## రెండో రోజూ నష్టాల్లో.. సెన్సెక్స్ 148 పాయింట్లు డౌన్

ముంబై: ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైన ఈక్విటీ సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 148.14 పాయింట్లు కోల్పోయి 83,311.01 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 83,846.35 వద్ద గరిష్ఠాన్ని, 83,237.65 వద్ద కనిష్ఠ స్థాయిలను నమోదు చేసింది. నిఫ్టీ 87.95 పాయింట్లు పతనమై 25,509.70 వద్ద క్లోజైంది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి.

## మిక్ ఎలక్ట్రానిక్స్ రూ.250 కోట్ల సమీకరణ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మిక్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా రూ.250 కోట్ల నిధులు సమీకరించనుంది. ఈ మేరకు బోర్డు ఆమోదం లభించిందని కంపెనీ పేర్కొంది. అలాగే ఫారిన్ కన్వర్టబుల్ బాండ్ల (ఎఫ్‌సీసీబీ) ద్వారా 1.5 కోట్ల డాలర్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించిందని తెలిపింది. వాటాదారులు, రెగ్యులేటరీ సంస్థల అనుమతులకు లోబడి ఈ నిధుల సమీకరణ ఉంటుందని పేర్కొంది.

## ఎల్‌ఐసీ లాభం రూ.10,053 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.10,053 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.7,621 కోట్లతో పోల్చితే ఇది 32% అధికం. ఇదే కాలంలో మొత్తం ఆదాయం సైతం రూ.2,29,620 కోట్ల నుంచి రూ.2,39,614 కోట్లకు పెరిగింది. మొత్తం ప్రీమియం ఆదాయం సైతం రూ.1,19,901 కోట్ల నుంచి రూ.1,26,479 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయం రూ.2,30,160 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక రెన్యువల్ ప్రీమియం రూ.61,910 కోట్ల నుంచి రూ.64,996 కోట్లకు పెరిగింది.

## పెరిగిన అపోలో హాస్పిటల్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.477 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 26 శాతం వృద్ధి చెందింది. హెల్త్‌కేర్ సర్వీసులు, రిటైల్, ఫార్మా పంపిణీ విభాగాలు మంచి పనితీరు కనబరచటం కలిసివచ్చిందని పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.5,589 కోట్ల నుంచి రూ.6,304 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో హెల్త్‌కేర్ సర్వీసుల (హాస్పిటల్స్) ఆదాయం 9 శాతం వృద్ధితో రూ.2,903 కోట్ల నుంచి రూ.3,169 కోట్లకు చేరుకుంది.

- అంతర్జాతీయ మీడియా, సోషల్, కన్స్యూమర్ ఇంటలిజెన్స్ సంస్థ మెల్ట్‌వాటర్.. హైదరాబాద్‌లోని తన ఏఐ హబ్‌ను విస్తరించినట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన ఏడాది కాలంలోనే హైటెక్ సిటీ సమీపంలో కొత్తగా 14,000 చదరపు అడుగుల కార్యాలయంలోకి విస్తరించినట్లు తెలిపింది. అలాగే నెక్స్ట్ జెనరేషన్ ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసేందుకు గాను ప్రస్తుతం 60 మందితో ఉన్న ఆర్ అండ్ డీ టీమ్‌ను వచ్చే ఏడాది 150కి చేర్చనున్నట్లు తెలిపింది.

- ప్రైవేట్ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ క్లయింట్ అసోసియేట్స్.. హైదరాబాద్‌లో కొత్త ఎక్స్‌పీరియన్స్ కేంద్రాన్ని ప్రారంభించింది. సంస్థ గత పదహారేళ్లుగా హైదరాబాద్‌లో కార్యకలాపాలు సాగిస్తోంది. తాజాగా ఏర్పాటు చేసిన కొత్త సెంటర్‌తో హెచ్ఎన్ఐ, యూహెచ్ఎన్ఐలకు కస్టమైజ్డ్ వెల్త్ మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్‌ను అందించనుంది.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| 7వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 580 | విజయవాడ | 585 |
| వరంగల్ | 582 | గోదావరి | 595 |
| చిత్తూరు | 613 | విశాఖపట్నం | 580 |
| | | డజను గుడ్లు రూ. 78 | |

# స్పోర్ట్స్

## ఫైనల్ అహ్మదాబాద్‌లో..?

**భారత్‌లో ఐదు వేదికలు**

● ఐసీసీ కుదించిన జాబితా
● త్వరలో టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్-శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న టీ20 వరల్డ్‌కప్ కోసం ఐసీసీ కుదించిన వేదికల జాబితాను సిద్ధం చేసింది. చేసింది. అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబైల్లో మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. అయితే, ఫైనల్‌కు మాత్రం అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వొచ్చు. కాగా, వచ్చే వారం ఐసీసీ షెడ్యూల్‌ను విడుదల చేసే చాన్సులున్నాయి. 20 జట్ల టోర్నీని ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు 8 వేదికల్లో నిర్వహించే అవకాశం ఉంది. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లకు తటస్థ వేదికగా శ్రీలంకను ఎంపిక చేశారు. కాండీ, కొలంబోతోపాటు మరో వేదికను త్వరలో ఖరారు చేయనున్నారు. ఒకవేళ పాక్ ఫైనల్ చేరితే మాత్రం టైటిల్ పోరును తటస్థ వేదికైన లంకలోనే నిర్వహించాల్సి ఉంటుంది.

## జురెల్ శతకం

**భారత్ 'ఎ' 255 — దక్షిణాఫ్రికా 'ఎ'తో టెస్ట్**

బెంగళూరు: ధ్రువ్ జురెల్ (132 నాటౌట్) శతకంతో పోరాడడంతో దక్షిణాఫ్రికా 'ఎ'తో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల రెండో అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' 255 పరుగులు సాధించింది. పంత్ (24), కుల్దీప్ (20), కేఎల్ రాహుల్ (19) విఫలమయ్యారు. ఊరెన్ 4, మొరేకి, సుబ్రేయిన్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

## విశ్వ విజేతలకు టాటా కార్లు

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్టుకు టాటా మోటార్స్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. సరికొత్త రూపుతో ఈనెల 25న మార్కెట్లోకి రాబోతున్న తమ సియెరా ఎస్‌యూవీ కార్లను అందించనుంది. ఈ కారు ధర రూ.15-25 లక్షల వరకు ఉండనుంది.

## మూడో రౌండ్‌కు ప్రజ్ఞానంద

పనాజీ (గోవా): ఫిడే వరల్డ్‌కప్‌లో ప్రజ్ఞానంద సహా పలువురు భారత జీఎంలు మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన రెండో రౌండ్ టైబ్రేకర్ పోరులో ఆస్ట్రేలియా జీఎం కుయ్కోకరోవ్‌ను ఓడించి ప్రజ్ఞానంద ముందంజ వేశాడు. అలాగే విదిత్ గుజరాతి 12 ఏళ్ల అర్జెంటీనా బాలుడు ఫాస్టినో ఓరోపై నెగ్గాడు. ఇంకా ప్రణవ్, ప్రాణేష్ కూడా తదుపరి రౌండ్‌కు చేరారు.

## అండర్-19 వరల్డ్ కప్.. వన్డే ఫార్మాట్‌లోనే

దుబాయ్: అండర్-19 పురుషుల వరల్డ్‌కప్ వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది. తాజాగా దుబాయ్‌లో జరుగుతున్న చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (సీఈసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టీ20లకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ మెగా టోర్నీ ప్రస్తుత ఫార్మాట్‌ను మార్చాలంటూ పలు అసోసియేట్ మెంబర్స్ డిమాండ్ చేశారు. కానీ శాశ్వత సభ్య దేశాలు మాత్రం వన్డేలకే ఓటేశాయి.

# సిరీస్ ఇక పదిలమే..

● 2-1తో ఆధిక్యం ● చెలరేగిన బౌలర్లు
● భారత్ ఘనవిజయం ● ఆసీస్‌తో నాలుగో టీ20



గిల్ (46)



అక్షర్ (2/20)

గోల్డ్‌కోస్ట్: సూర్యకుమార్ నేతృత్వంలోని భారత టీ20 జట్టు ఇప్పటిదాకా సిరీస్‌ను కోల్పోలేదు. అలాగే ఆసీస్ గడ్డపైనా ఈ ఫార్మాట్‌లో అజేయంగా ఉన్న రికార్డుకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. గురువారం ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టీ20లో బౌలర్లు విశేషంగా రాణించడంతో భారత జట్టు 48 పరుగుల తేడాతో వరుసగా రెండో విజయం సాధించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ప్రస్తుతం 2-1తో ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే. శనివారం బ్రిస్బేన్‌లో చివరి మ్యాచ్ జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 పరుగులు చేసింది. గిల్ (39 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 46), అభిషేక్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 28) పర్వాలేదనిపించగా.. చివర్లో అక్షర్ పటేల్ (11 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 21 నాటౌట్) వేగంగా ఆడాడు. పేసర్ ఎలిస్, స్పిన్నర్ జంపాలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 18.2 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మార్ష్ (24 బంతుల్లో 4 ఫోర్లతో 30), షార్ట్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25) మాత్రమే రాణించారు. సుందర్‌కు మూడు.. అక్షర్, దూబేలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆల్‌రౌండ్‌షో కనబర్చిన అక్షర్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

**స్పిన్‌కు తడబాటు:** ఓ మాదిరి ఛేదనను ఆసీస్ మెరుగ్గానే ఆరంభించినా మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్లు కట్టడి చేశారు. ఓపెనర్లు మార్ష్, షార్ట్ మాత్రమే కాస్త పోరాడగలిగారు. ఈ జోడీ క్రీజులో ఉన్నంత సేపు ఆసీస్ విజయంపై ఆశతోనే ఉంది. పవర్‌ప్లేలో షార్ట్‌ను అక్షర్ అవుట్ చేయగా, కాసేపటికే వన్‌డౌన్ బ్యాటర్ ఇన్‌గ్లిస్ (12)ను కూడా దెబ్బతీశాడు. మరోవైపు జోరు మీదున్న మార్ష్, టిమ్ డేవిడ్ (14)లను శివమ్ దూబే తన వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో ఆసీస్ ఛేదనపై ప్రభావం చూపింది. ఇక 14వ ఓవర్లో ఫిలిప్ (10)ను అర్ష్‌దీప్ అవుట్ చేశాక వికెట్ల పతనం వేగంగా సాగింది. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన హిట్టర్ మ్యాక్స్‌వెల్ (2) కేవలం నాలుగు బంతులే ఆడి వరుణ్ చేతిలో బౌల్డయ్యాడు. అలాగే 17వ ఓవర్లో స్టొయినిస్ (17), బార్ట్‌లెట్ (0)లను స్పిన్నర్ సుందర్ వరుస బంతుల్లో అవుట్ చేయడంతో ఆసీస్ కోలుకోలేకపోయింది. 16 పరుగుల తేడాతో చివరి 5 వికెట్లు కోల్పోయిన ఆసీస్ మరో 10 బంతులుండగానే ఓటమిపాలైంది.

**ఆకట్టుకున్న గిల్:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆశించిన రీతిలో సాగలేదు. పిచ్ బ్యాటింగ్‌కు కష్టంగా మారడంతో ఓపెనర్ అభిషేక్ భారీ షాట్లు ఆడలేకపోయాడు. అటు గిల్ మాత్రం ఈసారి మెరుగైన ఆటతో ఆకట్టుకున్నాడు. ఓ దశలో 121/2 స్కోరుతో పటిష్ఠంగా కనిపించినా.. చివరి ఆరు ఓవర్లలో 46 పరుగులే చేయగలిగింది. ఇన్నింగ్స్ రెండో బంతికే అభిషేక్ ఇచ్చిన క్యాచ్‌ను బార్ట్‌లెట్ వదిలేశాడు. ముఖ్యంగా గిల్ సాధికారికంగా ఆడి నాలుగో ఓవర్లో రెండు ఫోర్లు బాదాడు. అటు ఐదో ఓవర్లో అభిషేక్ సైతం రెండు ఫోర్లతో 11 రన్స్ రాబట్టడంతో జట్టు పవర్‌ప్లేలో 49 పరుగులతో నిలిచింది. ఇక జంపా ఓవర్లో సిక్సర్ బాదిన అభిషేక్ మరో షాట్‌కు వెళ్లి లాంగాన్‌లో డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనూహ్యంగా వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన దూబే (22) ఉన్న కాసేపు వేగంగా ఆడాలని చూసినా.. పేసర్ ఎలిస్‌కు చిక్కాడు. అటు కెప్టెన్ సూర్య 13వ ఓవర్లో రెండు వరుస సిక్సర్లతో జోష్ చూపాడు. అటు తర్వాతి ఓవర్లోనే గిల్ కూడా సిక్సర్ బాది హాఫ్ సెంచరీ ఖాయమనిపించాడు. కానీ ఎలిస్ విసిరిన స్లో బాల్‌కు క్లీన్ బౌల్డయ్యాడు. ఆ తర్వాత సూర్య నిష్క్రమించగా, స్పిన్నర్ జంపా ఒకే ఓవర్లో తిలక్ (5), జితేశ్ (3)లను పెవిలియన్‌కు చేర్చి షాకిచ్చాడు. అయితే సుందర్ (12) అవుటయ్యాక ఆఖరి ఓవర్లో అక్షర్ 4,6తో 14 రన్స్ అందించి జట్టుకు సవాల్ విసిరే స్కోరందించాడు.

**స్కోరుబోర్డు**

**భారత్:** అభిషేక్ (సి) డేవిడ్ (బి) జంపా 28, గిల్ (బి) ఎలిస్ 46, దూబే (బి) ఎలిస్ 22, సూర్యకుమార్ (సి) డేవిడ్ (బి) బార్ట్‌లెట్ 20, తిలక్ (సి) ఇన్‌గ్లిస్ (బి) జంపా 5, జితేశ్ (ఎల్బీ) జంపా 3, సుందర్ (సి సబ్) కునేమన్ (బి) ఎలిస్ 12, అక్షర్ (నాటౌట్) 21, అర్ష్‌దీప్ (సి) ఫిలిప్ (బి) స్టొయినిస్ 0, వరుణ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 167/8. వికెట్ల పతనం:** 1-56, 2-88, 3-121, 4-125, 5-131, 6-136, 7-152, 8-164; **బౌలింగ్:** డ్వార్షుస్ 4-0-31-0, బార్ట్‌లెట్ 4-0-26-1, ఎలిస్ 4-0-21-3, స్టొయినిస్ 4-0-41-1, జంపా 4-0-45-3.

**ఆస్ట్రేలియా:** మార్ష్ (సి) అర్ష్‌దీప్ (బి) దూబే 30, షార్ట్ (ఎల్బీ) అక్షర్ 25, ఇన్‌గ్లిస్ (బి) అక్షర్ 12, డేవిడ్ (సి) సూర్యకుమార్ (బి) దూబే 14, ఫిలిప్ (సి) వరుణ్ (బి) అర్ష్‌దీప్ 10, స్టొయినిస్ (ఎల్బీ) సుందర్ 17, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 2, డ్వార్షుస్ (బి) బుమ్రా 5, బార్ట్‌లెట్ (సి అండ్ బి) సుందర్ 0, ఎలిస్ (నాటౌట్) 2, జంపా (సి) గిల్ (బి) సుందర్ 0; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 18.2 ఓవర్లలో 119 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-37, 2-67, 3-70, 4-91, 5-98, 6-103, 7-116, 8-116, 9-118, 119-10; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-22-1, బుమ్రా 4-0-27-1, వరుణ్ 4-0-26-1, అక్షర్ 4-0-20-2, దూబే 2-0-20-2, సుందర్ 1.2-0-3-3.

**2** — ఆసీస్ గడ్డపై గతంలో భారత్ ఆడిన నాలుగు టీ20 సిరీస్‌ల్లో రెండు గెలవగా, రెండు సమమయ్యాయి. తాజా సిరీస్‌ను కూడా ఓటమి లేకుండానే ముగించనుంది.

స్వదేశంలో జరిగిన టీ20ల్లో ఆసీస్‌కిది రెండో అత్యల్ప స్కోరు (119). గతంలో కివీస్‌పై 111 పరుగులు చేసింది.



## యువతరానికి మీరు ఆదర్శం

**విశ్వవిజేతలకు రాష్ట్రపతి ముర్ము ప్రశంస**

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం రాష్ట్రపతి భవన్‌లో కలిసింది. మెగా టోర్నమెంట్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరచిందని ఈ సందర్భంగా రాష్ట్రపతి కొనియాడారు. ట్రోఫీతో హర్మన్ సేన చరిత్ర సృష్టించడంతోపాటు యువతరానికి ఆదర్శంగా నిలిచిందని ముర్ము ప్రశంసించారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ ట్రోఫీని కెప్టెన్ హర్మన్ రాష్ట్రపతికి అందజేయడంతోపాటు జట్టు సభ్యులు సంతకాలు చేసిన జెర్సీని కూడా బహూకరించారు.



మహిళల ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టు సభ్యురాలు, హైదరాబాద్‌కు చెందిన అరుంధతి రెడ్డి గురువారం స్వస్థలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు స్వాగతం పలుకుతున్న 'శాట్' చైర్మన్ శివ సేనారెడ్డి, వీసీ ఎండీ సోనీ బాలాదేవి.

# వేలానికి దీప్తి, వోల్వార్ట్





● మంధాన, బ్రంట్, గార్డ్‌నర్‌కు రూ. 3.5 కోట్లు
● వదిలేసిన జాబితాలో హీలీ, లానింగ్, శ్రీచరణి, అరుంధతి
● డబ్ల్యూపీఎల్ రిటైన్ జాబితా

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మెగా వేలానికి ముందు సంచలనాలు చోటు చేసుకొన్నాయి. ప్రపంచకప్ స్టార్లు దీప్తి శర్మను యూపీ వారియర్స్, లారా వోల్వార్ట్‌ను గుజరాత్ జెయింట్స్ వదిలేయగా.. ముంబై ఆల్‌రౌండర్ నాట్ స్కివర్ బ్రంట్, బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన, గుజరాత్ జెయింట్స్ ఆల్‌రౌండర్ ఆష్లే గార్డ్‌నర్‌ను గరిష్ఠ ధర రూ. 3.5 కోట్లకు ఆయా ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్నాయి. రిటైన్ జాబితాను డబ్ల్యూపీఎల్ గురువారం విడుదల చేసింది. ముంబై తన తొలి ప్రాధాన్యంగా ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ స్కివర్ బ్రంట్‌ను ఎంచుకోగా.. కెప్టెన్ హర్మన్‌ను రెండో ప్రాధాన్యంగా పేర్కొంది. కాగా, బెంగళూరు రూ. 2.75 కోట్లకు రిచా ఘోష్‌ను రిటైన్ చేసుకొంది. కెప్టెన్ మెగ్ లానింగ్, శ్రీ చరణి, అరుంధతిని ఢిల్లీ వదిలేయగా, ముంబై అమేలియా కెర్, డి క్లెర్, ట్రయన్‌లను వేలం కోసం విడుదల చేసింది. డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఐదుగురు చొప్పున ప్లేయర్లను రిటైన్ చేసుకొన్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నలుగురిని, గుజరాత్ జెయింట్స్ ఇద్దరిని అట్టిపెట్టుకోగా.. యూపీ వారియర్స్ కేవలం అన్‌క్యాప్డ్ శ్వేత షెహ్రావత్‌ను మాత్రమే రూ. 50 లక్షలకు రిటైన్ చేసుకొంది. షఫాలీ, అనబెల్ సదర్లాండ్, మరిజానె కాప్, జెమీమాలను ఢిల్లీ సమంగా రూ. 2.2 కోట్లకు రిటైన్ చేసుకొంది.

## సర్కారు బడి విద్యార్థినిపై ఐటీ మంత్రి ప్రశంసలు

- ఇది తెలంగాణ డిజిటల్ విప్లవానికి నిదర్శనం
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో పాల్గొన్న శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇండియా టుడే గురువారం నిర్వహించిన రోబోటిక్స్ & ఏఐ కాంక్లేవ్‌లో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిపై ప్రశంసలు కురిపించారు. మంథని నియోజకవర్గం అడవి శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సెలవు రోజుల్లో పర్‌ప్లెక్సిటీ అనే ఏఐ టూల్ సహాయంతో తొమ్మిదో తరగతి సిలబస్ పూర్తి చేసి, పదో తరగతికి అర్హత సాధించిందన్నారు. ఆమె ప్రేరణతో, అదే తరగతిలోని మరో 50 మంది విద్యార్థులు కూడా చాట్ జీపీటీ, పర్‌ప్లెక్సిటీ వంటి ఏఐ టూల్స్ ఉపయోగించడం ప్రారంభించారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన టీ-ఫైబర్ ప్రాజెక్ట్ కారణంగానే ఇది సాధ్యమైందని, ప్రస్తుతానికి 4 గ్రామాల్లో ఈ ప్రాజెక్ట్ అమలు అవుతుందని చెప్పారు. హైదరాబాద్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవి శ్రీరాంపూర్ గ్రామం డిజిటల్ తెలంగాణా స్వప్నానికి ప్రతీకగా నిలుస్తోందని శ్రీధర్ బాబు కొనియాడారు.

## రహదారి విస్తరణ త్వరగా పూర్తి చేయండి

- అధికారులకు సుప్రీం రోడ్డు భద్రత కమిటీ ఆదేశాలు
- చేవెళ్లలో టిప్పర్-ఆర్టీసీ బస్సు ప్రమాదంపై సమీక్ష

చేవెళ్ల సమీపంలో టిప్పర్-ఆర్టీసీ బస్సు ప్రమాదంపై సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ సమీక్షించింది. హైదరాబాద్ విచ్చేసిన కమిటీ ఛైర్మన్ అభయ్ మనోహర్ సాప్రే, సభ్యులు సంజయ్ బందోపాధ్యాయ చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ప్రమాదం జరగడానికి గల కారణాలను కమిటీకి తెలిపారు. ఆర్టీసీ బస్సుల ఫిట్‌నెస్ మరోసారి సారి తనిఖీ చేయాలని వాటితోపాటు ఇతర బస్సులు, కమర్షియల్ వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాటిని సీజ్ చేయాలని, ప్రతి వాహనం ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సంబంధిత అధికారులను ఆదేశించింది. జాతీయ రహదారి విస్తరణ పనులను తొందరగా చేపట్టి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించింది. మైనింగ్ క్వారీ నుండి పరిమితికి మించి లోడ్ వెళ్లకుండా చూడాలని మైనింగ్ రవాణా శాఖ అధికారులకు సూచించింది. రోడ్డు భద్రత నిధిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరింది. ఈ సమావేశంలో రవాణా కమిషనర్ ఇలంబర్తి, అదనపు డీజీ మహేష్ భగవత్, మైనింగ్ డైరెక్టర్ భవేశ్ మిశ్రా, జేటీసీలు చంద్ర శేఖర్ గౌడ్, శివ లింగయ్య, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాళ్లు పార్టీ మారారు.. ఇవీ ఆధారాలు!

- స్పీకర్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల వాదన

బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరారని ఆరోపిస్తూ దాఖలైన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం విచారణ చేపట్టారు. 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గతంలోనే నోటీసులు ఇవ్వగా.. దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా 8మంది స్పీకర్ కార్యాలయానికి తమ వివరణ పంపారు. నలుగురు ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్‌పై విచారణను స్పీకర్ ఇప్పటికే పూర్తిచేసి తీర్పు రిజర్వులో ఉంచారు. మిగతా నలుగురు ఎమ్మెల్యేల్లో తెల్లం వెంకట్రావ్, సంజయ్‌పై విచారణ గురువారం ప్రారంభమైంది. బీఆర్‌ఎస్ తరఫున ఫిర్యాదు చేసిన జగదీశ్‌రెడ్డి, వివేకానంద స్పీకర్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు. సదరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో ఉన్న ఫొటోలు, కాంగ్రెస్‌కు అనుకూలంగా చేసిన ప్రసంగాల వీడియోలను సమర్పించారు. విచారణకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, సంజయ్ గైర్హాజరవ్వగా, వారి తరఫున న్యాయవాదులు జగదీశ్‌రెడ్డి, వివేకానందను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. శుక్రవారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీపై విచారణ జరగనుంది.

## ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్-2025

- జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులే లక్ష్యంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహణ
- 'ప్రజాపాలన-విజయోత్సవాల' పేరిట సంబరాలు
- మీర్‌ఖాన్‌పేటలో 100 ఎకరాల్లో ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): భారత్ ఫ్యూచర్ సిటీ త్వరలో అంతర్జాతీయ వేదిక కానుంది. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు వచ్చే నెల 8, 9 తేదీల్లో ఇక్కడ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి రెండేళ్లు పూర్తవుతుండటంతో పాటు కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల పేరిట ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఇందులో తెలంగాణ విజన్ రైజింగ్-2047 డాక్యుమెంట్‌తో పాటు ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనున్నారు. అలాగే వివిధ రంగాలకు సంబంధించి పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త పాలసీలను ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు రానుండడంతో ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మీర్‌ఖాన్‌పేటలో 100 ఎకరాలను సిద్ధం చేశారు. వీటిని చదును చేసే పనులు మొదలయ్యాయి. పనుల పరిశీలనకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడకు రానున్నట్లు సమాచారం. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆహ్వానిస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్డుతో పాటు ఫార్మా, ఇతర రంగాలకు సంబంధించిన పెట్టుబడులే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన ప్రజెంటేషన్లు రెండు రోజుల పాటు ఇవ్వనున్నారు.

### జయేశ్ రంజన్ అధ్యక్షతన కోర్ కమిటీ

సదస్సు నిర్వహణ కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అధ్యక్షతన ఏడుగురు ఉన్నతాధికారులతో సమన్వయ కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్‌రాజ్, సంజయ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, టీజీఐఐసీ ఎండీ శశాంక్, ఎంఆర్‌డీసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి కమిటీలో ఉన్నారు. అలాగే సీనియర్ ఐఏఎస్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులతో కలిపి27 మందితో 9 ఆర్గనైజేషన్ కమిటీలను ఏర్పాటు చేశారు. వేదిక-ఏరినా డిజైన్ కమిటీ, ఆహ్వాన కమిటీ, ప్రోగ్రామ్ డిజైన్-కోఆర్డినేషన్ కమిటీ, ఒప్పందాల కమిటీ, ఆతిథ్యం-లాజిస్టిక్ కమిటీ, ఫుడ్ అండ్ కల్చరల్ కమిటీ, డిజిటల్ మార్కెటింగ్ అండ్ మీడియా కమిటీ, కంటెంట్ క్రియేషన్ అండ్ ఐఈసీ కమిటీ, సెక్యూరిటీ అండ్ ప్రొటోకాల్ కమిటీలను ఏర్పాటు చేశారు.

# మరో డిప్యూటీ సీఎం?

(మొదటిపేజీ తరువాయి)

కులగణన చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లులను ఆమోదించింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం చట్టపరంగా, న్యాయపరంగా ప్రయత్నించింది. వీటితోపాటు బీసీ వర్గానికి చెందిన నేతకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి ఆ వర్గానికి మరింత దగ్గరవ్వాలనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉందని చెబుతున్నారు. ఎస్సీ వర్గం నుంచి భట్టివిక్రమార్క ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్నారు. దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ మంత్రులుగా కొనసాగుతున్నారు. బీసీల నుంచి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్నారు. వీరికి అదనంగా మరొకరిని డిప్యూటీ సీఎంగా తీసుకుంటే బీసీలకు మరింత ప్రాధాన్యమిచ్చినట్టు అవుతుందని, ఎస్సీలతోపాటు బీసీలు కూడా ఓటుబ్యాంకుగా నిలుస్తారని అధిష్ఠానం అంచనా. ఈ క్రమంలో ప్రస్తుతం టీపీసీసీ చీఫ్‌గా ఉన్న మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకుని డిప్యూటీ సీఎం హోదా కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మహేష్‌గౌడ్‌కు డిప్యూటీ సీఎం హోదా కల్పిస్తే.. టీపీసీసీకి కొత్త చీఫ్‌ను నియమించవచ్చునని చెబుతున్నారు.

### శాఖల్లో సమూల మార్పులు!

స్థానిక ఎన్నికల తర్వాత మంత్రుల శాఖల్లో సమూలంగా మార్పులు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి, మంత్రుల పనితీరుపై ఇప్పటికే ప్రగతి నివేదికలు అందించిన అధిష్ఠానం తదుపరి సమీక్ష నాటికి పనితీరు మెరుగుపరుచుకోవాలని లేదంటే చర్యలు తప్పవని పలుమార్లు స్పష్టం చేసింది. కానీ, మంత్రుల శాఖల్లో సమూలంగా మార్పులు తీసుకురావాలన్న నిర్ణయానికి అధిష్ఠానం వచ్చిందని అంటున్నారు. స్థానిక ఎన్నికల లోపు పనితీరు మెరుగుపరుచుకోకుంటే పునర్‌వ్యవస్థీకరణ చేపట్టి కొందరు మంత్రుల స్థానే కొత్తవారిని తీసుకోనున్నట్లూ చెబుతున్నారు. మరోపక్క, మంత్రివర్గంలో చోటు కోసం ఇప్పటికే కొందరు నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు సమాచారం. బీసీ కోటాలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారని తెలిసింది. చట్టసభల్లో సభ్యత్వం లేకున్నా అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చినట్లుగా.. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన తమకూ మంత్రివర్గంలో స్థానం కల్పించాలంటూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన బీసీ నేతలు అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు తెలుస్తోంది. ముషీరాబాద్ నుంచి పోటీ చేసి ఓటమిపాలైన అంజన్ కుమార్ యాదవ్, ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మధుయాష్కీగౌడ్ ఈ మేరకు ప్రయత్నాల్లో ఉన్నట్లు చెబుతున్నారు. ఎస్టీ లంబాడా కోటాలో ఎమ్మెల్యేలు బాలూ నాయక్, రామచంద్రునాయక్ కూడా తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు వినికిడి.

## ఒక్క ఓటరునూ వదలకుండా బూత్‌కు రప్పించండి

### ఉప ఎన్నికపై మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశనం



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజున ఒక్క ఓటరునూ వదలకుండా బూత్‌కు రప్పించి ఓటు వేయించేలా ఏర్పాట్లు చేసుకోవాలని.. పోలింగ్ శాతం ఎంత పెరిగితే కాంగ్రెస్‌కు మెజారిటీ అంత పెరుగుతుందని మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పరిస్థితి కాంగ్రెస్‌కు సానుకూలంగా ఉందని, అయినా సరే ఏ చిన్నపాటి నిర్లక్ష్యానికీ తావు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ప్రచారానికి ఇంకా నాలుగు రోజులే మిగిలిందని, బస్తీలు, కాలనీల్లోకి చొచ్చుకువెళ్లి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని చెప్పారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌లతో సీఎం సమావేశమయ్యారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్, సీతక్క, కొండా సురేఖ మినహా మిగతా మంత్రులు ఇందులో పాల్గొన్నారు. ఒక్కో మంత్రితో వేర్వేరుగా సుమారు 20 నిమిషాల పాటు సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ మాట్లాడారు. వారు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న డివిజన్లలో ప్రచారం తీరు ఎలా ఉంది? ఎక్కడెక్కడ వెనుకబడ్డాం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటనేది వివరించారు. డివిజన్లవారీగా సమీక్ష వివరాలను వారికి అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ రోజున ప్రతి ఓటరునూ బూత్‌కు తీసుకువచ్చి ఓటు వేయించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు ఈ ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకమని.. అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రచారానికి 4 రోజులే మిగిలినందున ఉదయం నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించాలన్నారు. ఓటర్లను నేరుగా కలిసి బీజేపీ, బీఆర్‌ఎస్‌ల ప్రచారాలను తిప్పి కొట్టాలని సూచించారు. ఆయా బస్తీలు, కాలనీల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీలు ఇవ్వాలని సూచించారు. అధిష్ఠానం కూడా ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుందని.. ప్రతి ఒక్కరి పనితీరుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటోందని వివరించారు.

## ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో 2 డయాలసిస్ యంత్రాలు

- 35 బోధనాస్పత్రుల్లో డయాలసిస్ యంత్రాల ఏర్పాటు
- సనత్ నగర్ టిమ్స్‌లో 10 బెడ్లతో కూడిన డయాలసిస్ సెంటర్
- ప్రతి 25 కి.మీకి ఒక డయాలసిస్ కేంద్రంపై వైద్యశాఖ కసరత్తు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర సమీక్షలో నిర్ణయం



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి (జీజీహెచ్) ఎమర్జెన్సీలో 2 డయాలసిస్ యంత్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 35 బోధనాస్పత్రులలోని ఎమర్జెన్సీ విభాగంలోనూ 2 డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులతో గురువారం జరిగిన సమీక్షలో ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెలలో సనత్‌నగర్‌లో ప్రారంభించే టిమ్స్‌లోనూ 10 బెడ్లతో కూడిన డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని 10 ప్రధాన ఆస్పత్రుల్లో 2 బెడ్లతో కూడిన డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే రాష్ట్రంలో 102 ప్రభుత్వ డయాలసిస్ సెంటర్లు ఉచితంగా రోగులకు సేవలు అందిస్తున్నాయి. రోజురోజుకూ డయాలసిస్ పేషంట్లు పెరుగుతుండటంతో మరో 80 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రతి 25 కి.మీ దూరానికో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడానికి మ్యాపింగ్ సిద్ధం చేస్తున్న అధికారులు.. త్వరలోనే కొత్త సెంటర్లను రోగులకు అందుబాటులోకి తేవడానికి కసరత్తు చేస్తున్నారు.

# సంపాదనలో ఆమె

**ఇప్పటివరకు 21వేలకు పైగా పలు యూనిట్లను స్థాపించిన మహిళలు**

'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద పలు సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం

సంస్థలు, దుకాణాలకు యజమానులుగా మహిళలు.. యూనిఫామ్‌లు కుట్టగా 7.96 కోట్ల ఆదాయం

### వీ-హబ్ విశ్వాసాన్ని నింపింది: శృతి



"మొదట్లో స్థానిక అవసరాలను తీర్చే స్థాయిలో మాత్రమే సాధారణ విక్రేతగా ఉన్నారు శృతి ఇనుగుర్తి. వర్చువల్ రియాలిటీ (వీఆర్) టెక్నాలజీ ఆధారంగా ఇప్పుడు ప్రీ-ఇంజనీరింగ్ డిజైన్‌లను రూపొందిస్తూ ఇండస్ట్రియల్ షెడ్లు, గిడ్డంగులు, నివాస, వాణిజ్య భవనాల ప్రాజెక్టులకు అందిస్తున్నారు. వీ-హబ్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ ఆమెకు వ్యాపార నిర్వహణ, కొత్త వ్యాపార నమూనాలపై శిక్షణ ఇచ్చి మార్గదర్శనం చేసింది. ఫలితంగా శ్రుతి ఇప్పుడు 'అహన్ మెటల్ సొల్యూషన్స్'కు యజమానురాలయ్యారు. "నా వ్యాపారాన్ని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లగలిగే నమ్మకాన్ని వీ-హబ్ నాలో నింపింది. వారిచ్చిన ఆత్మ విశ్వాసం, మార్గదర్శకత్వం, గుర్తింపు నా ఎదుగుదలకు సరైన ప్రోత్సాహాన్నిచ్చాయని చెప్పారు హైదరాబాద్‌కు చెందిన శృతి ఇనుగంటి"



### వారు సంపాదిస్తూ.. మరికొందరికి ఉపాధినిస్తూ..

"కరీంనగర్ జిల్లాలోని సీతారాంపురం ప్రాంతానికి చెందిన ఐదుగురు స్వయం సహాయక సంఘం సభ్యులు నెలకు ఒక్కొక్కరు రూ.23 వేలు సంపాదిస్తున్నారు. మరో 50 మందికి ఉపాధి అవకాశం కల్పిస్తున్నారు. స్వప్న ఇందిరా మహిళా శక్తి ఈవెంట్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌ను నెలకొల్పి.. ఈవెంట్ ప్లానర్, బ్యూటీషియన్, క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్, సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. దీనికి ఇందిరా మహిళా శక్తి పథకం తోడవ్వడం, వారికి రూ.10లక్షల రుణం లభించడంతో వ్యాపారం మరింత అభివృద్ధి చెందింది. ఫలితంగా ఆదాయం గడిస్తున్నారు

### గృహిణి నుంచి ఫుడ్ ట్రక్ ఓనర్‌గా..

"సాధారణ గృహిణి నుంచి ఇప్పుడు రోజుకు రూ.3 వేలు సంపాదించే వరకు ఎదిగారు వనపర్తి జిల్లాకు చెందిన రాధారాణి. గతంలో స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా చిన్నపాటి హోం కిచెన్‌ను నడిపిస్తూ జీవనోపాధి పొందేవారు. ప్రభుత్వం తరఫున మెప్మా నుంచి రూ.6 లక్షల పెట్టుబడి లభించడంతో 'ఇందిరా మహిళా శక్తి మీనాక్షి ఫుడ్ ట్రక్‌'ను ప్రారంభించారు. ఫలితంగా రోజుకు సుమారు రూ.3వేల సంపాదిస్తున్నారు.

### యూనిఫామ్‌లు కుట్టి.. 7.96 కోట్ల ఆదాయం

"రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఇందిరా మహిళా శక్తి స్టిచింగ్ సెంటర్ల'తో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థుకు అందించే యూనిఫామ్‌లు సరఫరా చేసే పని అప్పగించారు. ఇప్పటివరకు 10.61 లక్షల యూనిఫామ్‌లను కుట్టి సరఫరా చేయడంతో 17,381 ఎస్‌హెచ్‌జీల్లోని మహిళలకు రూ.7.96 కోట్ల ఆదాయం లభించింది. ఒక్కో యూనిఫామ్‌కు గతంలో రూ.50 చెల్లిస్తుండగా, ప్రజాప్రభుత్వం దానిని రూ.75కు పెంచడంతో మహిళల మరింత ఆదాయం లభిస్తోంది"

... ఈ మహిళలే కాదు.. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న చాలా మంది మహిళలు కూడా ఎంతో కొంత స్వశక్తితో సంపాదిస్తున్నారు. అన్ని రంగాలతో పాటు మహిళలను కూడా ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యంతోనే ఇది సాధ్యమవుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని కార్యక్రమాలను తీసుకురావడంతో పాటు వ్యాపారాల స్థాపనకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. 'ఆమె'ను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దేలా కృషి చేస్తోంది. మహిళా సాధికారతలో దేశానికే ఆదర్శంగా నిలిపేలా.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు కోటి మందిని కోటీశ్వరులుగా చేయాలని రాష్ట్రప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఎంఎస్‌ఎంఈ-2024పాలసీ, విద్యుత్ రాయితీలు, మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కుల కేటాయింపు, ప్రపంచ బ్యాంకు మద్దతుతో కొత్త ప్రోగ్రామ్‌లను రూపొందిస్తూ అమలు చేస్తోంది.

### 21,820 వ్యాపార యూనిట్ల స్థాపన..

రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద మహిళలకు ప్రోత్సాహన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా గార్మెంట్స్, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళలు, ఎలక్ట్రానిక్స్ సహా పలు రంగాల్లో ఇప్పటివరకు 83 ఎస్‌హెచ్‌జీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 181 మంది సభ్యులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు. అలాగే వీ-హబ్ మహిళా ఆక్సిలరేషన్ ప్రోగ్రామ్ ద్వారా వచ్చే నాలుగేళ్లలో 140 మహిళా యాజమాన్యాల ఆధ్వర్యంలోని స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఇప్పటికే 45 మంది మహిళలను ఎంపిక చేశారు. అలాగే రైజింగ్ అండ్ ఆక్సిలరేటింగ్ ఎంఎస్‌ఎంఈ పర్ఫామెన్స్ (ర్యాంప్)' కింద 56 స్వయం సహాయక సంఘాలకు, పలు స్టార్టప్‌లకు ప్ర భుత్వం అన్ని రకాల సహాయం అందించనుంది. కాగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా వ్యక్తిగత, సామూహికంగా కలిపి దాదాపు 21,820 వ్యాపార యూనిట్లు స్థాపించారు. వీటి ద్వారా లక్షల మంది మహిళలకు ఉపాధి లభిస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

-హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

## మరమ్మతులు చేయకుంటే బ్లాక్‌లిస్ట్‌లోకే..

**మేడిగడ్డపై ఎల్‌అండ్‌టీకి ప్రభుత్వం హెచ్చరిక**

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'కాళేశ్వరం'లోని మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ/మరమ్మతు పనులపై నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ- పీఈఎస్ జాయింట్ వెంచర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు చేసింది. బ్యారేజీ మరమ్మతు పనులు చేపట్టే విషయమై వారంలోపు అనుకూలంగా స్పందించకపోతే ఈ-ప్రొక్యూర్‌మెంట్‌తోపాటు ఇతర వేదికల్లో తదుపరి టెండర్లు వేయకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని తేల్చి చెప్పింది. టెండర్ ఒప్పందం ప్రకారం బ్యారేజీ మరమ్మతులు/పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని సర్కారు పేర్కొన్నది. దీనికి సిద్ధం కాకపోతే నిబంధనల ప్రకారం ఆ సంస్థపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను అమలు చేస్తామని స్పష్టం చేసింది. బ్యారేజీ నిర్మాణ కాంట్రాక్టు కోసం వేసిన టెండర్‌లో దాఖలు చేసిన ఈఎండీ సహా అన్ని డిపాజిట్లు, పెండింగ్ బిల్లులను జప్తు చేస్తామని హెచ్చరిస్తూ ఎల్ అండ్ టీ జనరల్ మేనేజర్ ఎస్.సురేశ్‌కుమార్, మేడిగడ్డ బ్యారేజీ ప్రాజెక్టు మేనేజర్‌లకు సూపరింటెండెంట్ ఇంజనీర్ (రామగుండం ఇరిగేషన్ సర్కిల్) ఎండీ దస్తగిర్ ఈనెల 3న లేఖ రాశారు. బ్యారేజీ నిర్మాణం పూర్తయిన 2019 నవంబరు, 2020 ఫిబ్రవరి, మే నెలల్లో దాని రక్షణ వ్యవస్థలన్నీ దెబ్బతిన్నాయి. ఈ విషయమై 5 సార్లు నోటీసులిచ్చినా... దెబ్బతిన్న బ్యారేజీలోని కాంపోనెంట్లను నిర్మాణ సంస్థ సరిచేయలేదని దస్తగిర్ గుర్తుచేశారు. బ్యారేజీ నిర్మాణం పూర్తయిన రెండేళ్లలోపు లోపాలను సవరించడంతోపాటు మరమ్మతులు (డిఫెక్ట్ లయబులిటీ కాలం) చేపట్టాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థదే అయినా ఉద్దేశపూర్వకంగా మరమ్మతులు చేయకుండా ఒప్పందంలోని నిబంధనలను అతిక్రమించిందన్నారు. పనులేవీ పూర్తిచేయకుండా బ్యారేజీ నిర్మాణం పూర్తయినట్లు, అదనపు పనులు, మరమ్మతులు చేయకుండానే చేసినట్లు అక్రమంగా పొందిన సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన తేల్చిచెప్పారు.

### ఎల్ అండ్ టీ నిర్లక్ష్యం వల్లే కుంగుబాటు

నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం వల్లే 2023 అక్టోబరు 21న మేడిగడ్డ ఏడో బ్లాకు 1.256 మీటర్ల మేర కిందికి కుంగిందని, ఆ మరునాడు (2023 అక్టోబరు 22) ఉన్నతాధికారులతో సమీక్ష తర్వాత బ్యారేజీ మరమ్మతులు తామే భరిస్తామని ఎల్ అండ్ టీ ప్రతినిధి సురేష్‌కుమార్ పత్రికా ప్రకటన చేశారని దస్తగిర్ తెలిపారు. బ్యారేజీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, మరమ్మతుల విషయంలో డిజైన్ లోపాలే కారణమని, డిజైన్ ప్రకారమే నిర్మించామని తప్పించుకునేందుకు ఆ సంస్థ ప్రయత్నించిందన్నారు. 2019లో రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్న వెంటనే సరిచేసి ఉంటే బ్యారేజీ వైఫల్యం జరిగేది కాదని, ఉద్దేశపూర్వకంగా ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరించడం, నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం వల్లే బ్యారేజీకి నష్టం జరిగిందని ఆయన గుర్తు చేశారు. తక్షణమే మేడిగడ్డ బ్యారేజీ పనులను చేపట్టడానికి వీలుగా పరీక్షలు చేస్తున్న కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థకు సహకరించాలని, దీనికోసం అవసరమైన సిబ్బంది, సామగ్రి, యంత్రాలను సమకూర్చాలని, లేనిపక్షంలో కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని తేల్చిచెప్పారు.

## మజ్లిస్ మెప్పు కోసం సీఎం పని చేస్తున్నారు

**ఆయన వ్యాఖ్యలపై స్పందించడం సమయం వృథా**

- సన్నబియ్యం పంపిణీ ఎలా ఆపుతారో మేం చూస్తాం
- కాళేశ్వరంపై విచారణకు రాహుల్‌గాంధీ నో చెప్పారు
- అందుకే సీబీఐకి అప్పగించి చేతులు దులుపుకొన్నారు
- బీఆర్‌ఎస్‌తో మాకు ఎలాంటి రహస్య ఒప్పందాలు లేవు
- 'మీట్ ది ప్రెస్'లో కిషన్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): "జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే సన్న బియ్యం ఆగిపోతాయని సీఎం రేవంత్ చెబుతున్నారు. బియ్యం పంపిణీ పథకంలో ప్రతి కిలోకు కేంద్రం రూ.42 రూపాయలు భరిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం భరించేది రూ.15 మాత్రమే. బియ్యం పంపిణీని ఎలా ఆపుతారో మేమూ చూస్తాం" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. మజ్లిస్ పార్టీ మెప్పు కోసం సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని విమర్శించారు. "రేవంత్.. పార్టీలన్నీ తిరిగి.. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు. చేతకాని వాళ్లు అనేకం మాట్లాడుతారు. అలాంటి వాటికి సమాధానం చెప్పి సమయం వృథా చేసుకోవడం నాకు ఇష్టం లేదు. వ్యక్తిగత విమర్శలతో కూడిన రేవంత్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోబోం" అని వ్యాఖ్యానించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొని, పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు రాహుల్ గాంధీ నో చెప్పడం వల్లే సీబీఐకి అప్పగించి చేతులు దులుపుకొన్నారని ధ్వజమెత్తారు. మిగతా అంశాలన్నీ పక్కనపెట్టి.. ఒక్క కాళేశ్వరం విచారణను మాత్రమే ఎందుకు అప్పగించారో సీఎం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య సత్సంబంధాలు ఉన్నాయనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో త్రిముఖ పోరు నెలకొందని, సర్వే ఫలితాలు నమ్మదగ్గట్టుగా లేవని వ్యాఖ్యానించారు. జనసేన పార్టీ ఇప్పటికే తమకు మద్దతు తెలపగా, టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు తమతో కలిసి పని చేస్తున్నారని వెల్లడించారు. బీఆర్‌ఎస్‌తో తమకు ఎలాంటి రహస్య ఒప్పందాలు లేవని, భవిష్యత్తులోనూ ఆ పార్టీతో ఎలాంటి పొత్తూ ఉండదని స్పష్టం చేశారు. తాను ఒక పార్టీకి అనుకూలంగా మాట్లాడానన్న ఆరోపణల్లో నిజం లేదని పేర్కొన్నారు. పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని దుయ్యబట్టారు. వేల కోట్లు ఖర్చు చేశామని బీఆర్‌ఎస్ చెబుతున్నా.. ఒక గ్రామ, మండల స్థాయి అభివృద్ధి కూడా అక్కడ కనిపించడం లేదని ధ్వజమెత్తారు. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే దారిలో నడుస్తోందన్నారు. నాలుగు ప్రధాన రోడ్లు పెద్దగా ఉన్నంత మాత్రాన ఆ ప్రాంతం అభివృద్ధి చెందినట్టు కాదని, బస్తీల్లో పరిస్థితి ఎలా ఉందనేదే ముఖ్యమని అన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని, కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. 1366కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్, 436కోట్లతో తార్నాకలో నేషనల్ సైన్స్ సిటీ, న్యూమింట్ మ్యూజియం, నేషనల్ ఎపిగ్రాఫిక్ మ్యూజియం, తెలంగాణ లిబరేషన్ వర్చువల్ మ్యూజియం పనులు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి, రాష్ట్రంలో అనేక సంస్థల స్థాపనకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో రూ.1.20లక్షల కోట్లతో రహదారుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలోని ముస్లింలను బీసీల్లో కలిపి.. రిజర్వేషన్లు కట్టబెడతామంటే ఎలా? అని ప్రశ్నించారు. సీసీఐ ఆధ్వర్యంలో మార్చి దాకా పత్తి కొంటామని, తేమ శాతం 12% మించకుండా చూసుకోవాలని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## పెట్టుబడి మోసాల బాధితుల్లో 22-38 ఏళ్ల వారే అధికం

**రాష్ట్రవ్యాప్తంగా సీఎస్‌బీ అవగాహన కార్యక్రమాలు**

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృత దివాస్ నిర్వహించారు. ప్రధానంగా వ్యాపారంలో పెట్టుబడులు, ట్రేడింగ్‌పై దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన సైబర్ కేసుల్లో 26% పెట్టుబడి మోసాలకు సంబంధించినవి కాగా 66% ఆర్థిక మోసాలకు సంబంధించి ఉన్నాయని సీఎస్‌బీ అధికారులు తెలిపారు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్, టెలిగ్రాం, వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో మార్కెట్ ఎక్స్‌పర్ట్‌గా నటిస్తూ ప్రత్యేకంగా గ్రూపులు తయారు చేసి మోసాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే పెట్టుబడి సలహాలను నమ్మి మోసపోవద్దని సీఎస్‌బీ అధికారులు సూచించారు. బాధితుల్లో ఎక్కువగా 22-38 ఏళ్ల వయస్సు ఉన్నవారే ఎక్కువగా ఉంటున్నారని, ప్రైవేటు ఉద్యోగస్తులు 33%, విద్యార్థులు 19%, గృహిణిలు 12% ఉన్నట్లు అధికారులు వివరించారు. సైబర్ జాగృక్త దివస్ సందర్భంగా ఈ తరహా మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పార్కులు, క్రీడా మైదానాలు, మార్నింగ్ వాకింగ్ ప్రదేశాలు, విద్యాసంస్థలు, కాలనీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా పెట్టుబడి మోసాలకు గురైతే సీఎస్‌బీ హెల్ప్‌లైన్ 1930కి సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు పెట్టుబడి, ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే లింకులను నమ్మి మోసపోవద్దని సీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ ఒక ప్రకటనలో తెలిపారు.



రహమత్‌నగర్‌లో ఇంటింటి ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి

## అసెంబ్లీకే రాని కేసీఆర్.. అధికారంలోకి ఎలా వస్తాడు?

- బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే గోస పడతారు
- కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి
- ఒక్క పీవీ ఎక్స్‌ప్రెస్ వే ఫ్లైఓవర్ 50 ఫ్లైఓవర్లతో సమానం
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకే రాని కేసీఆర్ రెండేళ్లలో అధికారంలోకి ఎలా వస్తాడని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల సెంటిమెంట్ మాటలు నమ్మితే గోస పడతారంటూ ప్రజలను హెచ్చరించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా రహమత్‌నగర్ డివిజన్‌లో మంత్రి కోమటిరెడ్డి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే సంక్షేమం, అభివృద్ధి అని, పేదలను కడుపులో పెట్టుకొని కాపాడే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. బస్తీల్లోని పేదలకు మంచి జరగాలంటే నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు. అసలైన సర్వేలన్నీ కాంగ్రెస్ గెలవడం ఖాయమని చెబుతుండడంతో బీఆర్ఎస్ నేతలు నైరాశ్యంతో మాట్లాడుతున్నారని, వారి మోసపు మాటలు నమ్మొద్దని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ మహానగర సమగ్ర అభివృద్ధి జరిగిందని పునరుద్ఘాటించారు. ఏమైనా అంటే ఫ్లైఓవర్లు నిర్మించామని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన 14కి.మీ పీవీ ఎక్స్‌ప్రెస్ వే ఫ్లైఓవర్.. 50 ఫ్లై ఓవర్లతో సమానమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఏడెనిమిది చిన్న ఫ్లైఓవర్లు నిర్మించి గొప్పలు చెబుతోందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతల సెంటిమెంట్ మాటలు నమ్మి మోసపోతే.. గోస పడతారని, ఆలోచన చేయాలని ఓటర్లను కోరారు. కంటోన్మెంట్‌లో జరుగుతున్న దానికి రెట్టింపు అభివృద్ధి జూబ్లీహిల్స్‌లో చేస్తామని స్థానిక ప్రజలకు కోమటిరెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



కొల్లూరులో కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## బీఆర్ఎస్‌కు ఓటువేస్తే బీజేపీకి వేసినట్లే

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్య

రామచంద్రాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. కొల్లూరు డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లతో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో 67వేల కొత్త రేషన్ కార్డులిచ్చామన్నారు. 200 యూనిట్ల లోపు వాడే పేదలకు ఉచిత కరెంట్ ఇస్తామని, రూ.2.4కోట్ల నీటి బిల్లులను ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, స్టేట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ శివసేనారెడ్డి, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిష్పక్షపాతంగా జరిగేలా చూడండి

- పోలింగ్ స్టేషన్లలో ప్రత్యక్ష వెబ్ కాస్టింగ్ పెట్టండి
- జూబ్లీహిల్స్‌కు కేంద్ర బలగాలను తరలించండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ వినతి

న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నిష్పక్షపాతంగా పోలింగ్ జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని బీఆర్ఎస్ కోరింది. ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు అధికార కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందని ఫిర్యాదు చేసింది. గురువారం న్యూఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేష్ రెడ్డి, ఎంపీలు దామోదర్ రావు, పార్థసారధి రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఆరురోజులుగా ప్రచారం చేస్తున్నారు. మంత్రివర్గమంతా అక్కడే ఉంది. ముస్లిం ఓట్లు ఎక్కువగా ఉండడంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కానీ అజారుద్దీన్‌కు మంత్రిగా అవకాశం కల్పించారు. హోం మంత్రిత్వ శాఖ కూడా సీఎం వద్దే ఉంది. అందుకే.. ఆయన పోలీసు వ్యవస్థ ద్వారా స్థానిక బీఆర్ఎస్ నాయకులను బెదిరింపులకు గురిచేస్తున్నారు. అక్రమ కేసులతో వేధిస్తున్నారు. మున్సిపల్ అధికారులతో నోటీసులు ఇప్పిస్తున్నారు. భయానక పరిస్థితి కల్పిస్తున్నారు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ రిగ్గింగ్, అక్రమాలు చేయాలని చూస్తోంది. ముస్లిం ఓట్లు ఎక్కువగా ఉండడం, బుర్ఖా ధరించే సంప్రదాయం ఉండడాన్ని అవకాశంగా భావించి డజన్ల కొద్దీ మహిళలను కాంగ్రెస్ ముందే తరలించింది. వారితో రిగ్గింగ్ చేయించాలని చూస్తోంది. తెలంగాణ ప్రధాన ఎన్నిక అధికారికి చెబితే పట్టించుకోవడం లేదు. రిగ్గింగ్, హింస జరగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది' అని ఆ లేఖలో పేర్కొన్నారు. 'తక్షణమే కేంద్ర బలగాలను జూబ్లీహిల్స్‌కు తరలించండి. అన్ని పోలింగ్ స్టేషన్లలో కేంద్రం పర్యవేక్షణలో సీసీ టీవీ కెమెరాలు, ప్రత్యక్ష వెబ్‌కాస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయండి. ఫంక్షన్ హాళ్లు, లాడ్జిలు, నివాసాలపై ప్రత్యేక నిఘా ఉంచండి. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, ధైర్యంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే వాతావరణం కల్పించండి' అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని బీఆర్ఎస్ ఆ లేఖలో కోరింది.

### మా ఫిర్యాదులపై సీఈవో స్పందించడంలేదు: వినోద్‌కుమార్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాలు కోడ్‌ను ఉల్లంఘించేలా ఉన్నాయని బీఆర్ఎస్ తరఫున చేసిన ఫిర్యాదులపై సీఈవో సుదర్శన్‌రెడ్డి స్పందించడం లేదని ఆ పార్టీ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే పథకాలు బంద్‌అవుతాయని సీఎం అనడం, బీఆర్ఎస్‌కు ఓటేస్తే జూబ్లీహిల్స్‌కు రానని అజారుద్దీన్ అనడం కోడ్ ఉల్లంఘన కాదా? అని ప్రశ్నించారు. ఇటీవల బీఆర్ఎస్ ప్రతినిధులు చేసిన ఫిర్యాదులపై స్పందించకుండా కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాత వైఖరితో పనిచేస్తోందని ఆరోపించారు. తమ ఫిర్యాదులపై ఈసీఐ తక్షణం స్పందించాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.

## ఇన్‌చార్జి మంత్రిగా జూబ్లీహిల్స్ బాధ్యత నాది

- స్థానికుడు, విద్యావంతుడైన నవీన్‌ను గెలిపించాలి
- ఉప ఎన్నిక ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికుడు, విద్యావంతుడని, అతడిని గెలిపించుకుంటే జూబ్లీహిల్స్ అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా జూబ్లీహిల్స్ అభివృద్ధి బాధ్యత తనదని అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లోని శ్రీకృష్ణ నగర్‌లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ.. నవీన్ యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కొకరికి 6కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తోపాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామని గుర్తు చేశారు. వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తూ మహిళలకు భరోసా కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం కాపు సంఘం నాయకుల నివాసంలో అల్పాహార సమావేశంలో పాల్గొన్నారు. నవీన్ యాదవ్‌కు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించిన కాపు నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కంటోన్మెంట్ మాదిరిగానే.. జూబ్లీహిల్స్‌లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. కాగా, బీఆర్ఎస్ బలం తగ్గిపోవడంతో ఫేక్ సర్వేలు చేయిస్తోందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, బీజేపీ దొంగ పార్టీలని, వాటిని నమ్మొద్దని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి కోసం బీజేపీ పనిచేస్తోందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ ఆరోపించారు. ఫేక్ సర్వేలతో ప్రజల అభిప్రాయం మారదని, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# మాగంటి చావుకు కారణం కేటీఆరే

(మొదటిపేజీ తరువాయి)



థర్డ్ డిగ్రీ ప్రయోగించాలని, అప్పుడు అసలు విషయం బయటపడుతుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భాగంగా ఆయన గురువారం రాత్రి బోరబండలో రోడ్డు షో నిర్వహించారు. "కేసీఆర్ మూర్ఖుడైతే ఆయన కుమారుడు ఇంకా మూర్ఖుడు" అంటూ బండి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ మళ్లీ సీఎం అవ్వాలని కేటీఆర్‌కు లేదని ఆరోపించారు. ఎప్పుడెప్పుడు గద్దెనెక్కుతానా? అని కేటీఆర్ చూస్తున్నారని, ఆయనకు వావివారుసలు లేవని..ముసలిముతకా అన్న తేడాలు లేవని, సీఎం పదవి చేపట్టేందుకు ఆయన ఏమైనా చేస్తారని ఆరోపించారు. అన్నదమ్ముల గురించి పట్టించుకోవొద్దని కవితకు సూచించారు. "తల్లిదండ్రులను కుమారులు పట్టించుకోరు. కూతుళ్లే చూస్తారని, కవితక్కా.. అప్పుడప్పుడు తండ్రి దగ్గరికి పోయి బాగోగులు చూసుకుంటూ ఉండు" అని సూచించారు. కేసీఆర్‌పై కొట్లాడింది.. ఆయన్ను ఫామ్‌హౌస్‌కు పరిమితం చేసింది తామేనన్నారు. "రాష్ట్రంలో ఏనుగులు తినేటోడు పోయి పీనుగలు పీక్క తినేటోడు వచ్చిండు" అంటూ రేవంత్‌రెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగితే రూ.9 వేల కోట్ల మేర అవినీతిపైనే సీబీఐ విచారణ ఎందుకు కోరినట్లు? రూ.లక్ష కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అని రేవంత్‌కు సవాల్ చేశారు. రావు వచ్చినా, రెడ్డి వచ్చినా మేం చెప్పినట్లు వినాల్సిందేనని ఒవైసీ చెప్పినా.. పౌరుషం లేని దద్దమ్మలు కాంగ్రెసోళ్లు అని విమర్శించారు. తెలంగాణను ఇస్లాం రాజ్యంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారని, దీనిపై హిందువులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో గెలిస్తే, తెలంగాణలో చాలాచోట్ల కాషాయ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. టోపీ పెట్టుకున్న రేవంత్‌ను చూస్తే తనకు సినీనటుడు వేణుమాధవ్ గుర్తుకొచ్చారని, అజారుద్దీన్ చేత 'వక్రతుండ మహాకాయ..' అని గణపతి శ్లోకం చదవించే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఒవైసీ సోదరులను భాగ్యలక్ష్మి ఆలయానికి తీసుకుపోయి.. వారికి బొట్టు పెట్టించి వారితో అమ్మవారి పాట పాడించే దమ్ముందా? అని ప్రశ్నించారు. తాను టోపీ పెట్టుకునే రోజు వస్తే తల నరుక్కుంటానని చెప్పారు. "నేను హిందువును... టోపీ పెట్టి, దొంగ నమాజ్ చేసి ఇతర మతాలను కించపర్చను" అని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే మజ్లిస్ వాళ్లు అన్నీ ఎత్తుకొని పోతారని.. మజ్లిస్ రాజ్యం వస్తే ప్రజలు బిచ్చగాళ్లు అవుతారని హెచ్చరించారు. మజ్లిస్ నేతలు చైన్ స్నాచర్లు అని, వాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీ గెలిస్తే.. ఆడవాళ్ల మెడలోని మంగళసూత్రాలు కూడా గుంజుకుపోతారని హెచ్చరించారు. పహెల్గాంలో ఉగ్రవాదులు మగవాళ్ల లోదుస్తులను విప్పదీసి.. హిందువులుగా నిర్ధారించుకొని చంపేశారని.. పాకిస్థాన్‌కు మద్దతు పలికేవారు నిజమైన హిందువులేనా? అనే విషయాన్ని ఒకసారి చెక్ చేసుకోవాలని పేర్కొన్నారు. చార్మినార్‌పై కాషాయ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమన్నారు. "గతంలో చార్మినార్‌కు రానివ్వబోమని హెచ్చరించారు. అయినా బాగ్యలక్ష్మికి ఆలయానికి నే వెళ్లలేదా?" అని ప్రశ్నించారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తానని ఎన్నికల్లో రేవంత్ వాగ్దానం చేశారని.. కేసీఆర్‌ను జైలుకు పంపిస్తాననీ చెప్పారని, అయితే ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. రేవంత్, కేసీఆర్ ఒకటేనని.. కలిసి రూ.లక్ష కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. పాకిస్థాన్ నుంచి దొంగ ఓట్లు వేయించడానికి ప్రణాళిక వేశారని ఆరోపించారు. అందరికీ రాజ్యాంగం ఒక్కటేనని, బూత్‌లో ఓటరు ముఖం చెక్ చేసుకున్నాకే లోపలికి అనుమతించాలని పేర్కొన్నారు. బోరబండలో బీఆర్ఎస్ ఏం అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. రోడ్డు వెడల్పు చేయలేదని.. పేదోళ్ల ఇళ్లు కూల్చారని ఆరోపించారు. బోరబండ వాసులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేవని, ఓట్లు కోసం వస్తే బీఆర్ఎస్ వాళ్లను నిలదీయాలని సూచించారు.




### అనుమతి లేదని ప్రచారం.. తర్వాత అంతా సాఫీగా

బోరబండలో గురువారం బండి సంజయ్ తలపెట్టిన రోడ్ షో కోసం అనుమతి లేదని, ర్యాలీ కోసం ఆయనకు ఇచ్చిన అనుమతి రద్దయిందంటూ తొలుత ప్రచారం జరిగింది. ఈ పరిణామంపై బీజేపీ నేతలు మండిపడ్డారు. రోడ్ షోకు అనుమతి ఉన్నా.. లేకపోయినా తాను బోరబండ వస్తున్నానంటూ బండి సంజయ్ ప్రకటించారు. దీంతో ర్యాలీ నిర్వహణకు అనుమతి ఇస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు.

## ప్రచారం చేయలేక.. మౌనంగా ఉండలేక!

- ఇబ్బందికర పరిస్థితుల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్ తరఫున ప్రచారంలో పాల్గొనలేని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. పార్టీ ఫిరాయింపుల కేసు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచి.. కాంగ్రెస్‌లో చేరినట్లు చెబుతున్న వీరంతా ఉప ఎన్నికలో ఏ పార్టీ తరఫునా ప్రచారం చేయలేని స్థితిలో ఉన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, ఫిరాయింపుపై స్పీకర్ నిర్ణయం పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎక్కడా వీరు కనిపించడం లేదు. ఆ ఎమ్మెల్యేలు గతంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఫొటోలు, వీడియోలు, ఇతర ఆధారాలను కూడా కోర్టులో సమర్పించింది. అయితే అవి కాంగ్రెస్ కండువాలు కాదని ఆ ఎమ్మెల్యేలు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటు బహిరంగంగా కాంగ్రెస్ తరఫున ప్రచారం చేయలేక, అటు బీఆర్ఎస్ వెంట వెళ్లలేక మౌనంగా ఉండిపోతున్నారు. కానీ, గుట్టుచప్పుడు కాకుండా వారు ప్రచారం చేస్తున్నట్లు, బస్తీ, కులసంఘాల నాయకులతో రహస్య సమావేశాలు నిర్వహిస్తూ ఫలానా పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నట్టు సమాచారం. మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు.. తమ ప్రజాప్రతినిధులను, నేతలను నియోజకవర్గంలో మోహరించాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లను కాంగ్రెస్ రంగంలోకి దించగా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ బాధ్యతలు అప్పగించింది. పార్టీ మారినట్టు ప్రచారం జరుగుతున్న ఆ ఎమ్మెల్యేలు మాత్రం ఇందుకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రచారంలో ఎక్కడా కనిపించకపోగా.. బీఆర్ఎస్‌తోనైతే తిరిగి పార్టీలోకి వెళ్లలేనంత దూరాన్ని మెయింటెయిన్ చేస్తున్నారు.

### సంఘాల నేతలతో రహస్య సమావేశాలు..

గ్రేటర్ పరిధిలో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. అందులో నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరిలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారడంతోపాటు పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ కూడా చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన దానం.. ఆ తరువాత కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కానీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రచార జాబితాలో మాత్రం ఆయన పేరు లేదు. ప్రచారంలోనూ కనిపించడం లేదు. కానీ, జూబ్లీహిల్స్‌కు చెందిన ముఖ్యమైన నేతలతో సమావేశాలు జరుపుతున్నట్లు తెలిసింది. ఇక శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సీఎం రేవంత్‌తో జరిగిన కమ్మ సంఘం సమావేశంలో పాల్గొన్నారు.



## హరీశ్.. వర్క్‌ఫ్రం హోం

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించుకోవడం బీఆర్ఎస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. దీంతో విజయ సాధనకు పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో.. ఏ ఎన్నికల్లోనైనా పార్టీలో కీలక పాత్ర పోషించే దీటైన వ్యూహకర్త.. తాను స్వయంగా విజేతగా నిలవడంతో పాటు తమ అభ్యర్థులను సైతం గెలిపించుకోవడంలోనూ చాతుర్యం చూపే మాజీ మంత్రి హరీశ్‌రావు ఈసారి ప్రచారం రంగంలో లేకపోవడం పార్టీకి లోటుగా మారింది. కొన్ని రోజుల క్రితం ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నేరుగా ప్రచారంలో పాల్గొనలేక పోయినా.. కొద్ది రోజులు గడవడంతో.. ఒకవైపు తనను పరామర్శించేందుకు వచ్చేవారితో మాట్లాడుతూ.. మరోవైపు తన ఇంట్లోనే ముఖ్యనేతలతో సమావేశమవుతున్నారు. పార్టీ నిర్వహించిన, ఇతరులు చేసిన సర్వేల సమాచారాన్ని క్రోడీకరిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ ఎక్కడ, ఎందుకు వెనుకబడి ఉందో అంచనా వేస్తున్నారు. ప్రతి 100 ఓట్లకు ఓ ప్రతినిధిని, వారితో సమన్వయానికి పోలింగ్‌బూత్‌లు, డివిజన్ల వారీగా స్థానిక సీనియర్ నేతలను పార్టీ నియమించింది. వీరందరినీ సమన్వయం చేసుకొని ఓటర్లను ఆకట్టుకోవాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని.. హరీశ్‌రావు తనవద్ద ఉన్న సమాచారం ఆధారంగా శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ దశ దిన కర్మ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి హరీశ్ ప్రచార పర్వంలోకివస్తారని పార్టీశ్రేణులు పేర్కొంటున్నాయి.

### ముస్లింలను అవమానించిన రేవంత్‌పై చర్యలు తీసుకోండి

- సీఈఓకు బీఆర్ఎస్ నేతల విజ్ఞప్తి

కాంగ్రెస్ పార్టీ ఉంటేనే ముస్లింలు ఉంటారంటూ.. పరోక్షంగా ఆ వర్గాన్ని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## జూబ్లీహిల్స్ ఫలితం.. ప్రభుత్వంపై

# రెఫరెండమే

(మొదటిపేజీ తరువాయి)



విమర్శించారు. గత ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్ 16 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారని, ఇప్పుడు అంతకన్నా ఎక్కువ మెజారిటీతో బీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటూ గెలవని అంశాన్ని ప్రస్తావించగా.. పార్లమెంటు ఎన్నికల్లో మొత్తం దేశం మోదీకి వ్యతిరేకమా, అనుకూలమా అన్నట్టు చీలిపోయిందని, ఎన్డీయేలోగానీ, ఇండి కూటమిలోగాని లేని పార్టీలకు సీట్లు రాలేదని కేటీఆర్ చెప్పారు.

### కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయి..

రాష్ట్రంలో బీజేపీ రెండేళ్లుగా కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. "బీజేపీ ఒక్క సమస్యపై అయినా పోరాటం చేసిందా? బీజేపీ జైల్లో పెట్టినది మా నాయకులను. మా నాయకురాలు కవిత మీదే ఈడీ దాడులు జరిగాయి. అప్పుడు ఆమె మా నాయకురాలు. ఇప్పుడు కాదు. మరి పొంగులేటి మీద ఈడీ దాడులు జరిగితే కిషన్‌రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. సీబీఐని రాహుల్‌గాంధీ రోజూ తిడతారు. కానీ రేవంత్‌రెడ్డి సీబీఐకి కేసులను అప్పగిస్తారు. రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ అంటారు. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని అమిత్‌షా అంటారు. కానీ కేసులు ఉండవు. రేవంత్‌రెడ్డి బావ మరిదికి కేంద్ర అమృత్ పథకంలో రూ.1,150 కోట్ల కాంట్రాక్టు వస్తుంది. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే బీజేపీ ఎంపీలకు రెడ్ కార్పెట్లు పరిచి స్వాగతాలు పలుకుతున్నారు. అదానీకి స్వాగతం పలుకుతున్నారు. చోటా భాయ్, బడా భాయ్ సంబంధం ప్రజలకు అర్థమైంది" అని పేర్కొన్నారు. అసలు ఇప్పుడున్నది కల్తీ కాంగ్రెస్ అని, ఇదొక కాషాయ, పంచకూట కూటమి అని విమర్శించారు. బీజేపీ కూడా కాంగ్రెస్‌కు సహాయపడేందుకే జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తోందని.. నిన్న మొన్నటి వరకు పత్తా లేని బండి సంజయ్ ఈ రోజు హిందూ, ముస్లిం అంటూ గావుకేకలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. కిషన్‌రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కాదని, రేవంత్‌రెడ్డికి సహాయ మంత్రి అని విమర్శించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ కాంగ్రెస్ అభ్యర్థికి సహాయం చేసి, బీజేపీ అభ్యర్థిని బకరా చేసి పోతారని ఎద్దేవా చేశారు. అయితే రాహుల్ గాంధీకి బానిస అయిన కేసీ వేణుగోపాల్‌కు బానిసలా రేవంత్ పరిస్థితి ఉందని..అందుకే బీజేపీతో చీకటి ఒప్పందాలే తప్ప... కేంద్రంతో గట్టిగా మాట్లాడి నిధులు తెచ్చుకోలేని పరిస్థితి నెలకొందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

### టీడీపీ సానుభూతిపరులు బీఆర్ఎస్ వైపే

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ సానుభూతిపరులు మాగంటి సునీతకే మద్దతుగా నిలుస్తారని, బీఆర్ఎస్‌కు ఓటేస్తారని భావిస్తున్నట్టు కేటీఆర్ చెప్పారు. ఎన్టీఆర్, పీజేఆర్ విగ్రహాలు పెడతామంటూ కాంగ్రెస్ చెప్పడం దారుణమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని గుర్తు చేశారు. తమ కుటుంబం కూడా కాంగ్రెస్‌కు వ్యతిరేకమేనని చెప్పారు. పీజేఆర్ మీద ఇప్పుడు ప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్ ఆయన కుమారుడికి జూబ్లీహిల్స్‌లోగానీ, ఖైరతాబాద్‌లోగానీ టికెట్ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఒంటరిగా పోరాడుతోందని, మిగతా పార్టీలన్నీ గుంపుగా తమ మీద పోటీపడుతున్నాయని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ మద్దతు ఉన్నా.. ముస్లింల ఓట్లలో అత్యధికం బీఆర్ఎస్‌కే పడతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఫార్ములా-ఈ కేసులో అవినీతి ఏమీలేకపోయినా ఏదో చేయాలని చూశారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చూపేందుకు రేవంత్‌రెడ్డి ఎన్నో విఫల ప్రయత్నాలు చేశారని విమర్శించారు. తాము అయితే విధానపరమైన అంశాలపైనే విమర్శలు, ప్రతి విమర్శలు చేస్తామన్నారు.

## అబద్ధాలు చెప్పడంలో బీఆర్ఎస్, బీజేపీ పోటీ!

- జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి వ్యాఖ్య
- మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు తథ్యమని తెలిసి బీఆర్ఎస్, బీజేపీ అబద్ధాలతో పోటీపడుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. మంత్రి సమక్షంలో రెహ్మత్‌నగర్ డివిజన్‌లోని వివిధ పార్టీలకు చెందిన వందలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు, బీఆర్ఎస్ అబద్ధాలకు మధ్య జరుగుతున్న యుద్ధమని పొంగులేటి చెప్పారు. గత పదేళ్లలో ఈ నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన బీఆర్ఎస్ ఇప్పుడు వేలాది కోట్లు ఖర్చు చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిలో భాగంగా ఇప్పుడు నియోజకవర్గంలో రూ.400 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని, 14వేల కొత్త రేషన్ కార్డులు వచ్చాయని చెప్పారు. సన్నబియ్యంలో సగం ఖర్చు కేంద్రానిదే అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెబుతున్నారని, అలాంటప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు సన్నబియ్యం ఇవ్వడం లేదని పొంగులేటి ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ చెప్పే అవాస్తవాలను ప్రజలు నమ్మరని, ఈనెల 11న జరిగే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన రహ్మత్ నగర్ డివిజన్ యువకులు

## చట్టాన్నే కాదు.. దాని ఆత్మనూ అర్థం చేసుకోవాలి

- 'సేవతో గౌరవం పొందడం'.. ఇదే మన నినాదం
- ప్రొబేషనరీ డీఎస్పీలతో డీజీపీ శివధర్ రెడ్డి



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో తెలంగాణ పోలీసు శాఖ ప్రథమ స్థానంలో ఉందని ఆ స్థాయిని నిలుపుకోవలసిన బాధ్యత ప్రొబేషనరీ డీఎస్పీలపై ఉందని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర పోలీసు శిక్షణా కేంద్రం (టీఎస్‌పీఏ)లో 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలకు గురువారం శిక్షణ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ మాట్లాడుతూ... పోలీసు అధికారిగా కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాకుండా దాని ఆత్మను అర్థం చేసుకోవాలని సూచించారు. నిష్పాక్షికత, ఓర్పు, సానుభూతి వంటి విలువలే ఒక అధికారిని ఉత్తమంగా తీర్చిదిద్దుతాయన్నారు. ఈ బ్యాచ్‌లో 38 మంది మహిళా అధికారులు ఉండటం గర్వకారణమని, గౌరవం, సమానత్వం ఇక్కడి నుంచే ప్రారంభమవ్వాలని సూచించారు. 'సేవతో గౌరవం పొందడం' మన నినాదమని తెలిపారు. ఈ సందర్భంగా సిలబస్ కాపీలను డీజీపీ ఆవిష్కరించారు.

## కరెంటోళ్ల ప్రజాబాట ప్రారంభం

- వారంలో మూడురోజులు ప్రజల వద్దకే

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వినియోగదారుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించడానికి వీలుగా దక్షిణ డిస్కమ్ (టీజీఎస్పీడీసీఎల్) 'కరెంటోళ్ల ప్రజాబాట' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఉమ్మడి నల్గొండ, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో వారంలో ప్రతి మంగళవారం, గురు, శనివారాల్లో అధికారులంతా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం కింద పర్యటించనున్నారు. దీన్ని బుధవారం వికారాబాద్ జిల్లా పరిగిలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. వారంలో మూడురోజులు ఉదయం 8 గంటల నుంచి 10:30 గంటల దాకా కిందిస్థాయి సిబ్బంది నుంచి చీఫ్ ఇంజనీర్లు, డైరెక్టర్ల దాకా సంస్థలో ఉన్న 9,500 మంది సిబ్బంది నెట్‌వర్క్‌ను పరిశీలిస్తారని సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూకీ చెప్పారు.

## రూ.4కోట్ల స్థలం వ్యవసాయ శాఖకు అప్పగింత

- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఉదారత



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎం.కోదండరెడ్డి

యాచారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారంలో ఉన్న రూ.4 కోట్ల విలువైన సొంత స్థలం, అందులో నిర్మించిన భవనాన్ని జిల్లా వ్యవసాయశాఖకు గురువారం రిజిస్ట్రేషన్ చేశారు. మండల కేంద్రంలో పదేళ్ల క్రితం ఎం.కోదండరెడ్డి 400గజాల స్థలాన్ని కొనుగోలు చేసి అందులో ఓ భవనాన్ని నిర్మించుకున్నారు. ఈ స్థలాన్నే, అధికారులు కొన్నేళ్లుగా ధాన్యం కొనుగోలు కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. ఈ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తే రైతులకు మరింత ప్రయోజనం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోదండరెడ్డి తెలిపారు. ఏడీఏ సుజాత, ఏవో రవినాథ్.. కోదండరెడ్డిని సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

## 'ఆంధ్రా కురియన్' మండవ జానకిరామయ్య కన్నుమూత



జానకిరామయ్య

గన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య (94) కన్నుమూశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన అవుటపల్లి ఋషి వాటికలోని ఆయన స్వగృహంలో గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో 1992లో రెండో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జానకిరామయ్య.. స్వల్పకాలంలోనే సంస్థను లాభాల బాట పట్టించారు. 27 ఏళ్ల పాటు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించి సంస్థను ప్రగతిపథంలో నడిపించారు. 2009 నుంచి రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధర ఇవ్వడంతో పాటు రైతులకు బోనస్‌లు పంపిణీ చేసింది జానకిరామయ్యే. ఆయన సేవలను గుర్తించిన ఇండియన్ డెయిరి అసోసియేషన్.. దేశంలో పాల విప్లవం తెచ్చిన కేరళకు చెందిన వర్గీస్ కురియన్ అవార్డుతో ఆయనను సత్కరించింది. అందుకే జానకిరామయ్యను ఆంధ్రా కురియన్‌గా పిలుస్తారు..

## మయన్మార్ నుంచి స్వదేశానికి 270 మంది

- 12 మందికి తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లు

న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ మయవాడీలోని సైబర్ నేరాల శిబిరాల్లో చిక్కుకున్న అనేక మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా 270 మందిని అధికారులు వాయుసేనకు చెందిన రెండు విమానాల్లో స్వదేశానికి తరలించారు. గురువారం ఆ విమానం ఉత్తరప్రదేశ్‌లోని హిందన్ ఎయిర్‌బేస్‌కు చేరుకుంది. అందులో తెలంగాణకు చెందిన 12 మంది ఉన్నారు. వీరికి తెలంగాణ భవన్‌లో ఆశ్రయం, ఆహారం, రవాణా తదితర ఏర్పాట్లు చేశారు. తదుపరి ఆదేశాలు అందేవరకు ఆ 12 మంది తెలంగాణ భవన్ అధికారుల ఆధీనంలోనే ఉంటారు.



రక్తదానం చేస్తున్న శ్రీచైతన్య ఉద్యోగులు

## శ్రీచైతన్య ఉద్యోగుల రక్తదానం

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన వేడుకల సందర్భంగా సంస్థ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ వేడుకలు గురువారం దేశవ్యాప్తంగా అన్ని శ్రీచైతన్య కాలేజీల్లో జరిగాయి. మొత్తం 3,127 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మియాపూర్‌లోని క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొని చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా ఉద్యోగులు రక్తదానం చేయడంపై అభినందించారు. దేశవ్యాప్తంగా రక్తం కొరత తీవ్రంగా ఉందని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా లక్షలాది మంది విద్యార్థులను ఐఐటీయన్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, సివిల్ సర్వెంట్లుగా తీర్చిదిద్దడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. విజయవాడలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శ్రీచైతన్య డైరెక్టర్ టి.నాగేంద్రకుమార్ ప్రారంభించారు.

# కుటుంబ కథా చిత్రమ్!

**మాగంటి గోపీనాథ్ వారసత్వంపై వివాదం.. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ**

- నాన్న అంతిమ సంస్కారాలకు రావద్దని నన్ను బెదిరించారు
- వాళ్లెవరో తర్వాత చెప్తా.. నా వద్ద కాల్‌లాగ్స్ ఉన్నాయి: ప్రద్యుమ్న
- నా కుమారుడు ఆస్పత్రిలో ఉన్నప్పుడు నన్ను చూడనివ్వలేదు
- కేటీఆర్‌కు చెప్పినా పట్టించుకోలేదు
- ఆయన వచ్చేవరకూ గోపీ మరణాన్ని ధ్రువీకరించలేదు: తల్లి మహానందకుమారి



తన న్యాయవాదితో గోపీనాథ్ కుమార్తె దిశిర



మాలినీదేవి, తారక్ ప్రద్యుమ్న

హైదరాబాద్ సిటీ/గచ్చిబౌలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కన్నుమూసిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వారసత్వానికి సంబంధించిన వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఆయనకు అసలైన వారసులం తామేనని.. గోపీనాథ్ మొదటి భార్య మాలినిదేవి, కుమారుడు తారక్ ప్రద్యుమ్న తెలిపారు. గతంలోనే దీనిపై రంగారెడ్డి కలెక్టర్‌కు గోపీనాథ్ తల్లి మహానందకుమారి ఫిర్యాదు చేయగా.. మాలినిదేవి శేరిలింగంపల్లి తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహశీల్దార్ వెంకారెడ్డి.. గతంలో మాగంటి సునీత, కూతుర్లు అక్షర, దిశిర, కొడుకు వాత్సల్యకు ఇచ్చిన లీగర్ హెయిర్ సర్టిఫికెట్‌ను పక్కనపెట్టినట్టు తెలిపారు. విచారణకు హాజరు కావాలని ఇరుపక్షాలకూ నోటీసులిచ్చారు. ఈ మేరకు గురువారం జరిగిన విచారణకు మొదటి భార్య మాలినిదేవి, తారక్.. రెండో భార్య సునీత కుమార్తె దిశిర తమ న్యాయవాదితో కలిసి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. గోపీనాథ్ తల్లి మహానందకుమారి కూడా మాలినీదేవికి మద్దతుగా విచారణలో పాల్గొన్నారు. గోపీనాథ్, మాలినీదేవి పెళ్లిఫొటోలను ఆమె తీసుకువచ్చినట్టు సమాచారం. ఇరుపక్షాల వద్ద ఉన్న ఆధారాలను వెంకారెడ్డి తీసుకున్నారు. ఆయన అడిగిన మరిన్న పత్రాలను సమర్పించడానికి మరికొంత సమయం కావాలని ఇరుపక్షాలూ కోరాయి. దీంతో.. తదుపరి విచారణను తహశీల్దార్ ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు. మరిన్ని ఆధారాలను 19వ తేదీలోగా సమర్పించాలని ఇరువర్గాలనూ ఆదేశించారు. ఆ పత్రాలను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

### ప్రద్యుమ్నకూ హక్కులు దక్కాలి..

1998లో మాలినితో గోపీనాథ్‌కు వివాహమైందని.. ఆయన తల్లి మహానందకుమారి స్పష్టం చేశారు. గోపీనాథ్ చావే ఒక మిస్టరీ అని.. ఆయన ఎప్పుడు చనిపోయారో తమకు తెలియదని.. కేటీఆర్ వచ్చేవరకూ ఆయన మరణాన్ని ధ్రువీకరించలేదని.. అలా ఎందుకు చేశారో కేటీఆరే జవాబు చెప్పాలని ఆమె సంచలనవ్యాఖ్యలు చేశారు. "గోపీనాథ్ మొదటి భార్య మాలినిదేవే. సునీతతో పెళ్లి నేను చేయలేదు. ఆమె వచ్చాక రెండేళ్లు మాతో కలిసి ఉన్నారు. ఆ తరువాత బయటకు వెళ్లారు. మాలినితో విడాకులకు దరఖాస్తు చేసుకుంటే రద్దయ్యాయి. అందరూ గోపీనాథ్ పిల్లలే. కొడుకుగా ప్రద్యుమ్నకూ హక్కులు దక్కాలి. కుటుంబమంటే అందరూ కలిసిమెలిసి ఉండాలి. ఆమె పోటీ చేస్తున్న విషయం గురించి పార్టీ వాళ్లుగానీ, సునీతగానీ నాకు చెప్పలేదు. గోపీనాథ్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు.. వెంటిలేటర్‌పై ఉన్నాడంటూ నన్ను చూడనివ్వలేదు. కేటీఆర్ అక్కడకు వస్తే.. 'నన్ను చూడనివ్వట్లేదు. నువ్వయినా చెప్పయ్యా' అంటే.. మాట్లాడి వస్తా అని వెళ్లిపోయాడు." అని ఆమె పేర్కొన్నారు.

### రావొద్దని నన్ను బెదిరించారు: తారక్ ప్రద్యుమ్న

తన తండ్రి (మాగంటి గోపీనాథ్) తనతో టచ్‌లో ఉండేవారని.. తరచుగా ఫోన్‌లో మాట్లాడేవారని ప్రద్యుమ్న వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 1న ఆయనను తాను కలిశానని.. ఇద్దరం కలిసి తన భవిష్యత్ ప్రణాళికలపై చర్చించామని ఆయన తెలిపారు.. ఆయన మరణించినప్పుడు నేను అమెరికా నుంచి రావాలనుకున్నా. అక్కడి నుంచి రావడానికి 24 గంటలు పడుతుందని.. అప్పటి వరకూ వేచి చూడడం కుదరదని కొందరు చెప్పారు. 'నువ్వు వస్తే గొడవలు జరుగుతాయి.. రాకుండా ఉండడమే మంచిదని ఇంకొందరు చెప్పారు. ఇప్పుడు ఇండియాకు రావొద్దని వాళ్ల పార్టీ వాళ్లు (బీఆర్ఎస్) బెదిరించారు. ఆ వ్యక్తులు ఎవరన్నది తరువాత చెప్తా. వాళ్లు నాకు ఫోన్ చేసిన కాల్ లాగ్ డీటెయిల్స్ ఉన్నాయి. ఆ సమయంలో వచ్చి గొడవ చేయడం బాగోదని.. గౌరవప్రదంగా నా తండ్రి అంతిమ సంస్కారాలు జరగాలని భావించా. నా జనన ధ్రువీకరణ పత్రంలో తారక్ ప్రద్యుమ్న కొసరాజు అని ఉంది. అప్పటి నుంచి అదే కంటిన్యూ అవుతోంది. పాస్‌పోర్ట్, ఇతర డాక్యుమెంట్లలో నా తండ్రిగా గోపీనాథ్ పేరు ఉంటుంది. మేం ఈ రోజు కొన్ని పత్రాలు తహసీల్దార్‌కు ఇచ్చాం. మరిన్ని పత్రాలు కావాలని అడిగారు. తదుపరి విచారణకు పూర్తి ఆధారాలతో హాజరవుతాం. 3, 4 నెలలుగా మమ్మల్ని మానసికంగా వేధిస్తున్నారు. భయపెడుతున్నారు. కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని వచ్చాం. గోపీనాథ్ అఫిడవిట్‌లో మా పేర్లు లేవన్న విషయం నాకు తెలియదు." అని స్పష్టం చేశారు. కాగా.. వ్యక్తిగత సమస్యలతో గోపీనాథ్, తాను దూరంగా ఉన్నామని, చట్టపరంగా విడాకులు తీసుకోలేదని మాలినిదేవి చెప్పారు.

### ఇన్నేళ్లుగా ఎందుకు రాలేదు?

మాగంటి గోపీనాథ్‌కు, సునీతకు 2000 సంవత్సరం జూలైలో వివాహమైంది. 25 ఏళ్లుగా వాళ్లు కలిసి ఉన్నారు. అక్షర, దిశిర, వాత్సల్య వారి పిల్లలు. ఇన్ని రోజులూ తాము వారసులమంటూ ఎవరూ రాలేదు. సరిగ్గా ఎన్నికల ముందు ఇది జరుగుతోంది. ఇది రాజకీయ కుట్రగా భావిస్తున్నాం. భర్త చనిపోయి సునీత బాధలో ఉన్నారు. గోపీనాథ్ మరణించిన అనంతరం సీఎంలు చంద్రబాబు, రేవంత్, మంత్రి లోకేశ్ తదితరులంతా సునీత కుటుంబాన్ని పరామర్శించారు. పెళ్లి ఫొటోలు, పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, ఇతర డాక్యుమెంట్లు తహసీల్దార్‌కు ఇచ్చాం. వాళ్లు ఏ ఆధారాలూ సమర్పించలేదు. వారి వద్ద ఉన్న కార్డుల్లో గోపీనాథ్ పేరు లేదు. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడుసార్లూ ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన భార్యగా సునీత పేరు, పిల్లలుగా అక్షర, దిశిర, వాత్సల్య పేర్లు ఉన్నాయి. అసెంబ్లీ కార్యదర్శి ఎమ్మెల్యేల భాగస్వాములకు ఇచ్చే కార్డు కూడా సునీత పేరిట ఉంది. బ్యాంకు ఖాతాలు, పాలసీల్లోనూ నామినీగా సునిత పేరే ఉంది. ఈ వివాదంతో ఎన్నికల్లో పోటీకి ఇబ్బంది ఉండదు. తదుపరి విచారణ సమయంలో వాళ్లు ఏ ఆధారాలు సమర్పిస్తారో చూడాలి. దాన్ని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుంది.

## ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టుల మృతి?

వాజేడు/చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తార్లగూడ పరిధిలోని అన్నారం- మరిమల్ల అడవుల్లో మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డీఆర్‌జీ బలగాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. దీంతో రెండ్రోజుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం డీఆర్‌జీ బలగాలు ముమ్మరంగా గాలిస్తుండగా, కాల్పులు జరిగిన ప్రాంతంలో భారీగా ఆయుధాలు లభ్యమైనట్లు సమాచారం. ఈ ఎన్‌కౌంటర్లపై ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు ఇంత వరకు ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు. మృతి చెందిన మావోయిస్టులంతా మద్దేడు ఏరియా కమిటీకి చెందిన వారిగా తెలుస్తోంది. కాల్పులు, ఎదురుకాల్పుల నేపథ్యంలో దండకారణ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని మన్యం ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.



## కాల్పుల విరమణ ఊహించని పరిణామం

- తెలంగాణ మావోయిస్టు పార్టీ నిర్ణయంపై స్పందించిన తూర్పు ప్రాంతీయ బ్యూరో

తెలంగాణ మావోయిస్టు పార్టీ చేసిన కాల్పులు విరమణ ప్రకటన ఊహించని పరిణామని మావోయిస్టు పార్టీ తూర్పు ప్రాంతీయ బ్యూరో (ఈఆర్‌బీ) ప్రతినిధి 'సిగ్నల్' పేరుతో గురువారం ఓ లేఖ విడుదలైంది. తెలంగాణ మావోయిస్టు పార్టీ తెలంగాణ ప్రభుత్వంతో ఏకపక్షంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకుందని ఆ లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ మావోయిస్టు పార్టీ ఎలాంటి నోటీసులు లేకుండా, అధికారికంగా ప్రకటించకుండా, తెలంగాణ ప్రభుత్వానికి లొంగిపోయిందని, కనీసం అక్కడి పరిణామాల గురించి తమకు చెప్పకపోవడం బాధాకరమని తెలిపారు. సీఆర్‌బీ ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్) జరుగుతున్న సాయుధ, నిరాయుధ లొంగుబాట్లు, ఒప్పందాలను ఈఆర్‌బీ ఖండిస్తోందన్నారు. అవి పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించాయని, విప్లవ ఉద్యమంలో ఒడుదుడుకులు సహజమని, వాటిని దాటుకుంటూ తమ పార్టీ ఈ దశకు చేరుకుందని సిగ్నల్ ఆ లేఖలో పేర్కొన్నారు.

## పాత కక్షలతోనే రౌడీషీటర్ హత్య

- చికిత్స పొందుతూ రోషన్ సింగ్ మృతి
- జగద్గిరిగుట్ట ఘటనలో ముగ్గురి అరెస్టు
- రోడ్డుపై జరిగే దుశ్చర్యలను వీడియో తీసి వైరల్ చేస్తే కేసులే : పోలీసులు

జీడిమెట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో బుధవారం జరిగిన హత్యాయత్నం ఘటనలో ఆస్పత్రిపాలైన రోషన్ సింగ్(22) అనే రౌడీషీటర్ చికిత్స పొందుతూ మరణించాడు. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా రోషన్‌సింగ్‌పై దాడి చేసి అతడి మరణానికి కారణమైన మరో రౌడీషీటర్ బాలశౌరెడ్డి(21)తో పాటు సయ్యద్ మహ్మద్(28), రెహ్ ఆదిత్యా అలియాస్ ఆదిల్(26) అనే పాత నేరస్థులను పోలీసులు అరెస్టు చేశారు. పాత కక్షలే రోషన్ సింగ్ హత్యకు కారణమని ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బాలానగర్ ఇన్‌చార్జి డీసీపీ కోటిరెడ్డి గురువారం విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ఐడీపీఎల్ ప్రాంతానికి చెందిన రోషన్‌సింగ్ అలియాస్ రోషన్(22) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. రోషన్ ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రోషన్‌కు జగద్గిరిగుట్టకు చెందిన రౌడీషీటర్ టి.బాలశౌరెడ్డి అలియాస్ బాద్‌షా, సయ్యద్ మహ్మద్, ఆదిల్‌తో స్నేహం ఉంది. మరోపక్క, బాలశౌరెడ్డికి షరీఫ్ అనే వ్యక్తితో కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. తన స్నేహితుడు షరీఫ్‌కు ఏమైనా జరిగితే బాలశౌరెడ్డిని చంపేస్తానని రోషన్ ఓ సందర్భంలో హెచ్చరించాడు. ఈ విషయం తెలిసి రోషన్‌పై పగ పెంచుకున్న బాలశౌరెడ్డి అతడిని అంతమొందించేందుకు మహ్మద్, ఆదిల్‌తో కలిసి పథక రచన చేశాడు. దాని ప్రకారం మాట్లాడాలని చెప్పి బుధవారం సాయంత్రం నాలుగు గంటలప్పుడు రోషన్‌ను జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్‌కు పిలిచారు. ద్విచక్రవాహనంపై అక్కడికి వచ్చిన బాలశౌరెడ్డి, మహ్మద్, ఆదిల్.. రోషన్‌ను చుట్టుముట్టి దాడి చేశారు. రోషన్ పారిపోకుండా మహ్మద్ పట్టుకోగా.. అమెజాన్ వెబ్‌సైట్ ద్వారా కొనుగోలు చేసిన కత్తితో బాలశౌరెడ్డి దాడి చేశాడు. రోషన్ కడుపు, ఛాతీపై పలుమార్లు పొడిచాడు. అనంతరం నిందితులు ముగ్గురూ పరార్వగా.. విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రోషన్‌ను ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోషన్ బుధవారం అర్ధరాత్రి తర్వాత మరణించాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు బాలశౌరెడ్డి, మహ్మద్, ఆదిల్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రక్తంతో తడిచిన దుస్తులు, కత్తి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పుడు కనీసం ఆపడానికి కూడా యత్నించకపోగా.. వీడియోలు తీసి వాటిని వైరల్ చేసే వారిపై కేసులు పెడతామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# తక్షణమే బకాయిలు చెల్లించండి

- లేదంటే డిసెంబరు 1 నుంచి అన్ని పనులు ఆపేస్తాం
- ప్రభుత్వానికి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్పష్టీకరణ
- అప్రాధాన్య పనులకు సంబంధించి రూ.18వేల కోట్లు పెండింగ్
- ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులకు లేఖలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీవీఎన్ రెడ్డి

హైదరాబాద్, రాంనగర్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో డిసెంబరు 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల పరిధిలో జరుగుతున్న పనులను నిలిపివేస్తామని ప్రకటించింది. ఈ మేరకు బీఏఐ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి, రాష్ట్ర చైర్మన్ సురేందర్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో చేసిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగిస్తున్న పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు ఆస్తులను తాకట్టు పెట్టి రుణాలు తెచ్చి మరీ పనులను పూర్తి చేశారని, ఏళ్ల తరబడి బకాయిలు విడుదల కాకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, అప్రాధాన్య పనులను ముందస్తుగా ముగించి తుది బిల్లులు సిద్ధం చేయాలని కోరారు. ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాను ఖరారు చేసి, ఆయా పనులకు నిధులను సమయానికి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అప్రాధాన్య పనుల్లో కొన్ని పూర్తి కాలేదని, ఇంకా కొన్ని కొనసాగుతున్నాయని, ఇలాంటి వాటికి సంబంధించి రూ.12 వేల కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మరో రూ.6 వేల కోట్లు పెండింగ్‌లో పడిపోయాయన్నారు. ఆయా పనులను త్వరగా పూర్తి చేసి, కాంట్రాక్టర్లకు మొత్తం రూ.18 వేల కోట్లను చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇవే అంశాలపై ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులతో పాటు బీఏఐ ప్రతినిధులతో ఈ నెలాఖరులోగా సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులకు గురువారం వినతి పత్రాలు అందజేశామని తెలిపారు.

## 'ఫాతి' సభకు అనుమతులు రద్దు

- అసెంబ్లీ పరిసరాల్లో సభకు అనుమతించబోమన్న పోలీసులు
- హైకోర్టును ఆశ్రయించిన ఫాతి.. నేడు విచారణ
- 11న తలపెట్టిన విద్యార్థుల మహా ర్యాలీ 15కి వాయిదా
- శ్రీ దేవసేనపై 'ఫాతి' వ్యాఖ్యలు అభ్యంతరకరం
- ఖండించిన తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల కోసం నిరవధిక సమ్మె చేస్తున్న ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతి) సభకు ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దుచేసింది. కాలేజీల సిబ్బంది లక్ష మందితో ఎల్బీ స్టేడియంలో శనివారం 'అధ్యాపకుల సాంత్వన సభ' నిర్వహించనున్నట్టు ఫాతి ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి తొలుత అనుమతులు ఇచ్చిన పోలీసు శాఖ.. గురువారం ఆ అనుమతులను రద్దు చేసింది. అసెంబ్లీ పరిసరాల్లో సభలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఎల్బీ స్టేడియం స్థానంలో సికింద్రాబాద్ స్టేడియం, ఉప్పల్ స్టేడియం, లేదా సరూర్‌నగర్ స్టేడియం కేటాయించాలని కోరినా పోలీసులు అనుమతించలేదు. దీనిపై ఫాతి హైకోర్టును ఆశ్రయించింది. శుక్రవారం ఉదయం దీనిపై విచారణ జరగనుంది. ఇక.. 10 లక్షల మంది విద్యార్థులతో 11న నిర్వహించతలపెట్టిన లాంగ్ మార్చ్‌ను 15వ తేదీకి వాయిదా వేసినట్టు ఫాతి అధ్యక్షుడు నిమ్మటూరి రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సగం బకాయిలు చెల్లించనంతరవరకూ సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా.. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, విద్యా శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఐఏఎస్ అధికారి శ్రీదేవసేనపై ఫాతి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. అధికారులుగా తాము రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నామని.. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని.. ఫాతి వ్యాఖ్యలు ఆమె గౌరవానికి భంగం కలిగించాయని సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమెపై చేసిన వ్యాఖ్యలను ఫాతి ప్రతినిధులు వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## డ్రగ్స్ ఓవర్ డోస్.. యువకుడి మృతి!

- ఓ స్నేహితుడు, ఇద్దరు యువతులతో కలిసి ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్న యువకుడు
- లక్డీకాపూల్‌లో డ్రగ్స్ తెచ్చుకున్నట్లు నిర్ధారణ
- అతడి స్నేహితుల్లో ఇద్దరికీ డ్రగ్స్ పాజిటివ్?

హైదరాబాద్ సిటీ/రాజేంద్రనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఓవర్ డోస్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మృతి చెందిన యువకుడితో కలిసి ఉంటున్న స్నేహితుల్లో ఇద్దరికీ డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని కెన్వర్త్ అపార్ట్‌మెంట్స్ ఫ్లాట్ నంబర్-805లో జహనూమకు చెందిన సెల్‌ఫోన్ మెకానిక్ మహ్మద్ అహ్మద్ (26) నివాసం ఉంటున్నాడు. అతనితోపాటు అత్తాపూర్ చింతల్‌మెట్‌కు చెందిన టైల్స్ పనులు చేసే సయ్యద్ బిన్‌సలామ్ (23), నగరానికి చెందిన యువతి షేక్ జారా, కోల్‌కతాకు చెందిన మొమతా బిస్వాస్ కలిసి (కోలివింగ్) ఉంటున్నారు. బుధవారం ఉదయం అహ్మద్ లక్డీకాపూల్ వెళ్లి చిన్న ప్యాకెట్‌లో డ్రగ్స్ తెచ్చుకున్నాడు. రాత్రి డ్రగ్స్ తీసుకొని పడుకోగా, అర్ధరాత్రి 1:30 గంటలకు మరణించాడు. డ్రగ్స్ ఓవర్‌డోస్ కావడం వల్లే అతడు మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు నిర్వహించిన పరీక్షల్లో అతడి స్నేహితుడు సయ్యద్ బిన్ సలామ్, ఓ యువతి సైతం డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఎందుకు ఉన్నారనే కోణంలో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.